ఆదివారం
13 జనవరి
2019

పేజీలు 12
సంపుటి 1, సంచిక 295

www.vijayakranthinews.com

విజయక్రాంతి

నిజం నిర్భయం నిష్పక్షం

హైదరాబాద్ | PUBLISHED SIMULTANEOUSLY FROM HYDERABAD, NIZAMABAD, KHAMMAM | VIJAYAKRANTHINEWS | రూ. 3.00



నాని నిర్మాణంలో సమంత హీరోయిన్ 10



అవినీతిపరుల పనిబడతా

భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల సమరశంఖం పూరించారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో బీజేపీకి ఎదురే లేదని తేల్చి చెప్పారు. ప్రజల సొమ్ము తిన్న ఏ ఒక్కరినీ తమ సర్కార్ వదిలిపెట్టదని పరోక్షంగా కాంగ్రెస్‌కు వార్నింగ్ ఇచ్చారు. కోట్లాది మంది హిందువుల డిమాండైన రామమందిరాన్ని కాంగ్రెస్ ప్రోద్బలంతో వారి అడ్వొకేట్లే అడ్డుకుంటున్నారని చురకలంటించారు. దేశంలోని వేలాదిమంది కార్యకర్తలకు దిశానిర్దేశనం చేసే కార్యవర్గ సమావేశంలో అగ్రవర్ణాల రిజర్వేషన్లను మోదీ పూర్తిగా సమర్థించారు.



- జనం సొమ్ము తిన్న ఏ ఒక్కరినీ వదలను
- కాంగ్రెస్ కాలంలో ఆ పదేళ్లూ అంధకారమే
- దేశం మొత్తం ఇప్పుడు బీజేపీ వైపే చూస్తుంది
- అగ్రవర్ణాల్లో పేదలకు రిజర్వేషన్ ఇన్నేళ్లూ ఎందుకు చేయలేదు..?
- మా హయాంలో దేశంలోని రైతుల సగర్వంగా తిరగాలి..
- బీజేపీ జాతీయ సమ్మేళనంలో ప్రధాని నరేంద్ర మోదీ

విజయక్రాంతి, ఢిల్లీ: తమ సర్కార్ గత నాలుగున్నరేళ్ల కా లంలో చేసిన అభివృద్ధిపనులను చూసిన తరువాత దేశం మొత్తం బీజేపీ వైపు చూస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఢిల్లీలో జరుగుతోన్న బీజేపీ జాతీయ సమ్మేళనంలో రెండో రోజు ఆయన పాల్గొని ప్రసంగించారు. స్వామి వివేకానందుడికి నివాళులర్పించిన అనంతరం మోదీ తన ప్రసంగాన్ని ప్రారంభించారు. "మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి లేకుండా జరుగుతోన్న తొలి జాతీయ సమ్మేళం ఇది. ఆయన ఎక్కడ ఉన్నా మనకు వారి ఆశీస్సులు మాత్రం అందుతాయి. పార్టీ పురోగతిని చూసి ఆయన చాలా సంతోషిస్తుంటారు" అని మోదీ అన్నారు.

(తరువాయి 4లో)


అమల్లోకి ఈబీసీ

రిజర్వేషన్ చట్టం

- 10 శాతం కోటా బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం
- గెజిట్ విడుదల చేసిన కేంద్రం
- రిజర్వేషన్లు ఎవరికి వర్తిస్తాయన్నదానిపై స్పష్టమైన నిర్వచనం

న్యూఢిల్లీ: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన బిల్లుకు రాష్ట్రపతి రామనాథ్ కోవింద్ శనివారం ఆమోదం తెలిపారు. అనంతరం కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను విడుదల చేయడంతో ఈబీసీ రిజర్వేషన్ల చట్టం అమల్లోకి వచ్చింది. దీంతో ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు విద్యాసంస్థల్లో అగ్రవర్ణపేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు మార్గం సుగమమైంది. 124వ రాజ్యంగ సవరణ పేరిట తెచ్చిన ఈ బిల్లుకు ఇటీవల లోక్‌సభ, రాజ్యసభల్లో వెనువెంటనే ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఎన్డీఏ ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చిందని ప్రతిపక్షాలు ఆరోపించినప్పటికీ 2/3 మెజార్టీతో పార్లమెంట్ ఆమోదించింది. దీంతో 10 శాతం కోటా వల్ల బ్రాహ్మణులు, రాజ్‌పుట్లు, జాట్లు, మరాఠాలు, భూమిహార్లు, వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి, క్షత్రియ వంటి పలు సామాజిక వర్గాలు లబ్ధి పొందనున్నాయి. అయితే ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, వెనుకబడిన వర్గాలకున్న 49.5% రిజర్వేషన్లకు ఇది అదనం. దీంతో రిజర్వేషన్లు 59.5% కు చేరాయి. ఈనేపథ్యంలో ఈ బిల్లును సవాలుచేస్తూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ కూడా దాఖలైంది. ఈ బిల్లుతో కోటా పరిమితి 50 శాతం దాటిపోతుందని, ఇది సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమంటూ యూత్ ఫర్ ఈక్వాలిటీ అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అయితే తాజాగా ఈబీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించడంతో కేంద్ర ప్రభుత్వం గెజిట్‌ను కూడా విడుదల చేసింది. దీంతో అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్ చట్టం అమల్లోకి వచ్చినట్లయ్యింది. అయితే ఈబీసీ కోటా కింద ఆర్థికంగా వెనుకబడిన వర్గంలోకి ఎవరెవరు వస్తారన్నదానిపై కేంద ప్రభుత్వం స్పష్టమైన నిర్వచనం ఇచ్చింది.

(తరువాయి 4లో)



నేటితో నామినేషన్ల

గడువు పూర్తి



విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో రెండోవిడత నామినేషన్ల గడువు ఆదివారంతో ముగియనున్నది. సర్పంచులు, వార్డు సభ్యుల నామినేషన్ల ప్రక్రియ ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమైంది. రాష్ట్రవ్యాప్తంగా 4137 గ్రామ పంచాయతీల్లో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతున్నది. ఆదివారం సాయంత్రం 5గంటల లోపల సర్పంచులు, వార్డు సభ్యులకు నామినేషన్లను సమర్పించాల్సి ఉంది. నామినేషన్ల ప్రక్రియ పూర్తికాగానే నిబంధనల ప్రకారం 14వ తేదీన నామినేషన్ల పరిశీలనను అధికారులు చేపట్టనున్నారు. అదే విధంగా 15న రెవెన్యూ డివిజన్ అధికారుల (ఆర్డీఓ)కు పోటీ చేసే అభ్యర్థులు అప్పీల్ చేసుకునే అవకాశం ఉంటుంది. 16వ తేదీన అభ్యర్థుల అప్పీల్‌ను ఆర్డీఓలు పరిష్కరించనున్నారు. 17న అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం గడువు విధించింది. 25వ తేదీన ఉదయం 7గంటల నుంచి 1గంటల వరకూ పోలింగ్ కొనసాగనున్నది. అదే రోజు కౌంటింగ్ పూర్తి చేసి సాయంత్రం వరకల్లా ఫలితాలను అయా రిటర్నింగ్ అధికారులు ప్రకటించనున్నారు.

యూపీలో ఫిఫ్టీ ఫిఫ్టీ..

- చెరో 38 సీట్లలో బీఎస్పీ, ఎస్పీ పోటీ
- ఇతర పార్టీలకు నాలుగు స్థానాలు
- కాంగ్రెస్‌కు అమేథి, రాయ్‌బరేలి
- సీట్ల పంపకంపై మాయావతి, అఖిలేష్ స్పష్టం
- బీజేపీని ఓడించేందుకే చారిత్రక పొత్తని వెల్లడి
- అరాచక కూటమిగా సీఎం యోగి విమర్శ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లో సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి దశాబ్దాల రాజకీయ శత్రుత్వాన్ని పక్కనపెట్టారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కలిసి పోటీ చేయాలని నిర్ణయించారు. శనివారం వారిద్దరు ఏర్పాటు చేసిన సంయుక్త మీడియా సమావేశంలో పొత్తు, సీట్ల పంపకాల గురించి స్పష్టం చేశారు. బీజేపీని ఓడించాలనే ఏకైక లక్ష్యం, ప్రజలకు మేలు చేయాలనే తలంపుతోనే చరిత్రాత్మక పొత్తుకు సిద్ధపడినట్లు వెల్లడించారు.

మొత్తం 80 లోక్‌సభ స్థానాలకు గాను బీఎస్పీ 38, ఎస్పీ 38 స్థానాల్లో పోటీ చేయనున్నట్లు బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రకటించారు. మిగతా నాలుగు సీట్లను ఇతర పార్టీలకు కేటాయించామన్నారు. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు ఆలోచన లేదని అయితే సోనియా, రాహుల్ కోసం రాయ్‌బరేలి, అమేథి స్థానాలను కాంగ్రెస్‌కు వదిలేశామని, ఇక్కడ పోటీ చేయబోమని మాయావతి తెలిపారు.



దేశ రాజకీయాల్లో సరికొత్త విప్లవానికి దారి

ఈ సందర్భంగా బీఎస్పీ అధినేత్రి మాయావతి మాట్లాడుతూ.. తమ పొత్తు దేశ రాజకీయాల్లో సరికొత్త విప్లవానికి దారి తీస్తుందన్నారు. 'దేశ ప్రజల ప్రయోజనాల కోసమే పొత్తు పెట్టుకుంటున్నాం. ఈ పొత్తు రెండు పార్టీల ప్రయోజనాల కోసం కాదు. బీజేపీకి సమాధానం చెప్పేందుకు ఇదొక చారిత్రక సమావేశం. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ప్రత్యామ్నాయం కోసం యూపీ ప్రజలు ఎదురుచూస్తున్నారు. అందుకే బీఎస్పీ, ఎస్పీ చరిత్రాత్మక పొత్తుకు సిద్ధపడ్డాయి..' అని ఆమె అన్నారు. రెండు జాతీయ పార్టీలు యూపీ ప్రజలను మోసం చేశాయని, అందుకే కొత్త రాజకీయ విప్లవానికి తాము నాంది పలికామని మాయావతి తెలిపారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం తమ రెండు పార్టీలు కృషి చేస్తాయని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ పాలన పట్ల దేశ ప్రజలంతా విసుగు చెందారని.. ముఖ్యంగా రైతులు, నిరుద్యోగుల్లో ఎన్డీయే ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. వీరంతా కలిసి ఎన్నికల్లో మోదీకి తగిన బుద్ధి చెబుతారన్నారు.

' కోట్లాది మంది ప్రజలు కేంద్రంలోని బీజేపీపై అసంతృప్తిగా ఉన్నారు. రైతులు, నిరుద్యోగ వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సమాజంలోని కోట్ల మందిని కాపాడేందుకే ఈ పొత్తు. 1993లో బీఎస్పీ చీఫ్ కాన్షీరామ్, ములాయం సింగ్ యాదవ్ కలిసి యూపీ ఎన్నికల్లో పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఇప్పుడు మేం కూడా అదే స్ఫూర్తితో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నాం. ఎస్పీ, బీఎస్పీ పొత్తు పేదలు, కార్మికులు, యువత, మహిళలు, వెనుకబడిన వర్గాలు, దళితులు, మైనార్టీల కోసమే' అని మాయవతి స్పష్టం చేశారు.

రఫేల్ వల్ల బీజేపీ అధికారం కోల్పోతుంది

గతంలో బోఫోర్స్ కుంభకోణం వల్ల కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోతే, ప్రస్తుతం రఫేల్ వల్ల బీజేపీ అధికారాన్ని కోల్పోయే పరిస్థితి తెచ్చుకుందని మాయావతి విమర్శించారు.

(తరువాయి 4లో)

దేశ ఆర్థిక వ్యవస్థను

గుణాత్మక దిశగా నడిపించాలి

- ఆర్థిక సంఘం ఆ మేరకు నడుం బిగించాలి
- రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలి
- ఆర్థిక సంఘానికి సిఫార్సులపై సీఎం కేసీఆర్ సమీక్ష



విజయక్రాంతి, హైదరాబాద్: భారత ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించేందుకు ఆర్థిక సంఘం నడుం బిగించాల్సి వుందని, మూసపద్ధతిలో కాకుండా తన పాత్రను వినూత్నంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం వున్నదని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అభిప్రాయపడ్డారు. కొద్దిరోజుల్లో 15 వ ఫైనాన్స్ కమిషన్ బృందం రాష్ట్ర పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆర్థిక శాఖ, ఇతర సీనియర్ అధికారులతో శనివారం కీలక సమీక్ష నిర్వహించారు. చీఫ్ అడ్వయిజర్ రాజీవ్ శర్మ, చీఫ్ సెక్రటరీ ఎస్ కే జోషీ, ఆర్థిక శాఖ సలహాదారు జిఆర్ రెడ్డి, సిఎంవో అధికారులు నర్సింగ్ రావు, స్మితా సబర్వాల్, సందీప్ సుల్తానియా, మానిక్ రాజ్, స్పెషల్ సిఎస్ రాజేశ్వర్ తివారి, ఫైనాన్స్ సెక్రటరీ రామకృష్ణారావు, పంచాయతీ రాజ్ సెక్రటరీ వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, ఐటి సెక్రటరీ జిటివీ రావు, తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్య కాలం నుంచి రాష్ట్ర, జాతీయస్థాయిలో అనేక పార్టీల ప్రభుత్వాలు వచ్చినాయి పోయినాయి.. కానీ ఎటువంటి గుణాత్మక మార్పును తీసుకురాలేక పోయిన నేపథ్యంలో తిరిగి లోతయిన విశ్లేషణ,ఆత్మావలోకనం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తితో నిరసన వ్యక్తం చేస్తుండడం విచారకరమన్నారు. దీనికి కాంగ్రెస్, బీజేపీ అనే రెండు రాజకీయ వ్యవస్థలే మూలకారణమని సిఎం విమర్శించారు. ' దేశానికి విశాలమైన విత్త విధానం వున్నది. వికేంద్రీకరణ చేయాల్సిన అధికారాలను అందుకు విరుద్ధంగా కేంద్రీకరించారు. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాల విధానాల్లో జోక్యం చేసుకోవద్దని నేను నీతి ఆయోగ్ సమావేశాల్లో పాల్గొన్నప్పుడు స్పష్టం చేశాను. రాష్ట్ర ప్రగతిని దేశ ప్రగతిగా పరిగణించాలి. పురోగతి సాధిస్తున్న రాష్ట్రాలను నిరుత్సాహపరచొద్దు. చిన్న చిన్న నిధులను విడుదల చేయడానికి కూడా అనేక నిబంధనలను విధిస్తున్నారు. రాష్ట్రానికి కేంద్రానికి నడుమ ఉండాల్సిన రాజ్యాంగ సంబంధం రోజురోజుకూ కనుమరుగవుతున్నది. రాష్ట్రాల అధికారాలు, హక్కుల పంపిణీ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న వైఖరి రాష్ట్రాలను కించపరిచే విధంగా వుండడం అత్యంత విచారకరం..' అని కేసీఆర్ అన్నారు. ఫైనాన్స్ కమీషన్ పాత్రను సీఎం ప్రస్తావిస్తూ .. రాష్ట్రాలలో

(తరువాయి 4లో)

దిమాక్ ఖరాబ్



జాగృతి ఆధ్వర్యంలో

అంతర్జాతీయ యువజన సదస్సు

విజయక్రాంతి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ అంతర్జాతీయ యువజన నాయకత్వ సదస్సును నిర్వహిస్తోంది. 19వ తేదీన ప్రారంభ సమావేశానికి అన్నా హజారే ముఖ్య అతిథిగా హాజరవుతారు. నిజామాబాద్ పార్లమెంటుసభ్యురాలు, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఈ సందర్భంగా కీలక ప్రసంగం చేస్తారు. 20వ తేదీన

(తరువాయి 4లో)



పలు రైళ్లు రద్దు

విజయక్రాంతి, హైదరాబాద్: సాంకేతిక పనుల కారణంగా ఇప్పటికే పలు రైళ్లను రద్దు చేయగా తాజాగా మరి కొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేస్తున్నట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. గూడూరు జంక్షన్ రైల్వే స్టేషన్ పరిధిలో గతంలో రద్దు చేసిన రైళ్లతోపాటు పాక్షికంగా మరికొన్నింటిని రద్దు చేశారు. గూడూరు–తిరుపతి మెము తో పాటు ఇరవై రైళ్లను జనవరి 20 వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటవ తేదీ వరకు వివి ధ తేదీల్లో రద్దు చేశారు. గూడూరు–విజయవాడ ప్యాసెంజర్‌తో పాటు 11 రైళ్లను పాక్షిక ంగా రద్దు చేశారు. అదే సమయంలో గూడూరు లో ఎర్నాకులం–పట్నా ఎక్స్‌ప్రెస్‌తో పాటు 11 రైళ్లకు అదనపు హాల్టు కల్పించారు.



కేంద్రంలో అధికారంలోకి వస్తే..

ఏపీకి ప్రత్యేక హోదా..

- దుబాయ్‌లో ప్రకటించిన రాహుల్‌గాంధీ

దుబాయ్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటిస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రకటించారు. రెండురోజుల పర్యటన నిమిత్తం దుబాయ్ వెళ్లిన ఆయన స్థానిక లేబర్ కాలనీలో భారతీయ కార్మికులనుద్దేశించి మాట్లాడారు. 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వెంటనే మేము చేసే మొదటి పని ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వడమేనని రాహుల్ అన్నారు. ప్రత్యేక హోదా సాధన కోసం గతేడాది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన నాయకులు జంతర్ మంతర్ వద్ద ధర్నా చేశారని,

(తరువాయి 4లో)





శుభోదయం

ఓం శ్రీ గురుభ్యోనమః


శ్రీ విళంబి నామ సంవత్సరం
దక్షిణాయణం
హేమంత ఋతువు
పుష్య మాసం

సూర్యోదయం	: ఉ. 06:49
సూర్యాస్తమయం	: సా. 06:00
పక్షము	: శుక్ల పక్షం
తిథి	: సప్తమి 23.41
నక్షత్రం	: ఉత్తరాభాద్ర
యోగం	: పరిఘ 07:36

కరణం	: గరజ 10:58 వనిజ 23:41
రాహుకాలం	: సా. 04:33, 05:56
యమగండం	: మ. 12:24, 01:47
వర్జ్యం	: రా. 11:5, తె. 01:43
అమృతకాలం	: లేదు







సూక్తి సుధ

కోరికలు మితంగా ఉంటే, బాధలూ తక్కువగానే ఉంటాయి

– రమణ మహర్షి

తిరుప్పావై పాశురం–29

శిత్తుమ్ శిఱుకాలే వన్దున్నై చ్చేవిత్తు, ఉన్
పొత్తామరై యడియే పోత్తుమ్ పొరుళ్ కేళాయ్
పెత్త మ్మేయ్‌త్తుణ్ణు జ్కులత్తిల్ పిఱన్ద నీ
కుత్తేవ లెజ్గళై క్కొళ్ళామల్ పోకాదు
ఇత్తైప్పఱై క్కొళ్ళా వన్దుకాణ్ గోవిన్దా!
ఎత్తైక్కు మేళేళుపిఱవిక్కుమ్ ఉన్దన్నో
డుత్తోమే యావో మునక్కే నామాళ్ శెయ్‌వోమ్
మత్తైనజ్గామజ్గళ్ మాత్తే లోరెబ్బాయా



'చిన్న పిల్లలు. అందులో ఆడపిల్లలు లేవజాలని చలికాలంలో తెల్లవారుటకు ముందు అనాదియగు అజ్ఞానాంధకారం తొలగి భగవద్విషయమగు జ్ఞాన ప్రకాశం కలుగు కాలంలో, అనగా చట్టి వేకువలో లేచి నీవు వేంచేసిఉన్న చోటుకే మేము వచ్చి, నిన్ను సేవించి, అనగా పూజాద్రవ్యాలను దాల్చి, పెరుమాళ్ళ సన్నిధికి చేరెదం అనుమాటనే అధికంగా భావించు నిన్ను' అని తాత్పర్యం. మిక్కిలి విలువ గలవియై భోగ్యములై బంగారు తామరపూవులవలె సుందరాలు, స్పృహణీయాలు అయిన నీ పాదాలకు మంగళం పాడుటలో అభిప్రాయాన్ని విను.

ఎల్లప్పుడును వేదాలలో మాత్రమే వినబడు నీవు పశువులను మేపుకొని జీవించవలసిన గొల్లజాతికి వచ్చి పుట్టి మా సేవను స్వీకరించక ఉండరాదు. మా చేత ఆంతరంగిక కైంకర్యాలను స్వీకరించి తీరవలయును. శబ్దాది విషయాలే శరీరాన్ని నిలబెట్టు సాధనాలుగా కలిగిఉన్న మాకు నీ దివ్యమంగళ విగ్రహ సౌందర్యాన్ని చూసి తిను అన్నం, మంచి నీరు, తాంబూలం అన్నియూ ఆశ్రిత సులభుడైన నీవే స్వామి అనునట్లు చేసి మా స్వరూపానుగుణమగు కైంకర్యం ఒసంగుకుండుట నీకు తగదు.

నీ నుండి పరను పుట్టుకొనుటకు వచ్చిన వారం కాదు. ఏనాటికిని ఏడేడు జన్మలకును నీతో విడరాని బంధుత్వం కలవారు కావలయును. నీకు మాత్రమే సేవలు చేసేవారం కావలయును. మాకు ఇతరాలైన కోరికలేమి లేకుండునట్లు అనుగ్రహించు".

మార్గశీర్ష మాసంలో గోపికలు తమ పెద్ద అనుమతితో వర్షం కోసం చేసిన వ్రతమే ఈ ధనుర్మాస వ్రతం. పెద్దల తృప్తికోసం తాము స్నానవ్రతం నాచరింతుమని, ఆ వ్రతానికి పరయును, వాద్యం కావలెనని బయలుదేరి శ్రీకృష్ణుని సన్నిధి చేరి ఆ పరనిచ్చి తమకావ్రతాన్ని పూర్తి చేయించి దాని ఫలంగా అలంకారాలను పరమాన్న భోజనాన్ని చేయింపుమని ప్రార్థించిరి.

ఇది వారి మనసులోని అసలు మాట కాదు. శ్రీకృష్ణ భగవానునితో కలిసి ఎడబాటు లేకుండగా స్వామికి కైంకర్యం చేయాలనేదే అసలైన అభిప్రాయం. స్నానమనగా భగవత్ ప్రాప్తి, పరయనగా భగవంత్కైంకర్యమని వారి అభిప్రాయం.

ఈ వ్రతాన్ని భగవంతుని చేరవలెనని కోరే వారందరూ చేయదగిన వ్రతం. వ్రతం ఆచరించుటకు ముందుగా భగవత్సంబంధులతో సంబంధమేర్పరచు కొనవలయును. దాని తర్వాత శమదమాది ఆత్మగుణోపేతులై ఆచార్య సమాశ్రయణాన్ని గావించాలి. తరువాత మంత్రోపదేశం పొంది మంత్రార్థంను తెలియచేయవలయును. ఉపాయం భగవంతుడైనను జీవులు సర్వేశ్వరు నాశ్రయించునపుడు ఇద్దరిని కలిపెడి అమ్మవారిని ఆశ్రయించవలెను. ఆమె ద్వారా స్వామియే ఉపాయమని నిశ్చయించుకొని స్వామి కటాక్షపాత్రులు కావలెను. తరువాత స్వామిని దర్శించి మంగళాశాసనం గావించి భగవత్కటాక్షంతో స్వరూప జ్ఞానాదులను ఆపేక్షించి ముక్తులమై, బ్రహ్మాలంకారాధ్యలంకృతులమై నిన్ను చేరి సాయుజ్యం నొందవలెనని ప్రార్థించవలెను. ఇదియే సంసారం నుండి విడివడి భగవానుని చేరి భగవనుభవం వరకు చేయవలసిన ప్రక్రియ. ఈ ప్రక్రియనే 27 పాశురాలలో చెప్పి ఉన్నారు.

ముఖ్యంగా తెలియదగిన రెండు విషయాలను 28, 29 పాశురాలలో వివరించి వ్రతాన్ని ముగించుచున్నారు. 30వ పాశురంలో ఫలాన్ని వివరించారు.

28వ పాశురంలో ఉపాయం శ్రీకృష్ణుడే అని ధృఢంగా చెప్పి తమకు తాముగా ఆర్జించుకొన్న జ్ఞానం సత్కర్మాచరణం లేదని నిర్హేతుక కృపతో తమ కులంలో పుట్టిన శ్రీకృష్ణుడే తమ పుణ్యమని అతనికి తమకు విడదీయరాని సంబంధం కలదని మేము అతని వారమని, తమను స్వామి అయిన అతనే కాపాడి పురుషార్థాన్ని ప్రసాదించగలదని చెప్పారు.

29వ పాశురంలో ఫలాన్ని తెలుపుతున్నారు. ఈ ఫలాన్ని పొందగల అర్హత తమకే కలదని, 'నమక్కే' అని తెలిపి ఈ అర్హతనే ఈ చివరి రెండు పాశురాలలో తెలుపుచున్నారు.

అనన్య భోగ్యత్వం, అనన్యోపాయత్వం, అనన్యార్హత్వం ఈ మూడు జీవుని స్వరూపాలు.

అనగా భగవానుడే తప్ప ఇతర విషయాలను అనుభవింపవలెనని కోరిక లేకుండుట (అనన్య బోగ్యత) భగవానుని పొందుటకు భగవానుడు తప్ప ఇతర ఉపాయం కాదని నమ్మి ఉండుట (అనన్యోపాయత్వము) భగవానునికి తప్ప ఇతరునికి తానేవిధముగను చెందకుండుట (అనన్యార్హత్వం) ఇవియే జీవుని లక్షణాలు. ఇవి కలవారే భగవత్ప్రాప్తికి అర్హులు.

ఈ వ్రతాన్న గోపికలు రెండుమారులు తమ పరిశుద్ధిని వివరించిరి. ఆ రెండు ఉపాయ పరిశుద్ధి ఫలపరిశుద్ధి. ఈ రెంటిని ఈ రెండు పాశురాలలో తెలుపుచున్నారు.

భగవానుడే ఉపాయం అని భావించిన వారికి తాము చేసిన కర్మ జ్ఞాన భక్త్యాదులలో ఉపాయ భావనా రుచి, వాసనలతో లేకుండా పోవాలి. అంతేకాదు భగవానుని ఉపాయంగా స్వీకరించుట, ఉపాయమనెడి బుద్ధి కూడా ఉండరాదు. అటువంటి భావన మనం ఉన్నచో శవస్మర్శ వలె అపవిత్రత ఏర్పడును. ఇలాంటి అపవిత్రత లేకపోవుట ఉపాయ పరిశుద్ధి.

భగవంతుని పొంది భగవత్కైంకర్యం తన ప్రీతికే అనుకొనుట రెండవ అపవిత్రత. ఈ రెండు అపవిత్రతలలో

భగవదనుభవాన్ని పొందుట విషాహారాన్ని లేదా ఎంగిలిని తిన్నట్లు దోషకార్యం అగును. ఆ దోషాలు లేకుండుటచే ఫలపరిశుద్ధి.

గోపికలకు ఈ రెండు పరిశుద్ధులు కలవు. 28వ పాశురాన ఉపా పరిశుద్ధిని తెలిపారు. ఈ పాశురాన ఫలపరిశుద్ధిని వివరిస్తున్నారు.

ఇట్లు వెనుకటి పాశురాన ఈ పాశురాన ఉపాయ విరోధి, స్వరూప విరోధి ప్రాప్తి విరోధి, ప్రాప్య విరోధియగు నాలుగు విరోధులు పరిహరించబడినవి. వెనుకటి పాశురాన జ్ఞానం మొదలగు ఇతరోపాయాలు తమకేవి లేవని చెప్పుటంతో భగవానుడే ఉపాయాన్ని నిశ్చయానికి ప్రతిబంధకాలైన ఉపాయాంతర సంబంధం లేదని తెలిపారు.

భగవంతుని చేరుటకు వెనుక చేసిన అపరాధాలు ప్రతిబంధాలుగా నిలువకుండగా క్షమాపణ చెప్పారు. ఇట్లు ప్రాప్తి ప్రతిబంధకాలుగా ఉండు పూర్వాపరాలు లేవని కూడా తెలిపారు. బాహ్య విషయాలలోని సంగమాన్ని విడిచి, భగవద్విషయాలపై రుచితో పొందనిదే ఉండలేక, ఆర్తితో చేరితిమనుటతో ఆత్మస్వరూప విరోధి సంబంధం లేదని తెలుస్తోంది.

మాకితరాలైన కోరికలు ఉండకూడదనుటలో భగవతనుభవం తనది అని కాని, తాననుభవిస్తున్నానని బుద్ధి కూడా ఉండరాదని తెలుపుటచే ప్రాప్యవిరోధి కూడా లేదని తెలుస్తున్నారు.

ఇట్లు అన్ని ప్రతిబంధకాలు తొలిగి భగవంతునకే సర్వదేశ సర్వ కాల సర్వావస్థల్లో నిరంతరాయంగా కైంకర్యం చేస్తూ, చేయు కైంకర్యం కూడా భగవంతుని కొరకే భగవానుడే చేయించుకొంటున్నాడనే భావనతో ఉండుటయే తమకు పురుషార్థమని గోపికలు ఈ పాశురాన తమ ప్రతిఫలంగా వివరించారు.

ఈ పాశురాన అష్టాక్షరీ మంత్రార్థమును కూడా వివరించి ఉంది.

'గోవిందా: నీకు' అను మాటతో సర్వజగత్కారణము సర్వజగద్రక్షకుడగు పరమాత్మకే అని ఆకారార్థము చెప్పెను.

'నీకే' అని ఏకారంలో 'ఓం' లోని ఉకారార్థం సూచింపబడింది. మేము అను దానితో మకారార్థం జీవనసముదాయం తెలిపింది. ఇట్లు ప్రణవార్థము వివరించారు.

నీతో సర్వవిధ బంధుత్వం కలవారమని చెప్పుటచే నారాయణ శబ్దార్థం తెలిపింది. ఎప్పటికి ఏడేడు జన్మలకు అని చెప్పుట వల్ల 'ఆయ' అను చతుర్థీ విభక్త్యర్థమును తెలుపుచున్నది.

ఇట్లు తెలుపుట వల్ల మూత మంత్రం వల్ల ప్రతిపాదించే పరమార్థమే తన వ్రతానికి పరమోద్దేశ్యమని ఈ పాశురాన తెలుపుతోంది.

అజ్ఞానం చుట్టుబడి, కటిక చీకటి నిండిన జీవితంలో, సత్త్వము దయించిన వెంటనే భగవంతునియందు అభిముఖ్యం కలిగి, భగవంతుని సమీపించి సేవించాలి. భగవంతుని దివ్యమంగళ విగ్రహ సౌందర్యాన్ని అనుభవించవలయును. ఈ అనుభవం అవిచ్ఛిన్నంగా, సమృద్ధిగా ఉండుటకు ఆ దివ్యసౌందర్యానికి మంగళాశాసనము చేయవలయును. భగవదాభిముఖ్య ము, మనకు కలుగునట్లు చేసుకొనవలయును. 'భగవంతుడు అవతారంనెత్తి శ్రమించునది మా కొరకే కాదా' అని విన్నవించి ఆర్తిని వెల్లడించాలి. నీవుకాక మాకు వేరొక ఫలాన్ని కోరుట లేదని స్వామిజి విన్నవించాలి. నిత్యం కైంకర్యాన్ని అర్థించవలయును. మనకు స్వరూపోపాయ పురుషార్థములను పొందుటలో కలుగు ప్రతిబంధకాన్ని తొలగించమని ప్రార్థించవలయును. ఇట్లు విన్నపం గావించుకుని శ్రీకృష్ణ భగవానుని దివ్యముఖారవిందాన్ని దర్శించడమే జీవిత పరమార్థమని, ఇదే ఈ వ్రతానికి పరమోద్దేశ్యమని తెలుస్తోంది.

– డా|| బాలుశర్మ పన్నాల
(వేద పండితులు)



నేడు మార్తాండ సప్తమి

సూర్యనారాయణమూర్తి ప్రత్యక్షదైవం. సూర్యునితోనే ఈ సృష్టి ముడిపడి ఉంది. సూర్యుడు లేని జగత్తును ఊహించలేం. సకల జీవకోటికి ప్రాణాధారం సూర్యభగవానుడు. సూర్యనారాయణుడు త్రిమూర్తుల ప్రతిరూపం.

12 మాసాలు – 12 సూర్యులు

1. చైత్రమాసం –ధాత
2. వైశాఖమాసం – ఆర్యముడు
3. జ్యేష్టమాసం – మిత్రుడు
4. ఆషాఢమాసం – వరుణ
5. శ్రావణమాసం – ఇంద్ర
6. భాద్రపదమాసం – వివస్వాన
7. ఆశ్వీయుజ మాసం – పుషా
8. కార్తీకమాసం – పర్జన్య
9. మార్గశిర మాసం – అంజుమన్
10. పుష్యమాసం – భగ
11. మాఘమాసం – తష్ట్వా
12. ఫాల్గుణమాసం – విష్ణు

పుష్యమాసం – భగ

శుక్లపక్షంలో వచ్చే సప్తమిని మార్తాండ సప్తమి అంటారు. సూర్యుడు పుష్యమాసంలో 'భగ' అనే పేరును ధరించి అరిష్టనేమి ఋషి, కర్కోటక సర్పము, పూర్వచిత్తి అప్సరస, స్ఫూర్జ రాక్షసుడు, ఆయువు యక్షుడు, ఊర్ల గంధర్వుడిని వెంటబెట్టుకుని సంచరిస్తూ ఉంటాడు. రక్తవర్ణంతో పదకొండు వేల కిరణాలతో ప్రకాశిస్తూ ఉండే భగసూర్యుడిని పుష్యమాసంలోని ఆదివారాల్లో 'విష్ణవేనమః' అనే మంత్రంతో పూజించి దానిమ్మ పండ్లు, నువ్వులు, బియ్యం కలిపి ఉంచిన నువ్వుల అన్నాన్ని నైవేద్యంగా సమర్పించాలి. ఈ మాసంలో 'ఆదిత్యహృదయం' చదవడం శ్రేష్టం. ఈ నెలలో భగసూర్యారాధన వల్ల ఐశ్వర్యం సిద్ధిస్తుంది.

సప్తమి విశేషం

వినాయకుడికి చవితి. శివుడికి చతుర్దశి. సుబ్రహ్మణ్యస్వామికి షష్ఠి సూర్యుడికి సప్తమి తిథులు ప్రీతికరం. సంవత్సరంలో వచ్చే ప్రతి సప్తమి సూర్యారాధనకు ముఖ్యం. సప్తమి తిథుల్లో సూర్యారాధన చెప్పారు.

నెలకు రెండుసార్లు సప్తమి వస్తుంది. సంవత్సరంలో సప్తమి తిథులు మొత్తం 24 ఉంటాయి. వీటిని హేమాద్రి కల్యాణ సప్తమి, కమలసప్తమి, శర్కరసప్తమి, అచలా సప్తమి, రథాంకసప్తమి, మహాసప్తమి, జయాసప్తమి, విజయాసప్తమి, జయంతీసప్తమి, అపరాజితాసప్తమి, మహా జయ సప్తమి, నందాసప్తమి, సిద్ధార్థ సప్తమి, సాక్షుభార్యసప్తమి, సర్వసప్తమి, మార్తాండ సప్తమి, సూర్యసప్తమి, సప్త సప్తమి, అర్క సంపుటసప్తమి, నింబసప్తమి, మరీచసప్తమి, ఫలసప్తమి, భద్రాసప్తమి, ఆనందసప్తమి. ఇందులో 'రథసప్తమి' ప్రసిద్ధం.

డా|| పి. భాస్కరయోగి

వేటిని ఎలా నియంత్రించాలి?



చాణక్యం

శ్లో|| హస్తీ అంకుశ హస్తేన వాజీ హస్తేన తాడ్యతే।
శృంగీ లగుడ హస్తేన ఖడ్గ హస్తేన దుర్జనః||

ఏనుగును చేతిలోని అంకుశంతోను, గుఱ్ఱమును చేతిలోని కొరడాతోను, కొమ్ములు గల జంతువును చేతిలోని కర్రతోను, దుర్జనుని చేతిలోని ఖడ్గంతోనూ వశపరచుకొనాలని చాణక్యుల వారు తమ నీతిశాస్త్రంలో తెలియచేశారు. పైన వివరించిన అంశాల్లో ఎవరిని ఏ విధంగా వశపరుచుకోవాలో తెలుసుకుందాం. ఏనుగు అంటే పెద్దదైన జంతువు. దాన్ని వశపరుచుకోవడం అంటే మాటలు కాదు. ఈ జంతువును లొంగదీసుకోవడానికి మావటివాడు అంకుశాన్ని ఉపయోగిస్తాడు. అంకుశాన్ని తలమీద పొడుస్తుంటే దానికి చాలా నొప్పిపుట్టి మావటివాడు చెప్పినట్లలా చేస్తుంది. అలాగే గుర్రాన్ని ఇంకో విధంగా లొంగదీసుకుని పనిచేయిస్తారు అశ్వికులు. గుర్రాన్ని కొరడాతో కొట్టి కావలసిన విధంగా నియంత్రిస్తుంటారు. వీనిలో కొన్ని సాధు స్వభావంతో ఉంటాయి. అవి చెప్పినట్లలా చేస్తుంటాయి. అలాంటి వాటిని వాటికి కావలసిన పదార్థాల ద్వారాను, ప్రేమతోనూ వశపరుచుకుంటారు. కొన్ని మాట వినని మొండి జాతి జంతువులను మాత్రం ఆయుధాలతో బెదిరించి చెప్పినట్టుల్లా పనిచేయించుకుంటారు. అలాగే కొమ్ముల గల జంతువులను అంటే ఎద్దులు అలాంటి జాతులను కర్రతో కొట్టడం ద్వారా వశపరుచుకుంటారు. దుర్జనులు అంటే చెడుగా ప్రవర్తించేవారు, చెప్పిన పని చేయనివారు, మొండిగా ప్రవర్తించేవారిని ఖడ్గం లేదా కత్తితోనూ కొట్టి వశపరుచుకోవాలంటున్నారు.

– యామిజాల సుబ్రహ్మణ్యం

గ్రహం అనుగ్రహం



మేషం

వ్యాపారస్తులకు ఈ వారం అనుకూలంగా ఉంటుంది. మంచి ఫలితాలుంటాయి. సంఘంలో ఆదరణ పెరుగుతుంది. ఉద్యోగస్తులు తమ విధుల్లో చాలా చాలా జాగ్రత్తగా ఉండాలి. పొరబాట్లు జరిగే అవకాశమున్నది. ముందు జాగ్రత్తలు అవసరమవుతాయి. వారాంతములో చేపట్టిన పనుల్లో శ్రద్ధ వహించాలి. మానసిక ఆందోళన కలుగుతుంది. ఇంటి విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. కొన్ని వృధా ప్రయాణాలుంటాయి.

పరిహారం: తేనె నైవేద్యంగా శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి సమర్పించాలి



వృషభం

ఈవారం విందు వినోదాల్లో పాల్గొంటారు. స్థాన చలన మార్పులు కనిపిస్తున్నాయి. వృధా సంచారాలు. ఖర్చులు పెరుగుతాయి. ఇష్టకార్య సిద్ధి కలుగుతుంది. మనోభీతి పెరుగుతుంది. అజీర్ణం, నరాల బాధలు ఇబ్బంది పెడతాయి. అనుకోని బాధలు, ఇబ్బందులు కలుగుతాయి. చేపట్టిన కొన్ని పనులు పూర్తికానందున కోపము, ఆవేశాలు పెరుగుతాయి. స్త్రీలు తమ ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి.

పరిహారం: బుధ గ్రహానికి అర్చన జరిపించండి



మిథునం

బంధువులను కలుసుకునేందుకు ఈ వారం ప్రయాణాలు చేస్తారు. సమయం వృధా అయ్యే పరిస్థితులు ఎదురవుతాయి. అనుకోని ఆపదలు ఇబ్బందులు కలిగిస్తాయి. శక్తికి మించిన పనులు చేయవద్దు. పాడి పంటలు వృత్తులుగా వున్నవారు తమ పశువుల ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. అధికారుల ఆగ్రహానికి గురి అయ్యే సూచనలున్నాయి. ఆర్థిక ఇబ్బందులు ఒత్తిడికి గురిచేస్తాయి.

పరిహారం: 'శ్రీరామ' నామాన్ని... ఎక్కువసార్లు జపించండి



కర్కాటకం

స్త్రీల ఆహారం విషయంలో వేళ తప్పి భుజించుట వల్ల ఆరోగ్యంలో సమస్యలు తలెత్తుతాయి. ఎదుటివారితో ఎలా మాట్లాడినా తప్పుగానే భావిస్తారు. మీ అభిరుచులకు తగిన విధంగా కుటుంబ సభ్యులు మసలుకుంటారు. మీ వాహనాలు ఇతరులకిచ్చి ఇబ్బందులను ఎదుర్కొంటారు. ప్రయాణాలు అనుకూలించవు. సంఘపరమైన విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించండి. లాభదాయకమైన కొన్ని అవకాశాలను కార్యరూపంలో పెట్టగలుగుతారు.

పరిహారం: మహాగణపతిని దర్శించండి



సింహం

మీలో ఉన్న ఉత్సాహాన్ని అదుపులో ఉంచుకోవడం మంచిది. చిన్నచిన్న సమస్యలెదురైనా పరిష్కరించుకుంటారు. రాజకీయ నాయకులు, సభలు, సమావేశాల్లో చురుకుగా పాల్గొంటారు. విద్యుత్ రంగాల వారికి అధికారుల నుంచి ఒత్తిడి, చికాకులు అధికమవుతాయి. రుణాలు తీర్చి తాకట్టుపెట్టిన నగలు, వస్తువులు విడిపించుకుంటారు. కోర్టు వ్యవహారాలు వాయిదాలతో అసహనం పెరుగుతుంది. తొందరపడి డబ్బును వృధా చేయవద్దు.


పరిహారం: రావిచెట్టుకు 21 సార్లు ప్రదక్షిణ చేయండి




కన్య

రాజకీయాలలో వారికి మంచి గుర్తింపు లభిస్తుంది. ఎప్పటినుంచో వాయిదా పడుతూ వస్తున్న పనులు పునఃప్రారంభమవుతాయి. స్త్రీలు పనివారితో ఇబ్బందులు ఎదుర్కొంటారు. దైవ కార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. ప్రముఖులను కలుసుకుంటారు. మీ బలహీనతలు, అలవాట్లు ఇబ్బందులకు దారితీస్తాయి. అనవసర విషయాల్లో జోక్యంచేసుకోవద్దు. సమాచార లోపాలు తలెత్తుతాయి.

పరిహారం: పార్వతీ అమ్మవారిని పూజించి పాయసం నివేదించండి




-రాయప్రోలు
మల్లికార్జున శర్మ
99890 77388



తుల

కార్యసాధనలో ఓర్పు, పట్టుదల ముఖ్యమని గమనించండి. ప్రేమికులకు పెద్దల నుంచి ఆశించిన సహాయసహకారాలు పొందలేకపోతారు. అప్పులకోసం కోసం ప్రయత్నాలు చేస్తారు. ఆలయాలను సదర్శిస్తారు. నిరుద్యోగులకు పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి ఆశించిన సంస్థలలో అవకాశాలు లభిస్తాయి. ఉద్యోగస్తులకు విశ్రాంతి లభిస్తుంది. అనుకోని అవకాశాలతో కూడిన పరిచయాలు ఏర్పడుతాయి. ఆరోగ్యం కుదుటపడుతుంది.


పరిహారం: శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ చేసుకోండి.



వృశ్చికం

రవాణా రంగాల్లో వున్నవారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారు. కొత్త ఉద్యోగ అవకాశాలు వచ్చినప్పటికీ వాటిని సద్వినియోగం చేసుకోలేకపోతారు. దైవ కార్యక్రమాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. విదేశాలకు వెళ్లాలనే మీ కోరిక మరింతబలపడుతుంది. మిత్రుల నుంచి ఆశ్చర్యకరమైన వార్తలు వినవలసి వస్తుంది. దాచుకున్న ధనం విషయంలో దుబార ఖర్చులకు అవకాశమివ్వవద్దు. కళారంగాల్లో వున్నవారు జాగ్రత్తలు తీకుకోవాలి.


పరిహారం: సుబ్రహ్మణ్య స్వామిని పూజించండి



ధనుస్సు

మీ కుటుంబ సభ్యుల మొండివైఖరి ఎంతో చికాకు కలిగిస్తుంది. దూర ప్రయాణాల ఏర్పాట్లు ఫలించక పోవచ్చు. ముఖ్యమైన విషయాల్లో ఇతరులకు బాధ్యతలు అప్పచేప్పవద్దు, ప్రతీ విషయాన్ని స్వయంగా తెలుసుకోవాలి. సోదరీ, సోదరుల మధ్య ఏకాగ్రత లోపం అధికమవుతుంది. శత్రువులు మిత్రులుగా మారి సహాయ సహకారాలు అందిస్తారు. స్నేహితుల మధ్య చిన్నచిన్న కలహాలు ఏర్పడతాయి.


పరిహారం: గోసేవ ఉత్తమ ఫలితాలను కలుగజేస్తుంది



మకరరాశి

బోధనా రంగాల్లో ఉన్నవారికి తప్పని విధులు ఒత్తిడిని కలిగిస్తాయి. సన్నిహితులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. మీ కోపాన్ని, చిరాకును ఎదుటివారి మీద ప్రదర్శించడం మంచిది కాదు. శక్తికి మించిన హామీలు ఇచ్చి ఇబ్బందులు పడవద్దు. దైవారాధన పట్ల ఆసక్తి పెరుగుతుంది. మీ అభిరుచులకు తగిన విధంగా కుటుంబ సభ్యులు వ్యవహరిస్తారు. వ్యాపారాలు నిదానంగా కొనసాగుతాయి.

పరిహారం: విష్ణుమూర్తికి వడపప్పు, పానకం నివేదన చేయండి



కుంభం

వ్యాపారస్తులు జాగ్రత్తగా ఆలోచించి పెట్టుబడులు పెట్టాలి. గృహము, వాహనాలు కొనుగోలు చేయాలన్న తపన పెరుగుతుంది. సరిపోని ధనం ఒత్తిడికి గురిచేస్తుంది. వాయిదాలతో కూడిన అవకాశాలకోసం ప్రయత్నాలు చేస్తుంటారు. కొన్ని ఇబ్బందుల నుంచి బయటపడతారు. గృహం ప్రశాంతంగా ఉంటుంది. ఇతరులపై ఆధారపడక స్వశక్తితోనే మీ పనులు పూర్తి చేసుకోవడం శ్రేయస్కరం. విందు, వినోదాలలో పరిమితి పాటించండి.

పరిహారం: శివారాధన వలన మేలు కలుగుతుంది




మీనం

అన్ని రంగాల వారికి శుభకరముగా ఉంటుంది, చేపట్టిన, తలచిన పనులు అవలీలగా పూర్తి అగును, కొన్ని విషయాల్లో మాత్రం మనోవిచారము తప్పక పోవచ్చు. . ఆరోగ్యం బాగుంటుంది. దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. అప్పులవలన ఒత్తిడి ఎదుర్కొనవలసి వస్తుంది. ధనలాభం, ఆదాయంలో వృద్ధిని పొందడం జరుగును. కుటుంబ విషయాల్లో ఆశించిన ప్రయోజనాలు చేకురుతాయి. పిల్లల ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు అవసరం.

పరిహారం: అష్టలక్ష్మి స్తోత్రం పారాయణ చేయండి





ఆత్మ శుద్ధిలేని యాచార మదియేల
భాండ శుద్ధిలేని పాకమేల
చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా
విశ్వదాభి రామ వినుర వేమ

భావం: మనసు నిర్మలంగా లేకుండా దుర్బుద్ధి అలోచనతో ఎన్ని ఆచారాలు పాటించినా ప్రయోజనమేమిటి? వంట పాత్ర శుభ్రంగా లేని వంట ఎందుకు ? అపనమ్మకంతో దురాలోచనతో చేసే శివ పూజ ఎందుకు ? (ఇవన్నీ వ్యర్థం అని వేమన భావన).

సుఖం మిన్నా.. శక్తి మిన్నా..?

వికాసమే విజయం

- పని చేస్తున్నంత సేపూ అందులో నిమగ్నులమై సుఖానుభూతి పోందుతుంటే, జీవితం ఆనందమయం అవుతుంది. పనిని భారంగా, నిరాశ నిస్పృహగా భావిస్తున్నప్పుడు, జీవితం బానిసత్వం అవుతుంది.
- ప్రజ్ఞను శ్రమ రూపంలో ప్రదర్శిస్తే, పరిశ్రమ మెరుగుపడుతుంది. తద్వార పరిశ్రమ ప్రజ్ఞావంతుడి ప్రజ్ఞను గర్తించి అతని ఉద్ధరణకు దోహదపడుతుంది.
- జీవితంలో ఎక్కడో, ఎప్పుడో వచ్చే అదృష్టాన్ని నమ్ముకునే కన్నా, చేతిలో ఉన్న శ్రమను నమ్ముకోవటం ఎంతో ఉత్తమం. ఎక్కువ ఫలితాలను ఇచ్చేది కేవలం అలుపెరుగని శ్రమ మాత్రమే! అన్ని సమకూరి సుఖాలనుభవిస్తే ఒకదశలో ఆ సుఖం మీదే విరక్తి వస్తుంది. శక్తివంతులుగా మారి కొత్త పుంతలు తోక్కుతుంటే ఇంకా ఏదో సాధించాలి అనే నిరంతరాశక్తి కలుగుతుంది.
- సుఖమయ జీవితానికై మనం ప్రార్థించకూడదు, శక్తిమంతులుగా మారాలని ప్రార్థించాలి.
- మన శక్తులకు సరిపోయే పనులే దొరకాలని ప్రార్థించకూడదు, మన ముందున్న పనులకు చాలినంత శక్తి సమకూరాలని ప్రార్థించాలి! తేలికైన బరువులకై ప్రార్థించకూడదు, ఎంతటి బరువులనైనా మోయగల భుజబలానికై ప్రార్థించాలి.

సిద్ధాశ్రమంలో యాగం దిగ్విజయంగా

ప్రవచనం

– డా॥ శ్రీ చాగంటి కోటేశ్వర రావు

విశ్వామిత్ర మహర్షి తాటక వృత్తాంతాన్ని చెప్పి సంహరించమనగా అందుకు రాముడు..

పితుర్ వచన నిర్దేశాత్ పితుర్ వచన గౌరవాత్ |
వచనం కౌశికస్య ఇతి కర్తవ్యం అవిశఙ్కయా ||
గో బ్రాహ్మణ హితార్థాయ దేశస్య చ హితాయ చ |
తవ చైవ అప్రమేయస్య వచనం కర్తుం ఉద్యతః ||

'మా తండ్రిగారు మీరు ఏది చెయ్యమంటే అది చెయ్యమన్నారు, గురువుగారైన మీరు చెప్పారు కనుక, లోకాన్ని రక్షించడం కోసం, బ్రాహ్మణులను, గోవులను, ఇక్కడ ఉంటున్న అన్ని ప్రాణులను కాపాడడం కోసం, సుక్షత్రియుడనైన నేను, తాటకని, తప్పక సంహరిస్తాను' అని రాముడు తన ధనుస్సు తీసుకొని, ధనుష్టంకారం చేశాడు, ఆ ధ్వని విన్న తాటకి, అది ఎటువైపు నుంచి వస్తుందో, అటు వైపు బయలుదేరింది. తాటక రామలక్ష్మణులున్న ప్రదేశానికి వచ్చింది. తాటకని చూసిన రాముడు లక్ష్మణుడితో, 'ఈ తాటకిని ఓ మోస్తారు వాళ్ళు చూస్తే, గుండె ఆగి చనిపోతారు లక్ష్మణా' అన్నాడు.

ఆ తాటక ముందు, బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడి మీదకి దూకింది, అప్పుడాయన ఒక హుంకారం చేసేసరికి, అది స్తంభించిపోయి, ఉన్న చోట నిలబడిపోయింది, వెంటనే తన మాయతో, రాళ్ల వర్షం కురిపించింది, ఆ తాటక రేపిన ధూళి, అందరి కళ్ళల్లో పడింది. అప్పుడు విశ్వామిత్రుడు రాముడితో, ఇంక ఉపేక్షించి లాభం లేదు, తొందరగా ఆమెని సంహరించు' అన్నాడు. 'ఎంతైనా ఆడది కదా, ముందు తన గమన శక్తిని కొట్టేద్దాం, అప్పుడన్నా మారుతుందేమో చూద్దాం, అని రాముడు, కాళ్ళు, చేతులు, లక్ష్మణుడు ముక్కు, చెవులు నరికారు. అప్పుడు ఆ తాటక మాయారూపం పొంది, మాయం అయిపోయింది. అదృశ్యమైన ఆ తాటక, భారి శరీరంతో, రాముడి మీద పడబోతుంటే, రాముడు ఒక బాణం ప్రయోగించి, ఆ తాటకని సంహరించగా, దాని రక్తం ఏరులై ప్రవహించింది. పైనుండి దేవతలు చూసి, 'హమ్మయ్య! తాటక సంహరింపబడింది' అని ఆనందపడ్డారు. వెంటనే ఆ దేవతలు, విశ్వామిత్రుడి దగ్గరకి వచ్చి, ' ఇంత ధైర్యం ఉన్న వాడి దగ్గర, అన్ని అస్త్రశస్త్రాలు ఉండాలి, కాబట్టి నీకు తెలిసిన ధనుర్విద్యనంతా, రామలక్ష్మణులకి ఉపదేశించు' అన్నారు.

అప్పుడు విశ్వామిత్రుడు, రామలక్ష్మణులకి, హయశిరోనామాస్త్రాన్ని, క్రౌంచాస్త్రాన్ని, మంత్రోపదేశం చేశాడు. అలాగే కంకాళం, ఘోరం, కాపాలం, కంకణం, అనే నాలుగు ముసలముల మంత్రోపదేశం చేశాడు. అలాగే ఇంద్రాస్త్రం, బ్రహ్మాస్త్రం, బ్రహ్మశిరోనామకాస్త్రం, మానవాస్త్రం, వారుణాస్త్రం, ఇంద్రాస్త్రం, ఐషీకాస్త్రం, గాంధర్వాస్త్రం, నారాయణాస్త్రం, రకరకాల పిడుగులు, మొదలైన సర్వాస్త్రాల మంత్రోపదేశం చేసి, రెండు అద్భుతమైన గధలని, నందనం అనే గొప్ప ఖడ్గాన్ని, ఉపదేశించాడు. అప్పుడు ఈ అస్త్రాలన్నీ పురుష రూపం దాల్చి, రాముడి పక్కన నిలబడి, 'మేము మీ కింకరులం, మమ్మల్ని ఏమి చెయ్యమంటారు?' అని అడిగాయి. 'మీరందరూ నా మనస్సులోకి వెళ్లి, అక్కడ తిరుగాడుతూ ఉండండి, నేను పిలిచినప్పుడు, బయటకి రండి' అని ఆదేశించాడు. అవి అలాగే, రాముడిలోకి ప్రవేశించాయి.

మరుసటి రోజున రాముడు విశ్వామిత్రుడితో.. మీరు నాకు ఇన్ని అస్త్రాలని ఉపదేశించారు, అలాగే వాటి ఉపసంహారాన్ని కూడా ఉపదేశించమన్నాడు. విశ్వామిత్రుడు రాముడికి, ఉపసంహార మంత్రాలని చెప్పాక, ఇంకొన్ని అస్త్రాలని కూడా ఉపదేశించాడు. అలా అన్ని అస్త్రాల ఉపదేశం అయ్యాక, వాళ్ళు తమ ప్రయాణాన్ని కొనసాగించారు. అలా వెళుతుండగా, అక్కడొక ఆశ్రమం కనిపించింది. ఆ ఆశ్రమం ఎవరిదని, రాముడు అడగగా, విశ్వామిత్రుడు ఇలా చెప్పాడు. 'ఒకప్పుడు విరోచనుడి కుమారుడైన బలి చక్రవర్తి, తన ప్రరాక్రమంతో, ఇంద్రుడిని నిర్బంధించాడు. అప్పుడు శ్రీమహా విష్ణువు, వామన మూర్తిగా వచ్చి, బలిని పాతాళానికి పంపారు. ఆ వామన మూర్తి తపస్సు చేసిన ఆశ్రమమే, ఈ ఆశ్రమం, దీనిని సిద్ధాశ్రమం అంటారు. ఇక్కడే కశ్యప ప్రజాపతి, తపస్సు చేశారు, ఇక్కడే విష్ణువు ఇంద్రుడికి తమ్ముడిగా, ఉపేంద్రుడిగా పుట్టారు. నేను యాగం చేస్తున్నది కూడా, ఈ ఆశ్రమంలోనే అని చెప్పి, అందరూ ఆ ఆశ్రమంలోకి వెళ్లారు.

ఆ సిద్ధాశ్రమంలో యాగం ప్రారంభించారు, ఈ యాగం 6 రాత్రుళ్ళు,



6 పగళ్ళు జరుగుతుంది. కాబట్టి నువ్వు అన్ని రోజులు, జాగ్రత్తగా ఉండాలి' అని చెప్పి, విశ్వామిత్రుడు మౌన దీక్షలోకి వెళ్ళిపోయాడు. 5 రోజులు యాగం చక్కగా జరిగింది, 6 వ రోజున, ఆ అగ్నిహోత్రం ఒక్కసారి భగ్గున పైకిలేచింది. వెంటనే రాముడు, లక్ష్మణుడిని అప్రమత్తంగా ఉండమన్నాడు. అప్పుడే పైనుండి, మారీచ సుబాహువులు, కొన్ని వేల రాక్షసులతో వచ్చి, ఆ అగ్నిహోత్రంలోకి, రక్తం పోశారు. వెంటనే రాముడు, మానవాస్త్రంతో, మారీచుడిని కొట్టాడు, ఆ దెబ్బకి వాడు, 100 యోజనాల దూరం వెళ్లి పడ్డాడు. సుబాహువుడిని ఆగ్నేయాస్త్రం పెట్టి కొడితే, వాడు గుండెలు బద్దలై, నెత్తురు కక్కుతూ కిందపడి, మరణించాడు. మిగతా రాక్షసులందరిని, వాయువ్యాస్త్రంతో, నిర్జించారు. యాగం పూర్తయ్యాక, విశ్వామిత్రుడు లేచి, రాముడిని ఆలింగనం చేసుకున్నాడు. ఆ రాత్రి అందరూ, హాయిగా పడుకున్నారు.'మిథిలా నగరంలో, జనక మహారాజు, ఒక గొప్ప యాగం చేస్తున్నారు, కావున మీరు కూడా, నాతో ఆ నగరానికి రండి, అక్కడ చూడవలసినవి రెండు ఉన్నాయి'. అని విశ్వామిత్రుడు, రాముడితో చెప్పాడు. అందరూ ఆ మిథిలా నగరానికి బయలుదేరారు.

–సేకరణ, నరేందర్ చింతం

శివానందలహరి

శ్రీ ఆదిశంకరాచార్యుల విరచితం - 5

శ్లోకం:

సదా మోహాటవ్యాం చరతి యువతీనాం కుచగిరౌ
నటత్యాశాశాఖా స్వటతి ఝటితి స్త్వైరమభితః |
కపాలిన్ భిక్షో మే హృదయకపి మత్యన్త చపలం
దృఢం భక్త్యా బధ్వా శివ భవదధీనం కురు విభో || 20 ||


భావం

ఓ కపాలధారీ, సర్వవ్యాపకా, శివా, ఆదిభిక్షూ, నా దగ్గర మనస్సనే కోతి ఉంది. అది సంసారారణ్యంలో చంచలంగా చరిస్తున్నది స్త్వైరవిహారం చేస్తున్నది.

యువతుల స్తనాలనే పర్వతాలపై క్రీడిస్తున్నది. ఆశా శాఖలపై దూకుతున్నది. అటునిటు వేగంగా పరుగులిడుతున్నది. అత్యంత చపలమైన నా మనస్సనే ఈ కోతిని దృడమైన భక్తి అనే త్రాడుతో, బంధించి నీ వశంచేసుకుని నీ ఆధీనంలో నీవే పెట్టుకొను.

వివరణ: శివానంద లహరిలో ఈ శ్లోకం చాలా ముఖ్యమైనది. మనిషిలోని లోపాలను చెప్పుతూనే ఆ లోపాల నుండి బయటపడే మార్గాన్ని కూడా ఈ శ్లోకం లో చెప్పారు. 'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయో. అన్నదానిని బట్టి మనిషి పతనానికి అయినా, బ్రహ్మపద సిద్ధికి అయినా మనిషి మనస్సే కారణం. అటువంటి మనిషి మనస్సును ఒక కోతితో పోల్చారు. కోతి ఒకచోట నిలకడగా స్థిరంగా వుండదు. అన్ని విషయాలు దానికే కావాలి. ఒక దానితో సంతృప్తి చెందదు. చంచలత్వం ఎక్కువ. మనస్సు కూడా అంతే కదా! మనిషికి వుండే మోహాన్ని ఒక అరణ్యంతో పోల్చారు. నిరంతరం కామవ్యామోహ మమకారాలతో నిండి వుండేది మోహం అయితే నిరంతరం అంటే సందు లేకుండా, దట్టమైన భారీవృక్షాలు, చెట్లతో, గుట్టలతో, లోయలతో, వన్య మృగాలతో నిండి వుండేది అరణ్యం, మనస్సనే కోతి ఈ మోహారణ్యంలోనే, నిరంతరం తిరుగుతూ వుంటుందిట. మర్కటం పర్వత శిఖరాగ్రాలపై నర్తిస్తూ వుంటే మనస్సు యువతుల స్తనాగ్రాలపై నర్తిస్తుందట. అంటే విషయ వాసనల ప్రభావం మూలంగా వాటి నుండి లభించే తాత్కాలిక సంతృప్తికోసం వివిధ విషయాల్లోకి వెళ్ళి ఇరుక్కుపోతూ వుంటుంది. మహారణ్యంలోని పెద్ద పెద్ద వృక్షాలకు ఉండే వివిధ శాఖలు ఈ మర్కటానికే కావాలి.ఒక కొమ్మ మీద నుండి ఇంకొక కొమ్మ మీదకి దూకుతూ నానాహడావిడి చేస్తూ వుంటుంది. మనస్సు కూడా మోహంలో పడినప్పుడు రకరకాల ఆశలుపుట్టి,

వాటిని తీర్చుకునేందుకు రకరకాల వ్యక్తుల దగ్గరకు, గురువుల దగ్గరకు పోతూ రకరకాల మంత్రాలు స్వీకరిస్తూ, వదిలేస్తూ, కలసి వచ్చినపుడు వాళ్ళని పొగుడుతూ కలసి రానప్పుడు తిట్టుకుంటూ,పార్టీలు, మతాలు,సిద్ధాంతాలు, మారుస్తూ, నానా హంగామాగానూ, హడావిడిగానూ, వుంటుంది. ఇలా ఇష్టం వచ్చినట్టు స్త్వైరవిహారం చేస్తూ ఎంత చెప్పినా మాట వినని మనస్సనే కోతిని నియంత్రించి, చెప్పు చేతల్లో పెట్టుకోవడానికి,ఒక చక్కని ఉపాయం తట్టి శివునితోనే ఒక



విచిత్రమైన ఒప్పందం చేసుకున్నారు శ్రీ శంకరులు.

శివా! నిన్ను చూడగానే నా మనో మర్కటాన్ని అదుపులో పెట్టుకోవడానికి ఒక ఉపాయం తట్టింది.

నువ్వు నీ భుక్తి గడపటానికి, ఎలాగూ రోజూ, పుర్రెను చేత్తో పట్టుకుని బిక్షానికి గడప గడపకు వెళ్తావుకదా! ఒక్క పుర్రె పట్టుకుని బిచ్చానికి వెళ్తే, నిన్ను పెద్దగా పట్టించుకునేవారు చాలా తక్కువ మంది వుంటారు.అందువల్ల నీకు కడుపునిండా భుక్తి దొరకదు. నీవు బిక్షకై ఇళ్ళకు వెళ్ళేటప్పుడు ఒక కోతిని కూడా తీసుకుని వెళ్లు అప్పుడు పెద్దలు పట్టించుకోకపోయినా పిల్లలు ఆ కోతి చేష్టలు చూచి ఆనందిస్తారు.. పిల్లలు ఆనందపడటం వల్ల పెద్దవారు నీకు ఎంతో కొంత ముట్టచెబుతారు.అయితే వెంటనే నీకు కోతి కావాలి కదా! అంటావేమో..నీవు కష్టపడనక్కరలేదు, నాదగ్గరే, నా మనస్సనే కోతి సిద్దంగా ఉంది. నీవు ఆ కోతిని తీసుకుని వెళ్ళావంటే మనకు ఉభయతారకంగా ఉంటుంది. నీకు కాస్త బిక్ష ఎక్కువ దొరుకుతుంది. నాకు దీనివల్ల వచ్చు తిప్పలు తప్పి ప్రశాంతంగా ఉంటుంది.అయితే పంపించు వెంటనే అంటావేమో శివా! నా కోతి అలా పంపగానే నీ వెంట వచ్చేది కాదు. ఇది చాలా తెలివిగలది, మొండిది.. అలా వచ్చినట్లే వచ్చి సమయం వీలు చూసి మరలా నాదగ్గరకు వచ్చేస్తుంది. అందుకని దీనిని ఒక గట్టి తాడుతో కట్టి రెండవ కొనను నీవు పట్టుకుని నీ ఆధీనంలో ఉంచుకో.

అటువంటి గట్టి త్రాడు ఎక్కడ అని అడుగుతావేమో పరమేశ్వరా! అదీ సిద్దంగా ఉంది. నీమీద ఉన్న నా దృడమైన భక్తినే తాడుగా చేసుకుని నా మనస్సనే కోతిని నీ ఆధీనం చేసుకో. మనమిద్దరం ఒకరికొకరు సహాయం చేసుకోకపోతే ఎవరు చేస్తారు చెప్పు... అని శివునకే ఉపాయం చెప్పి తను అపాయం నుండి బయట పడ్డారు శ్రీ శంకరులు.మనస్సనేది కోతి వంటిదే! దానిని అదుపులో పెట్టుకోవడం అంటే అంత తేలికైన విషయం కాదు.శివపరమైన భక్తిని జోడిస్తే కాని మనోమర్కటానికి కళ్ళెం పడదు.అదికూడా మన ప్రయత్నం చేతమాత్రమే కాదు, అ శివుడే స్వాధీనం చేసుకుని మనకు విముక్తి కలిగించాలి. అని శ్రీ శంకరులు అభిప్రాయపడి మనకీ ఉపాయం చెప్పారు..

ఆ ఆదిదంపతుల పాదపద్మాలకు నమస్కరిస్తూ
సర్వేజనా సుఖినోభవంతు

–డా॥ శ్రీరామ్, హైదరాబాద్

'నిత్య–లీల' రెండూ ఒకటే!

– పరమహంస గూఢార్థ కథలు

'జ్ఞాని ఒకే విధానాన్ని అనుసరిస్తాడు. మిగిఇన విధానాలను అంగీకరించడు. 'నేతి –నేతి: ఇది కాదు – ఇది కాదు: ఈ లోకం స్వప్నం వంటిది' అని వివేచన చేస్తాడు. కాని నేను మాత్రం, ' రెండు చేతులూ పైకెత్తుతాను!' అన్ని విధానాలనూ అంగీకరిస్తాను. ఒక కథ చెపుతా విను!"

"ఒకసారి ఒక స్త్రీ తన స్నేహితురాలైన సాలెపడుచును చూడటానికి వెళ్లింది. ఆ సాలెపడుచు అనేకరకాల నూలు వడుకుతున్నది. చాలా రోజుల తరువాత వచ్చిన స్నేహితురాలిని చూచి ఆనందపడింది. ' నిన్ను చూస్తే నాకెంతో సంతోషంగా ఉన్నదే! ఎన్నాళ్లకు వచ్చావు. ఉండు కొంచెం ఫలహారం తెస్తాను' అని లోపలికి వెళ్లింది. ఇంతలో స్నేహితురాలు అక్కడున్న రంగురంగుల దారపు కండెలు చూచి, ఆశపడి ఒక కండెను తీసుకొని చంకలో పెట్టుకుంది. సాలెస్త్రీ గదిలోకి వచ్చి స్నేహితురాలికి ఫలహారం పెట్టింది. అటూ ఇటూ చూచి, తన స్నేహితురాలు ఒక దారపుకండెను తీసుకున్నట్లు గ్రహించింది. దానిని రాబట్టుకోవడానికి ఒక తెత్తు వేసింది. స్నేహితురాలితో, 'నిన్ను చూచి ఎంతకాలమైంది! ఇది ఎంత మంచి రోజు! నాతో కలిసి నృత్యం చెయ్యవా? మనిద్దరం కలిసి నృత్యం చేసి ఎన్నాళ్లయిందో గదా!' అన్నది."

"ఆ స్నేహితురాలు కూడా, 'చెలీ! నాకు కూడా సంతోషంగా ఉన్నదే!' అన్నది. స్నేహితురాళ్లు ఇద్దరూ




లేచి చెయ్యి చెయ్యి కలిపి ఆడటం మొదలు పెట్టారు. తన స్నేహితురాలు రెండవ చెయ్యి ఎత్తకుండా ఆడటం చూచి ఆ సాలెస్త్రీ, ' అదేమిటే, రెండో చెయ్యి ఎత్తవు? రెండు చేతులు ఎత్తి ఆడుదామే! ఈ రోజు ఎంతో ఆనందరంగా ఉందిగదా!' అన్నది. కాని ఆమె స్నేహితురాలు ఒక చెయ్యి చంకకు అదిమిపెట్టి రెండవ చేతితో మాత్రమే ఆడసాగింది. అప్పుడు ఆ సాలె స్త్రీ, 'అదేమిటే చెలీ, ఒక చెయ్యి మాత్రమే ఎత్తి ఆడుతున్నావు? రెండు చేతులూ ఎత్తవే! నన్ను చూడు! నేనెలా రెండు చేతులూ ఎత్తి ఆడుతున్నానో!' అన్నది. కాని ఆ స్నేహితురాలు ఇంకా ఒక చేతిని చంకకు అదుముకుంటూ నవ్వుతూ, 'అదేమిటోనే! నాకు తెలిసింది ఇంతే!' అన్నది."

ఈ కథను శ్రీరామకృష్ణులు శశిధర తర్కచూడామణికి చెప్పి, 'నేను నా చేతిని ప్రక్కకు అదిమి పెట్టను. నా రెండు చేతులూ ఖాళీగానే ఉన్నాయి. రెండు చేతులూ పైకెత్తుతాను. నేను నిత్యను, లీలను, రెంటినీ అంగీకరిస్తాను" అన్నారు.

పండిత శశిధర తర్కచూడామణి గొప్ప సంస్కృత పండితుడు. ఆయన వాగ్ధాటి, శాస్త్ర వైదుష్యము, నిజాయితీ ఆనాటి వంగదేశ యువకులందరి దృష్టిని సనాతన హిందూమతం వైపు మళ్లించాయి. అయితే ఆ పండితుడు శుష్కవేదాంత చర్చలలో నిమగ్నుడై ఉండి, ఒక్క జ్ఞానాన్ని మాత్రమే పట్టుకొని ఉండటం వల్ల గురుదేవులు అతడితో, 'నీవు ముందు ఆధ్యాత్మిక సాధన చేసి, తరువాత ఇతరులకు బోధించు. భగవంతుని నుండి అధికారపత్రం పొందకపోతే నీ ఉపన్యాసాల వల్ల ప్రయోజనమేమీ ఉండదు" అని చెప్పారు.

గురుదేవులు జ్ఞానానికి, విజ్ఞానానికి గల తేడాను అనేక ఉదాహరణలతో ఆ పండితుడికి విశదీకరించి చెప్పి, 'నిత్య–లీల' (బ్రహ్మము–శక్తి: నిరాకారము–సాకారము) అనే వాటిని గురించి ఇలా వివరించారు. "పాల నుండి మజ్జిగకు వస్తుపరంగా భేదం లేదు. చెట్టుకు బెరడు ఉంటుంది. చెట్టులోనున్న 'నిత్యను' అంగీకరిస్తె 'లీలను' కూడా అంగీకరించి



తీరాలి. ఒక మార్గం 'ఇతి, ఇతి' (ఇది, ఇది) అని సూచిస్తుంది. రెండవమార్గం 'నేతి, నేతి' (ఇదికాదు, ఇదికాదు) అంటుంది. కాని రెండుమార్గాలూ ఒక్కటే. 'నిత్య' యొక్క బాహ్యప్రకటనమే 'లీల' (నిరాకారమే సాకారంగా రూపుదాల్చుతుంది).

అంటే సాకారాన్ని, నిరాకారాన్ని, రెంటినీ అనుభూతి పొందిన వాడికి మాత్రమే ఈ స్థితి లభ్యమవుతుంది" అని గురుదేవులు ఆ పండితుడికి జ్ఞానబోధ చేశారు."ఒకే విధానాన్ని అనుసరించటమంటే 'ఒక చెయ్యి అదిమిపట్టి నృత్యం చెయ్యటం వంటిది.' కానీ నేను అలా కాదు. నేను ఆ రెంటినీ అంగీకరిస్తాను" అని ఆ పండితుడికి బోధించారు.

జ్యోతిష్యశాస్త్రం



శాస్త్రీయ విజ్ఞానం

జ్యోతిష్యం వేదాంగాలలో ఒకటి. వేద పురుషునికి కన్ను వంటిది. అంటే వేదాలను అధ్యయనం చేసేటప్పుడు వేదాంగమైన 'జ్యోతిష్యం'లో ప్రావీణ్యం ఉండాలి. వేదకర్మలు నిర్వహించడానికి 'కాలం' చాలా ముఖ్యమైనది. కాలానుగుణంగా యజ్ఞయాగాదులు నిర్వహించటం కోసం జ్యోతిష్య శాస్త్రం ఆవిర్భవించింది. 'జ్యోతి' అంటే వెలుగు. జ్యోతిష్యశాస్త్రమంటే వెలుగు తెలిపే శాస్త్రం. కానీ ఈ శాస్త్ర విజ్ఞానమంతా నేడు 'భవిష్యత్తుని' తెలుసుకునే విద్యగా ప్రఖ్యాతి గాంచింది. జ్యోతిష్యశాస్త్రం ఒక అపురూపమైన విజ్ఞానం. అది నమ్మకం కాదు. భవిష్యత్తుని తెలుపడం అందులో ఒక చిన్న భాగం మాత్రమే. ఆధునిక విజ్ఞానం గ్రహాల మధ్య ఉండే దూరాన్ని 'light years'లో లెక్కిస్తుంది. 'light year' అంటే ఒక సంవత్సరంలో కాంతి ప్రయాణించే దూరం. ఒక నక్షత్రం మనకు కనిపిస్తూ ఉంది అంటే దానినుంచి మనకు ప్రసారమయ్యే కాంతి కనబడటానికి కొన్ని వేల/వందల కాంతి సంవత్సరాల కాలం పడుతుంది. అట్లాగే మన ప్రాచీన భారతీయులు కూడా సూర్య కాంతి ఆధారం చేసుకుని కాలగణన చేసి గ్రహగతులను నిర్ణయించారు.

అలాగే, శుభ, అశుభ, కాలాలను. ప్రకృతి వైపరీత్యాలను, గ్రహగతులతో అనుసంధానం చేసి మానవ జీవితాపై అన్ని గ్రహాల ప్రభావాన్ని కనుగొన్నారు. అదే నేడు 'జ్యోతిష్యశాస్త్రం'గా ప్రసిద్ధి గాంచింది. వరాహమిహురుడు తన జ్యోతిష్యశాస్త్ర గ్రంథమైన 'బృహత్ జాతక'లో మొదటి శ్లోకంలో 'జ్యోతిష్యశాస్త్రం, సంసారమనే సముద్ర యానాన్ని దాటేందుకు 'దిక్సూచి' వంటిది అని అంటాడు. దీనిని బట్టి జ్యోతిష్యశాస్త్రం కాలాన్ని తెలియజేసే మార్గదర్శి మాత్రమే అని మనకు అర్థమవుతున్నది. జోతిష్యశాస్త్రం ప్రకారం 9గ్రహాలు, 27 నక్షత్రాలు, 12రాసులతో సంచరిస్తున్నప్పుడు మనిషిపై వాటి యొక్క ప్రభావాన్ని వివిధ కోణాల నుండి దర్శింపచేస్తుంది. మనిషి పుట్టిన స్థలాన్ని, కాలాన్ని అనుసరించి 'జన్మకుండలి' రచిస్తారు. ఆ జన్మ సమయంలో ఉండే గ్రహాల స్థితిగతుల ఆధారంగా మనిషి యొక్క జాతకాన్ని సూచిస్తారు. ఈ విజ్ఞానం అంతా కూడా ఎన్నో జ్యోతిష్యగ్రంథాలలో పొందుపరచబడి ఉంది. ఇది ఒక మహాసముద్రం వంటిది ఇందులో ప్రసిద్ధి గాంచినవి.1. పరాశరుని– హోరశాస్త్రం!

2. వరాహమిహురుని–'బృహత్ జాతక'.
3. కల్యాణ శర్మ– 'సారవళి'
4. జైమినీ మహర్షి – 'జైమినీ సిద్ధాంతం.'
5. మంత్రేశ్వరుడు– 'జలదీపిక'
6. భృగుమహర్షి– 'భృగు సంహిత'.

(వచ్చే సంచికలో)


శ్రీభగవాన్ ఉవాచ

యజ్ఞశిష్టాశినహ సంతో ముచ్యంతే సర్వకిల్బిషెహి।
భుంజతే తే త్వఘం పాపా యే పచంత్యాత్మకారణాత్॥

తాత్పర్యము: ఏ ఆహారమైనా మొదట భగవంతునికే సమర్పించాలి. అది మనిషికి ధృడత్వాన్ని ఇస్తుంది. అది చేయకపోతే అతను పాపాన్నే భూజించును.

నీతి: భోం చేసే ముందు ఆహార పదార్థాలను కృష్ణుడి ముందు ఉంచి భగవద్గీతలోని 4వ ఆధ్యాయంలోని 24వ శ్లోకం, 15వ అధ్యాయంలోని 14వ శ్లోకం చదవండి. అలా చేయడం వలన ఆహారం దైవ ప్రసాదంగా మారుతుంది. ఇది కిర్లియన్ కెమెరా వలన నిరూపించబడింది.

ముఖ్యపదం: దృఢత్వం.



చెడును ఎదుర్కోగలిగే దృఢత్వం



బాల మకరందం

గోకులంలోనూ, ఆపై బృందావనంలోనూ బలరామకృష్ణులు అనేకమంది రాక్షసుల నుండి ప్రమాదాలు ఎదుర్కొన్నారు. తమ గోపమిత్రులను రక్షించడానికి రాక్షసులతో యుద్ధం చేసారు. బలరామకృష్ణులను చంపడమే లక్ష్యంగా కంసుడు కొనసాగించిన అన్వేషణలో అనేక సంఘటనలు జరిగాయి. పూతన అనే రాక్షసి కృష్ణుడికి విషపు పాలు ఇచ్చింది. అతడు పాలతోపాటూ ఆమె ప్రాణాలనూ పీల్చేయడంతో మరణించింది. ధేనుకాసురుడు అనే రాక్షసుడు కూడా వారి మందలో దొంగతనంగా చేరి, ఆ సోదరుల వలన మరణించాడు, తృనవర్తుడు కృష్ణుని పైకి తీసుకువెళ్ళి ఇసుక తుఫాను సృష్టించి, చివరికి కృష్ణుడిచే చంపబడ్డాడు. ప్రలంభుడనే మరో రాక్షసుడు గోపబాలుడి వేషంలో వచ్చి, బలారాముడిని తొక్కేయడానికి వీపు ఎక్కి అతడు ఆకాశంలోకి విసిరేయగా కిందపడి మరణించాడు. అలాగే అరిష్టుడనే అసురుడూ, కేశి అనే రాక్షసీ కూడా కృష్ణుడి చేత వధించబడ్డారు. నిజానికి ఆ దివ్యసోదరులు రాక్షసులను మాత్రమేకాక వారిలోని చెడు లక్షణాలను కూడా అంతమొందించినట్టుగా భావించాలి కాబట్టి పిల్లలు కూడా ఇలాంటి చెడు లక్షణాలను అరికట్టాలి.

గ్రహించవలసిన లక్షణం: చెడు లక్షణాలకు దూరంగా ఉండాలి.

–డా॥ హరె క్రిష్ణ చంద్రశేకరన్

అవతార పురుషులను అందరూ గుర్తించలేరు

భగవంతుని అవతారాన్ని అందరూ గుర్తించలేరు. ఎక్కువమంది అయనను సామాన్య మానవుడనే అనుకుంటారు. కాని కొద్దిమంది మాత్రమే అయనను అవతార పురుషునిగా గుర్తిస్తారు. ఎవరికెంత శక్తి ఉంటుందో దానినిబట్టి వాళ్ళు ఒక వస్తువుకు విలువ కడతారు. ఒక కథ చెపుతా విను!

ఒక ఊరిలో ఒక ధనవంతుడున్నాడు. ఆయన తన సేవకుడిని పిలిచి, ఈ రత్నన్ని బజారుకు తీసుకవెళ్ళి వేరువేరు వర్తకులు దానికి ఎంత విలువ కడుతారో కనుక్కొని వచ్చి నాకు చేప్పు! ముందు దాన్ని ఒక వంకాయల వ్యాపారి దగ్గరకు తీసుకొని పోయి అతడెన్ని వంకాయలు ఇస్తానంటాడో కనుక్కొని రా! అని పంపాడు ఆ సేవకుడు దానిని తీసుకుపోయి ఒక వంకాయలవాడికి చూపించాడు. వాడు ఆ రత్మాన్ని చేతిలోకి తీసుకుని, అటూయిటూ త్రిప్పి చూస్తూ, ఏమయ్యా! దీనికి తొమ్మిది వీసెల వంకాయలు ఇస్తాను అన్నాడు ఆ సేవకుడు వాడుతో, అబ్బాయీ! ఇంకో మాట చెప్పు. పది వీసెల వంకాయలు ఇస్తావా! అని అడిగాడు. వంకాయలవాడు, లాభం లేదయ్యా! నేను ఇప్పటికే బజారు ధరకన్నా ఎక్కువ ధర పెట్టాను, నీకు గిట్టుబాటయితే ఇవ్వు లేకపోతే తీసుకొని పో! అన్నాడు. ఆ సేవకుడు తనలో తాను నవ్వుకొని యజమాని దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించి చెప్పాడు. ఆ యజమాని చిరునవ్వు నివ్వి, ఈసారి ఈ రత్నాన్ని బట్టల వ్యాపారి దగ్గరకు తీసుకు పో! ఇందాకటివాడు వంకాయలవాడు కదా! రత్నం విలువ పాపం వాడికేం తెలుస్తుంది? బట్టల వ్యాపారి దగ్గర పెట్టుబడి ఎక్కువ ఉంటుంది. అందువల్ల వాడెంత ధర పెడతాడో చూద్దాం అని మళ్ళీ పంపాడు. సేవకుడు బట్టల..(వచ్చే సంచికలో)

విజయక్రాంతి
ఆదివారం 13 జనవరి 2019
హైదరాబాద్

పెండింగ్ పారితోషికాలు చెల్లించాలి

- ఆషా యూనియన్

విజయక్రాంతి, హైదరాబాదు: ఆషా వర్కర్లకు సెప్టెంబర్ నుంచి పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల పారితోషికాన్ని తక్షణమే విడుదల చేయాలని తెలంగాణ వాలంటరీ అండ్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ (ఆషా) యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్షురాలు పి.జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్. తులసి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శాసనసభ రద్దు సమయంలో ఆషా వర్కర్లకు రూ.1500 చొప్పున పారితోషికాలు పెంచుతున్నామని సీఎం హామీ ఇచ్చారన్నారు. పెంచుతామన్న పారితోషికం రాకపోగా గతంలో చెల్లించాల్సిన రూ.6000 పారితోషికం కూడా అందలేదని పేర్కొన్నారు. దీంతో ఆషా వర్కర్లు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బడ్జెట్ విడుదల చేయాలని వారు తమ ప్రకటనలో కోరారు.

అలోక్ వర్మపై హడావుడిగా నిర్ణయం

- సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: సీబీఐ మాజీ డైరెక్టర్ అలోక్ వర్మ అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లేవని సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఏకే పట్నాయక్ వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కమిటీ చాలా హడావుడిగా నిర్ణయం తీసుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. అలోక్‌పై వచ్చిన అవినీతి ఆరోపణలపై కేంద్ర నిఘా సంస్థ(సీవీసీ) చేపట్టిన విచారణను పర్యవేక్షించిన పట్నాయక్ శనివారం ఈమేరకు మీడియాకు స్పష్టం చేశారు. సీబీఐ ప్రత్యేక డైరెక్టర్ రాకేశ్ ఆస్థానా చేసిన ఆరోపణ లపైనే అలోక్ వర్మపై కేంద్ర విజిలెన్స్ కమిషన్ దర్యాప్తు జరిపి సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించిందన్నారు. అయితే సీవీసీ నివేదికలోని నిర్ధారణలు తనవి కావని ఆయన తెలిపారు. సీవీసీ తనకు అందజేసిన నివేదికపై అస్థానా సంతకం ఉందని, అయితే అది తన సమక్షంలో పెట్టలేదని ఆయన పేర్కొన్నారు. తాను కేవలం దర్యాప్తును పర్యవేక్షించానని, సహజ న్యాయ సూత్రాలకు సంబంధించిన విషయాలు, ఇతర విధానపరమైన నిబంధనలను పరిశీలించానని ఆయన వివరించారు. ఇదే విషయాన్ని తాను లిఖిత పూర్వకంగా సుప్రీంకోర్టుకు తెలియజేశానని పట్నాయక్ వెల్లడించారు.

సీబీఐపై రాజకీయ పెత్తనంతోనే ఇలాంటి చర్యలు: జస్టిస్ లోధా

కాగా అలోక్ వర్మపై సీవీసీ విచారణను ప్రత్యక్షంగా పర్యవేక్షించిన సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఆర్ఎం లోధా కూడా ఆయనపై వచ్చిన ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు. శుక్రవారం ఏఎన్ఐ వార్తా సంస్థతో ఈ విషయం స్పష్టం చేశారు. అలోక్ వర్మపై వేటు గురించి ఆయన మాట్లాడుతూ.. సీబీఐపై రాజకీయ పెత్తనం కొనసాగినంతకాలం ఇలాంటివి జరుగుతూనే ఉంటాయన్నారు. 'సీబీఐ యజమాని మాటలను పలికే పంజరంలో రామ చిలక' అంటూ 2013లోనే జస్టిస్ లోధా విమర్శించిన సంగతి తెలిసిందే.

దృఢ సంకల్పానికి ప్రతిబింబం వివేకానందుడు

- వివేకానందుని జీవితం యువతకు ఆదర్శప్రాయం
- ప్రపంచ సమస్యలకు భారతదేశం పరిష్కారాలు చూపింది
- వివేకానందుని మాటలు ఆచరణలో పెడితేనే సానుకూల మార్పులు సాధ్యం
- ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు



విజయక్రాంతి, హైదరాబాద్: స్వామి వివేకానందుడు భారతీయ సంస్కృతికి ప్రతిరూపమని, యువత దృఢ సంకల్పానికి ప్రతిబింబమని ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు కొనియాడారు. జాతీయ యువదినోత్సవం సందర్భంగా శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లోని స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఆయన యువతను ఉద్దేశించి ప్రసంగించారు. వివేకానందుని బోధనలు అసాధారణమైనవని, కాలదోషం పట్టనివని, అవి అన్ని కాలాలాకు వర్తించే నిరంతర గంగాప్రవాహాలని తెలిపారు. భారతీయ సంస్కృతిలో తాత్వికమైన, సమీకృతమైన, సార్వత్రికమైన లక్షణాలు ఉన్నాయని, ప్రపంచం ఎదుర్కొనే అనేక సమస్యలకు పరిష్కారాలు ఇందులో ఉన్నాయని ఉపరాష్ట్రపతి అన్నారు. వైవిధ్యమైన మతాలను, సాంస్కృతిక నమ్మకాలను, వివిధ అభిప్రాయాలను ఒకే వేదిక మీదకు తీసుకొచ్చి, వివిధ అభిప్రాయాల మధ్య చక్కని వారధి నిర్మించిన ఘనత వివేకానందుని సొంతమని, వారి బోధనలను జీవితంలో ఆచరించడం ద్వారా ప్రజా జీవితాల్లో సానుకూలమైన మార్పులు సాధ్యమని అభిప్రాయపడ్డారు. 125 ఏళ్ళ క్రితం చికాగో సర్వమత సమ్మేళనంలో వివేకానందుని ప్రసంగం యావత్ ప్రపంచానికి దిశానిర్దేశం చేసిందని, వారి వాక్పటిమ, నిజాయితీతో కూడిన సంభాషణ ప్రతి ఒక్కరినీ సమ్మోహితుల్ని చేసిందని ఉపరాష్ట్రపతి తెలిపారు. మహిళా సాధికారత, ఆత్మవిశ్వాసం, ధైర్యం లాంటి అంశాల గురించి ఆయన సూక్తులు యువతకు ఆదర్శనీయమని, మనిషి శరీరం ధరించినప్పుడు సాక్షాత్తు భగవంతుడైనా బాధలను అనుభవించి తీరాలన్న వారి మాటలను ఆదర్శంగా తీసుకుని వారు చెప్పినట్లు దృష్టిని బాధలపై కాకుండా, పరిష్కారం మీద ఉంచాలని సూచించారు.

ఆధునిక యువత అద్భుతాలు సాధించగలరని వివేకానందుడు మనసా వాచా, కర్మణా నమ్మారని, యువశక్తిని ప్రపంచానికి తెలియజేసిన వారి జీవితం యువతకు ఆదర్శనీయమని తెలిపారు. వివేకానందుని సందేశాలు సూటిగా యువత హృదయాన్ని తాకుతాయని, ముప్పైతొమ్మిదేళ్ళ వయసులో తనువు చాలించిన వివేకానందుడు సంపూర్ణంగా భారతీయ యువత మనసుల్ని ప్రతిబింబించారని తెలిపారు. వివేకానందుని మాటలను ఆచరణలో పెట్టడం ద్వారా జీవితంలో యువత మరింత ఎత్తుకు ఎదగాలని ఉపరాష్ట్రపతి ఆకాంక్షించారు.

దేశ ఆర్థిక వ్యవస్థను గుణాత్మక దిశగా నడిపించాలి

(మొదటిపేజీ తరువాయి) పర్యటించే క్రమంలో ఫైనాన్స్ కమీషన్ సభ్యులు ముందే ఒక అభిప్రాయాన్ని కలిగి వుండడం సరికాదన్నారు. రాష్ట్రాన్ని పర్యటించి రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా క్షేత్ర స్థాయి పర్యటనకు ముందే ఒక అవగాహనతో టరమ్స్ ఆఫ్ రిఫరెన్స్ చేయడం సరికాదన్నారు. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సాంస్కృతిక, ఆర్థిక, జీవిన విధానం వుంటుందనీ, ఆయా రాష్ట్రాల అవసరాల రీత్యా డివల్యూషన్ అంశం రాష్ట్రాల హక్కుగా పరిగణించాలన్నారు. కేవలం విధనాల రూపకల్పనకు మాత్రమే ఫైనాన్స్ కమిషన్ పరిమితమైతే మంచిదన్నారు. చర్చించిన ఈ అంశాలన్నీ పరిశీలించి, తెలంగాణ రాష్ట్ర ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నివేదికను రూపొందించాలని ఆర్థిక శాఖ అధికారులకు సిఎం సూచించారు.

బడ్జెట్‌పై ముందస్తు కసరత్తు

బడ్జెట్ రూపకల్పనకు సంబంధించి ఏర్పాట్లు అందుకు ముందుగా అవసరమైన చర్యలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్ర ప్రజల జీవికను నిర్వచించుకున్న అనంతరమే ప్రజల అవసరాలను అన్నిరంగాల్లో పరిశీలించిన మీదటనే తుది బడ్జెట్‌కు రూపకల్పన చేయాలని సిఎం స్పష్టం చేశారు. కేవలం ఒక్క ఏడాదికా లేకా ఐదేండ్ల పూర్తి కాలానికా అనే అవగాహనతో మనం రూపొందిస్తున్న బడ్జెట్ విధి విధానాలు ఉండాలన్నారు. తెలంగాణ నేడు ఎక్కడ వున్నది.. రానున్న ఐదేండ్ల తర్వాత ఎక్కడ ఉండబోతున్నది అనే అవగాహన, అంచనాతో బడ్జెట్‌ను రూపొందించాలన్నారు. ప్రభుత్వం కేవలం చట్టాలను అమలు పరచడమే కాకుండా రాష్ట్రాభివృద్ధిని సులభతరం చేస్తూ ఒక ఉత్ప్రేరకంగా ఉద్దీపనకారిగా తన పాత్రను నిర్వహిస్తుందన్నారు. బడ్జెట్ రూపకల్పనకు ముందు ఒక సమగ్ర విధానాన్ని రూపొందించాలన్నారు. ఒక్కొక్క అంశాన్ని తీసుకుని పనిని విభజించి సమస్యను ఛేదించే వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేసే దిశగా బడ్జెట్ వుండాలన్నారు. తెలంగాణ ఒక రాష్ట్రంగా తన అభివృద్ధిని పెంచుకోవడానికి ప్రగతి మార్గంలో పయనించడానికి, అవలంబించాల్సిన మార్గదర్శకాలేమిటి? మన ఆర్థిక ప్రగతికి దోహద పడుతున్న అంశాలేమిటి? అనేవి పరిగణలోకి తీసుకుని బడ్జెట్‌ను రూపొందించాలన్నారు. 'సీఎంగా నన్ను ప్రజలు ఎన్నుకున్నప్పుడు నేను వారికి ఎంత గొప్పగా సేవలందించగలనో ఆలోచన చేయాలె. ఆదరాబాదరాగా కాకుండా ముందుగా ఒక సమగ్ర అవగాహనకు వచ్చిన తర్వాతనే బడ్జెట్‌ను రూపొందించడానికి పూనుకోవాలి. అటువంటి కీలక బడ్జెట్‌ను రూపొందించడానికి పూనుకున్న వ్యక్తులు అధికారులు ఆ దిశగా తమ దృక్పథాన్ని ఏర్పరుచుకోవాలి. రాబోయే ఐదేండ్ల కాలంలో రాష్ట్రానికి ఎంత డబ్బు వస్తున్నది ఎంత డబ్బు ఖర్చు కాబోతున్నదో అనే వొక సమగ్ర అంచానా వుండాలి." అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులపై మరింత శ్రద్ధ

రాష్ట్రంలో నడుస్తున్న సాగు నీటి వనరులతో సహ ఇతర శాఖలను సోదాహరణలుగా తీసుకొన్న సిఎం, ఆ దిశగా బడ్జెట్ ప్రపోజల్స్ ను రూపొందించాలని సూచించారు. సాగునీటి ప్రాజెక్టుల కోసం బడ్జెట్‌ను రూపొందించే క్రమంలో ముందుగా గత నాలుగు సంవత్సరాల కాలంలో ఎంత ఖర్చు చేసింది రాబోయే ఐదేండ్ల కాలంలో ఎంత ఖర్చు చేయనున్నది..అనే అంశాన్ని పరిగణలోకి తీసుకావలని సిఎం సూచించారు. నడుస్తున్న ఆర్థిక సంవత్సరం సహ రానున్న ఐదేండ్లకాలానికి మొత్తం కలిపి ఇరిగేషన్ శాఖ కోసం రెండు లక్షల కోట్ల రూపాయలు ఖర్చుకానున్నట్టు సిఎం తెలిపారు. కేంద్రం నుంచి అన్ని సాగునీటి ప్రాజెక్టులకు అన్నిరకాల అనుమతులను సాధించడం గొప్పకార్యమని అది బడ్జెట్‌లో ప్రతిఫలించాలన్నారు. గొర్రెల పంపిణీకి సంబంధించిన ఉదాహరణను ప్రస్తావించిన సిఎం అది ఎంతగొప్పగా ప్రజాదరణ పొందిందో తెలిపారు. దాంతో పాటు చేపల పెంపకం చేనేత రంగం, రాష్ట్రంలో పురోగతిని సాధిస్తున్నట్టుగా చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో రాష్ట్ర చేనేత ఉత్పత్తులకు ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో చేనేత కార్మికుల కళను పూర్తిస్తాయిలో వినియోగించుకోవాలన్నారు. దాంతో పాటు విద్యుత్ సగటు వినియోగంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ వన్ గా నిలిచిందని పేర్కొన్నారు. బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనకు ముందు ఈ అంశాలన్నిటినీ పరిగణలోకి తీసుకోవాలన్నారు.

అవినీతిపరుల పనిబడతా

(మొదటిపేజీ తరువాయి) దేశాన్ని కాంగ్రెస్ అంధకారంలోకి నెట్టిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన ప్రధాని 2014 మధ్య అత్యంత ముఖ్యమైన పదేళ్ళ కాలాన్ని మన దేశం కుంభకోణాలు, అవినీతి వల్ల నష్టపోయిందనడంలో ఎంతమాత్రం తప్పు లేదని చెప్పారు. తన నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందిస్తోందని చెప్పారు. భారత దేశ చరిత్రలో అవినీతి మరక అంటని ప్రభుత్వం తనదేనని, ఇటువంటి ప్రభుత్వం ఏర్పడటం ఇదే తొలిసారి అని చెప్పారు. "మా మీద ఎలాంటి మచ్చ లేదని మేం గర్వపడుతున్నాం" అని మోదీ చెప్పారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కుటుంబం నేషనల్ హెరాల్ కేసులో చిక్కుకుందని, రాహుల్తోపాటు ఆయన తల్లి సోనియా గాంధీ బెయిలుపై తిరుగుతున్నారని తెలిపారు..

ఆగస్టా వెస్ట్లాండ్ కుంభకోణంలో కాంగ్రెస్ నేతలు ఉన్నందునే విచారణను కప్పిపుచ్చారనీ, ప్రజల సొమ్ముకు తిన్న ఏఒక్కరినీ తమ ప్రభుత్వం వదిలిపెట్టదని మోదీ హెచ్చరించారు. హిందూవుల డిమాండైన అయోధ్య రామ మందిరాన్ని కోర్టుల్లో కాంగ్రెస్‌పార్టీకి చెందిన న్యాయవాదులు ఏవిధంగా అడ్డుకుంటున్నారో మనందరికీ తెలుసన్నారు. ఎన్నోఏళ్ళ ప్రకటనలకే పరిమితమైన అగ్రవర్ణల రిజర్వేషన్లను తమ ప్రభుత్వం చేసి చూపిందని మోదీ పేర్కొన్నారు. దేశాన్ని కాంగ్రెస్ అంధకారంలోకి నెట్టిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ 2004 నుంచి 2014 మధ్య అత్యంత ముఖ్యమైన పదేళ్ళ కాలాన్ని మన దేశం కుంభకోణాలు, అవినీతి వల్ల నష్టపోయిందనడంలో ఎంతమాత్రం తప్పు లేదని చెప్పారు. తన నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతిరహిత పాలనను అందిస్తోందని చెప్పారు. భారత దేశ చరిత్రలో అవినీతి మరక అంటని ప్రభుత్వం తనదేనని, ఇటువంటి ప్రభుత్వం ఏర్పడటం ఇదే తొలిసారి అని చెప్పారు.

అవినీతి మరక లేకుండా ఇనాళ్లు సాగాం: మోదీ

"దేశ చరిత్రలోనే తొలిసారిగా ఏ అవినీతి ఆరోపణలు లేకుండా ఎక్కువ కాలం అధికారంలో కొనసాగిన ప్రభుత్వం మనదేనని గర్వంగా చెప్పగలను. ఉన్న రిజర్వేషన్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించాం. ప్రతిపక్షాలు తమ స్వార్థం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పథకాలపై విమర్శలు చేస్తున్నారు. పదేళ్ల యూపీఏ పాలన అవినీతితోనే కొనసాగింది. దశాబ్దాల నిర్లక్ష్యంతో రైతులు కుదేలైపోయారు. ఒకటిన్నర రెట్ల ఆదాయం లభించినప్పుడే రైతుల ముఖాలు చిరునవ్వుతో ఉంటాయి. ఈ దేశ రైతులకు నూతన జవసత్వాలు ఇచ్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. అభివృద్ధి విషయంలో వెనకడుగు వేసే ప్రసక్తే లేదు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు కడుపునింపేందుకు ప్రయత్నిస్తున్నాం. అద్భుతాలు చేయగల శక్తి, సామర్థ్యాలు దేశ యువతకు ఉన్నాయి".

సీబీఐని అందుకే ఆంధ్రలో అడ్డుకున్నారు..

అధికార పార్టీలోని నేతలపై అవినీతి ఆరోపణలు ఉన్నందునే ఆంధ్రప్రదేశ్లోకి సీబీఐని రాకుండా అడ్డుకున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఏపీతో పాటు బెంగాల్, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో సీబీఐని నిరాకరిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తప్పుపట్టారు. గతంలో కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో అధికారంలో ఉన్న సమయంలో తాను గుజరాత్ సీఎంగా ఉన్నానని, ఆ సమయంలో కాంగ్రెస్ అధికారాన్ని దుర్వినియోగపరిచి తనపై సీబీఐ విచారణ చేపట్టారని మోదీ పేర్కొన్నారు. సీఎం పదవిలోఉన్న తాను ఏ తప్పు చేయనందుకే చట్టాన్ని గౌరవించి విచారణను ధైర్యంగా ఎదుర్కొన్నట్లు ఆయన గుర్తుచేశారు.

బలహీనమైన సర్కార్‌ను ఏర్పాటు చేసేందుకే విపక్షాలు ఏకమవుతున్నాయి..

రానున్న లోక్‌సభ ఎన్నికల కోసం ఏకమవుతున్న ప్రతిపక్షాలపై మోదీ విమర్శలు గుప్పించారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశంలో శనివారం ఆయన మాట్లాడుతూ అవినీతి, బంధుప్రీతిని పెంచి, పోషించేందుకు బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు జట్టుకడుతున్నాయన్నారు. కానీ బీజేపీ మాత్రం సర్వతోముఖాభివృద్ధి కోసం బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని చెప్పారు.

మహా కూటమి పేరుతో ఇటీవల దేశంలో ఓ విఫల ప్రయోగం జరుగుతోందని చెప్పారు. నిస్సహాయ, బలహీన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కోసం వాళ్ళంతా (ప్రతిపక్షాలు) కలుస్తున్నారని చెప్పారు. వాళ్ళ దుకాణాలను మూసివేసే బలమైన ప్రభుత్వం వారికి అక్కర్లేదని దుయ్యబట్టారు. వాళ్ళకు తమ బంధువులకే మేలు చేసే నిస్సహాయ ప్రభుత్వాలే కావాలని వ్యాఖ్యానించారు.

అందరికీ అభివృద్ధి ఫలాలు దక్కాలన్నదే తమ ఆశయమని, బీజేపీ నేతృత్వంలో ఏర్పడే ప్రభుత్వమే అవినీతిని అంతమొందించి, బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, అందరినీ అభివృద్ధి చేయగలదని తెలిపారు. తన ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలేవీ లేవని పేర్కొన్నారు. తాను గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కాంగ్రెస్ నియంత్రణలోని ప్రతి వ్యవస్థ ద్వారా తనను అష్టకష్టాలు పెట్టారని మోదీ తెలిపారు. బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాను జైలులో పెట్టారన్నారు.

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వేల మంది కార్యకర్తలకు దిశానిర్దేశం చేయడానికి ఈ సమావేశం దోహదం చేస్తోందని మోదీ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాతో పాటు జాతీయ నాయకులు పాల్గొన్నారు.

కేంద్రంలో అధికారంలోకి వస్తే.. ఏపీకి ప్రత్యేక హోదా..

(మొదటిపేజీ తరువాయి) అయినా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం దాన్ని ఎంతమాత్రం పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీకి ఇవ్వాల్సిన ముఖ్యమైన హామీని ప్రధాని మోదీ విస్మరించారని, ఏపీకి దక్కాల్సిన హామీల విషయంలో మనమంతా కేంద్రానికి అర్థమయ్యేలా చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. భారత కార్మికులనుద్దేశించి మాట్లాడుతూ ప్రపంచంలో అత్యద్భుత నగరంగా దుబాయ్ నిలవడంలో వారి శ్రమ ఎంతో ఉందన్నారు. వారు ఇక్కడ పనిచేస్తూ భారతదేశాభివృద్ధికి దోహదపడుతున్నారని ప్రశంసించారు. దుబాయ్‌లోని అందమైన ఆకాశ హర్మ్యాలు, ఎయిర్‌పోర్టులు వారి రక్తం, స్వేదంతో నిర్మితమైనవేనని అన్నారు. భారతీయుల శ్రమశక్తి లేకుంటే ఈ అద్భుతాలు సాధ్యమయ్యేవి కాదన్నారు.

నేడు ప్రత్యేక రైళ్లు

విజయక్రాంతి, హైదరాబాద్: సంక్రాంతి పండుగ నేపథ్యంలో పెరిగిన రద్దీని తగ్గించేందుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడ, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు, తిరుపతి నుంచి కాకినాడకు, విజయవాడ నుంచి విజయనగరానికి, విజయనగరం నుంచి విజయవాడకు మధ్య ఆదివారం 7 జన్ సాధారణ్ రైళ్లను నడుపుతున్నట్టు రైల్వేశాఖ ప్రకటించింది. సికింద్రాబాద్ – విజయవాడ ప్రత్యేక రైలు మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరి విజయవాడకు రాత్రి 7.30 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో ఈ రైలు విజయవాడ నుంచి రాత్రి 8.25 గంటలకు బయలుదేరి అర్ధరాత్రి 2.20 గంటలకు సికింద్రాబాద్‌కు చేరుకుంటుంది. మరో ప్రత్యేక రైలు సికింద్రాబాద్ నుంచి రాత్రి 11.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.10 గంటలకు విజయవాడకు చేరుకుంటుంది. మార్గమధ్యలో ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూర్, మంగళగిరి స్టేషన్లలో ఆగుతుంది. సికింద్రాబాద్ నుంచి విజయవాడకు రూ.130, విజయవాడ నుంచి హైదరాబాద్‌కు రూ.135గా ఛార్జీలు నిర్ణయించారు. ఈ రైళ్లన్నింటిలో 16 జనరల్ సెకెండ్ క్లాస్ బోగీలతో పాటు, రెండు లగేజ్ కమ్ బ్రేక్ వ్యాన్ కోచ్‌లుంటాయి.

జాగృతి ఆధ్వర్యంలో అంతర్జాతీయ యువజన సదస్సు

(మొదటిపేజీ తరువాయి) సాయంత్రం జరిగే ముగింపు సమావేశానికి గవర్నర్ ఇ.ఎస్.ఎల్ నరసింహన్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. కాగా శనివారం ఎంపీ కవిత ఈ సదస్సులో పాల్గొనాలని రాజభవన్‌లో గవర్నర్ ను కలిసి ఆహ్వానించారు. మొదటి రోజు యువత అభివృద్ధి పై ప్రముఖ జర్నలిస్ట్ శేఖర్ గుప్తా చర్చా గోష్టిని నిర్వహిస్తారు. పది వేర్వేరు హాళ్లలో వేర్వేరు అంశాలపై చర్చా గోష్టులు జరుగుతాయి. ప్రపంచ ప్రగతిలో యువత పాత్రపైనా యువ నాయకులు మాట్లాడతారు. రెండో రోజు నైపుణ్య శిక్షణ, సమతులా భివృద్ధిలో యువత, మహిళల పాత్ర, కార్పొరేటు, ప్రభు త్వాల భాగస్వామ్యంపై చర్చిస్తారు. వీటిని అంతర్జాతీయంగా ఆయా రంగాల్లో ప్రసిద్ధులు నిర్వహిస్తారు. గాంధేయ మార్గంలో సుస్థిర అభివృద్ధి, నూతన ఆవిష్కరణలు అంశంపై సదస్సులో చర్చిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. 2030 వరకు భవిష్యత్ మానవాళి మనుగడకు అవసరమైన ప్రాథమిక లక్ష్యాలను సాధించేందుకు ఐక్యరాజ్య సమితి విడుల చేసిన 17 అంశాల లక్ష్యాల సాధనలో భాగంగా తెలంగాణ జాగృతి ఈ అంతర్జాతీయ సదస్సును నిర్వహిస్తోందని ఆమె వివరించారు. 103 దేశాల నుంచి 550 మంది ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారని తెలిపారు. 16 దేశాల నుంచి 70 మంది వక్తలు, 40 మంది ప్రత్యేక ఆహ్వానితులు హాజరవుతారని పార్లమెంటుసభ్యురాలు కవిత వివరించారు.

ఐక్యరాజ్య సమితి నిర్దేశించిన 17 లక్ష్యాలు

1. పేదరిక నిర్మూలన, 2. ఆహార సమృద్ధి, 3. ఆరోగ్యం, 4.నాణ్యమైన విద్య, 5.లింగ సమానత్వం, 6.మంచినీరు –పరిశుభ్రత, 7.పర్యావరణ అనుకూల విద్యుత్, 8.గౌరవ ప్రదమైన పని, ఆర్థికాభివృద్ధి, 9. పరిశ్రమలు, మౌలిక వసతులు, నూతన ఆవిష్కరణలు, 10. అన్ని రంగాల్లో సమానత్వం, 11.పర్యావరణ అనుకూల నగరాలు, గ్రామాలు, 12. బాధ్యతాయుతమైన వనరుల వినియోగం, 13.వాతావరణంలో మార్పులు మానవాళి బాధ్యత, 14. సముద్ర జీవుల సంరక్షణ, 15. భూచరాల జీవనానికి అనుకూల వాతావారణం కోసం కృషి, 16. శాంతి, న్యాయందిశగా పటిష్టవ్యవస్థల ఏర్పాటు, 17. పై లక్ష్యాల కోసం వ్యవస్థలు, ఆయాదేశాల పరస్పర సహకారం

అమల్లోకి ఈబీసీ రిజర్వేషన్ చట్టం

(మొదటిపేజీ తరువాయి) ఈ ప్రామాణికాల ప్రకారం ఈబీసీ రిజర్వేషన్లకు అర్హులు ఎవరంటే..

వృత్తిపరంగా, వ్యవసాయ పరంగా వార్షికాదాయం రూ.8 లక్షల కన్నా తక్కువ ఉన్నవారు, అయిదెకరాల కన్నా తక్కువ వ్యవసాయ భూమి, 1,000 చదరపు అడుగుల కన్నా తక్కువ విస్తీర్ణం ఉన్న ఇల్లు కలిగి ఉన్న వారు, నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతాల్లో 100 గజాల కన్నా తక్కువ స్థలంలో ఇల్లు కలిగిన వారు, నాన్ నోటిఫైడ్ మున్సిపల్ ప్రాంతంలో 200 గజాలకన్నా తక్కువ స్థలంలో ఇల్లు ఉన్న అగ్రవర్ణాల వారు.



కేంద్రప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు డా. కె .వి.సుబ్రమణ్యమ్ శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్. కె .జోషిని సచివాలయంలో కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

ఎమ్మెల్సీల అనర్హతపై ముగిసిన వాదనలు

విజయక్రాంతి, హైదరాబాద్: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయాలని టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థనపై శనివారం శాసనమండలిలో వాదనలు జరిగాయి. ఇరు పక్షాల వాదనలు విన్న మండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తన నిర్ణయాన్ని రిజర్వ్ చేశారు. రాములు నాయక్, భూపతిరెడ్డి, యాదవరెడ్డి పై అనర్హత వేటు వేయాలని టీఆర్ఎస్ శాసన మండలి పక్షం కోరింది. ఈ ముగ్గురు ఎమ్మెల్సీల తరపున పలువురు న్యాయవాదులు వాదించారు. తమ పార్టీ గుర్తుపై గెలిచి కాంగ్రెస్‌లో చేరడంతో వారిపై చర్యలు తీసుకోవాలని మండలి ఛైర్మన్ కోరినట్లు టీఆర్ఎస్ మండలి విప్ పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. ఇదే అంశంపై నెల రోజులుగా విచారణ జరుగుతుందని తెలిపారు. మండలి ఛైర్మన్ నిర్ణయం కోసం తాము వేచిచూస్తున్నామని వెల్లడించారు.

యూపీలో ఫిఫ్టీ ఫిఫ్టీ..

(మొదటిపేజీ తరువాయి) 'ఒకప్పుడు కాంగ్రెస్ హయాంలో అత్యవసర పరిస్థితిని ప్రకటిస్తే.. ప్రస్తుతం బీజేపీ పాలనలో కూడా అధికారికంగా ప్రకటించకపోయినా అటువంటి పరిస్థితులే నెలకొన్నాయి' అని ఆమె దుయ్యబట్టారు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకపోవడానికి గల కారణాలను కూడా మాయావతి వివరించారు. ములాయం సింగ్ యాదవ్ సోదరుడు, అఖిలేష్ యాదవ్ బాబాయి శివపాల్ యాదవ్ ఏర్పాటు చేసిన ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ (లోహియా)పై మాయావతి మండిపడ్డారు. శివపాల్ యాదవ్ పార్టీ 'బీజేపీ ముసుగు పార్టీ' అని ఆమె ఆరోపించారు. శివపాల్ యాదవ్, రాజా భయ్యాల వెనుక బీజేపీ ఉండి నడిప్తోందని, ఓట్లను చీల్చేందుకు వారికి బీజేపీ డబ్బులు గుప్పిస్తూ కుట్రకు పన్నాగాలు పన్నుతోందని మాయావతి ఆరోపించారు.

మాయావతే మా ప్రధానమంత్రి అభ్యర్థి: అఖిలేష్ యాదవ్

బీఎస్పీ అధినేత్రి మాయావతే తమ ప్రధానమంత్రి అభ్యర్థని సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్ సూచనప్రాయంగా తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో ఎస్పీ, బీఎస్పీ కూటమిగా ఏర్పడి పోటీ చేస్తున్నట్టు సంయుక్త మీడియా సమావేవంలో ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి అభ్యర్థిగా మాయావతికి మద్దతిస్తారా అని అఖిలేష్‌ను విలేకరులు ప్రశ్నించగా 'పలువురు ప్రధాన మంత్రి అభ్యర్థులను దేశానికి అందించిన చరిత్ర ఉత్తరప్రదేశ్‌కు ఉంది. పీఎం అభ్యర్థిగా నేను ఎవరికి మద్దతిస్తానో మీకందరికీ తెలుసు. రాష్ట్రం నుంచి మరో ప్రధాని వస్తున్నారంటే నేను చాలా సంతోషిస్తాను' అని పరోక్షంగా మాయావతికే తన మద్దతని అఖిలేష్ సంకేతాలిచ్చారు. ఇరు పార్టీలు చెరో 38 స్థానాల్లో పోటీ చేస్తాయని ఆయన వెల్లడించారు. ఆర్ఎల్డీ పార్టీకి రెండు సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి బలం లేదని, అందుకే పొత్తు విషయమై వారితో చర్చించలేదని వ్యాఖ్యానించారు. గతంలోనూ ఎస్పీ,బీఎస్పీ కలిసి పోటీ చేసిన విషయాన్ని అఖిలేష్ గుర్తు చేశారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ ప్రభుత్వం ప్రజల్లో విద్వేషాలను వ్యాప్తి చేసిందని దుయ్యబట్టారు. బీజేపీ దురహంకారానికి చరమగీతం పాడేందుకు బీఎస్పీ, ఎస్పీ చేతులు కలపాల్సిన అనివార్యత ఏర్పడిందన్నారు. కార్యకర్తల్లో విభేదాలు సృష్టించేందుకు బీజేపీ ఎంతకైనా తెగిస్తుందని, అలాంటి ఎత్తుగడలను సమష్టిగా తిప్పిగొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మాయావతిపై బీజేపీ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేసినప్పటి నుంచి ఎస్పీతో పొత్తు ఆలోచన తన మనసులో మెదులుతూనే ఉందన్నారు. ఆమెపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారికి బీజేపీ మంత్రి పదవులిచ్చిందన్నారు.

మా పార్టీ లేకుండా ఆ కూటమి అసంపూర్ణం: శివపాల్

కాగా ఎస్పీ, బీఎస్పీ కూటమిపై ప్రగతిశీల సమాజ్‌వాదీ పార్టీ(లోహియా) అధినేత శివపాల్ యాదవ్ స్పందించారు. తమ పార్టీ లేకుండా ఆ కూటమి అసంపూర్ణమని వ్యాఖ్యానించారు. లౌకిక వాద కూటమే బీజేపీని ఓడించగలదన్నారు. మాయావతి వ్యాఖ్యలపై ఆ పార్టీ శ్రేణులు మండిపడ్డాయి. మతతత్వ శక్తులపై శివపాల్ నాలుగు దశాబ్దాలుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నారంటూ ఆమె ఆరోపణలను తిప్పికొట్టారు. ఈ కూటమిది అవకాశవాదమని.. సమాజ్‌వాది కార్యకర్తలెవరూ దానికి మద్దతు పలకరన్నారు.

అది అరాచక కూటమి.. వారి పొత్తుతో మాకే లాభం: యోగి

దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న సమాజ్‌వాదీ పార్టీ, బహుజన్ సమాజ్ పార్టీ కూటమిగా ఏర్పడి లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయనున్నట్టు ప్రకటించడంపై ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీవ్ర విమర్శలు చేశారు. మాయావతి నేతృత్వంలోని బీఎస్పీ, అఖిలేశ్ యాదవ్ నాయకత్వంలోని ఎస్పీ తమ ఉనికి కోసమే ఏకమయ్యాయని ఆయన ఆరోపించారు. ప్రజలకు ఈ పార్టీల గురించి బాగా తెలుసునని, తగిన విధంగా ఓట్లు వేస్తారని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు తెలుసు అసలు నిజాలేమిటో, అందుకు అనుగుణంగా ఓట్లు వేస్తారు. బీజేపీ 2014లో సాధించిన స్థానాలకన్నా ఎక్కువ స్థానాలను 2019 లోక్‌సభ ఎన్నికల్లో గెలుస్తుంది' అని ఆదిత్యనాథ్ ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా ఎలాంటి విపక్ష కూటమి వచ్చినా అరాచకత్వం, అవినీతి, రాజకీయ అస్థిరత్వం తప్పవన్నారు. ఆరాచకత్వమే రాజ్యమేలుతుందని, అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయి రాజకీయ అనిశ్చితి తలెత్తుతుందని యోగి మండిపడ్డారు.

పొత్తుపై అదే చివరిమాట కాకపోవచ్చు: చిదంబరం

ఉత్తరప్రదేశ్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో సంబంధం లేకుండా ఎస్పీ, బీఎస్పీ పొత్తుపై కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ కేంద్ర ఆర్థిక మంత్రి పి.చిదంబరం స్పందించారు. బహుశా అదే వారి చివరిమాట కాకపోవచ్చని ఆయన అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ పొత్తులపై ఎస్పీ, బీఎస్పీ పునరాలోచించే అవకాశాలుండొచ్చని చిదంబరం అభిప్రాయపడ్డారు.

ఎస్పీ, బీఎస్పీ పొత్తును స్వాగతించిన మమత

మరోవైపు ఎస్పీ, బీఎస్పీ మధ్య కుదిరిన సీట్లు ఒప్పందంపై ఎన్డీయేతర పార్టీల నేతలు హర్షం వ్యక్తం చేశాయి. మాయవతి, అఖిలేష్ యాదవ్ చారిత్రక ప్రకటనను స్వాగతిస్తున్నట్లు బెంగాల్ సీఎం, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ మేరకు ట్విటర్ ద్వారా వారికి అభినందనలు తెలిపారు. అలాగే ఆర్జేడీ నేత, బిహార్ ప్రతిపక్ష నాయకుడు తేజస్వీ యాదవ్ కూడా మాయా, అఖిలేష్ కూటమిపై స్పందించారు. యూపీలో ఏర్పడిన కూటమితో బీజేపీ పతనం ప్రారంభమవుతుందన్నారు.

అధికార దాహంతోనే మహా కూటమి: అమిత్ షా

న్యూఢిల్లీ: యూపీలో ఎస్పీ, బీఎస్పీ జట్టుకట్టడంపై బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా మండిపడ్డారు. అధికార దాహంతోనే ప్రతిపక్షాలు మహాకూటమి పేరుతో ఒక్కటవుతున్నాయని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకమైనా మోదీ నాయకత్వంలో బీజేపీ మెజారిటీ స్థానాలు గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని రామ్ లాలా మైదానంలో జరుగుతున్న బీజేపీ జాతీయ సదస్సులో ఆయన మాట్లాడుతూ.. 'అధికారం కోసమే మహాకూటమి పేరుతో ప్రతిపక్షాలన్నీ జట్టుకడుతున్నాయి. అయినప్పటికీ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పోరాడటానికి మేము సిద్ధంగా ఉన్నాం. కుటుంబ రాజకీయాలు, కుల రాజకీయలు, బుజ్జగింపు రాజకీయాలు.. అనే మూడు పుండ్లు దేశాన్ని పట్టిపీడిస్తున్నాయి. ఇలాంటి అల్సర్లను ప్రోత్సహించింది కాంగ్రెస్ పార్టీనే. వీటి వల్ల ప్రజలకు రావాల్సిన ప్రయోజనాలు దక్కడం లేదు. అర్హులైన వారికి అవకాశాలను దక్కకుండా చేస్తున్నారు. దీనివల్ల నిజమైన అభివృద్ధి ఆగిపోతోంది..." అని షా అన్నారు. 2014 నుంచి మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో పయనిస్తోందనీ.. కాంగ్రెస్ వ్యాప్తిచేసిన మూడు 'మూడు అల్సర్ల' నుంచి దేశాన్ని విముక్తి చేసేందుకు మోదీ తీవ్రంగా కృషిచేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటీవల మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో బీజేపీ అధికారం కోల్పోయినప్పటికీ, ఈ రాష్ట్రాల్లో పార్టీ పునాదులు బలంగానే ఉన్నాయని అమిత్ షా తెలిపారు.

18 ఏళ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

విజయక్రాంతి, ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ నియోజక వర్గంలో కెఆర్‌కె ప్రసాద్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ప్రస్తుత దఫా చేపడుతున్న ఓటు హక్కు నమోదు సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకొని ఓటు హక్కు పొందాలన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ రాజ్ కుమార్, కృష్ణ, శ్రీనివాస్ యాదవ్, బిక్షపతి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

- పల్లెచెరువులో జీహెచ్‌ఎంసీ కూల్చివేతలు




విజయక్రాంతి, రాజేంద్రనగర్: అక్రమ నిర్మాణాలపై జీహెచ్‌ఎంసీ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. గత కొన్ని రోజుల క్రితం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో వెలసిన అక్రమ నిర్మాణాలను దశల వారీగా కూల్చివేస్తున్నారు. అందులో భాగంగానే శనివారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని మైలార్‌దేవ్‌పల్లి పల్లెచెరువు ఎఫ్‌టీఎస్ పరిధిలో నిర్మించిన అక్రమ భవనాన్ని టౌన్‌ప్లానింగ్ అధికారులు కూల్చివేశారు. కొందరు అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా పల్లెచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రెండస్తుల భవనాన్ని నిర్మించారు. ఈ అక్రమ నిర్మాణాలపై స్థానికులు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు ఆయా అక్రమ నిర్మాణాలను రెవెన్యూ అధికారులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం జేసీబీ సహాయంతో ఆయా భవనాన్ని కూల్చివేసినట్లు రాజేంద్రనగర్ సర్కిల్ ఏసీపీ బాలానందస్వామి తెలిపారు. అదే విధంగా శుక్రవారం కూడా ఉప్పర్‌పల్లి సమీపంలోని మూసీ నది పరివాహక ప్రాంతంలో వెలసిన రెండు అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు తెలిపారు. గతంలో మాదిరిగా ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలను చేయటానికి వీలు లేదన్నారు. ఇంకా చాలా చోట్ల అక్రమ నిర్మాణాలు జరుగుతున్నట్లు తమకు సమాచారం అందిందన్నారు. త్వరలోనే అన్ని ప్రాంతాల్లో వెలసిన అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నామన్నారు.

వివేకానంద 156వ జయంతి వేడుకలు



విజయక్రాంతి, మెహిదీపట్నం: స్వామి వివేకానంద 156వ జయంతిని పురస్కరించుకొని జాతీయ యువజన దినోత్సవాన్ని నాంపల్లి నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. నగర బిజేవైఎం ఐసెల్ కో– కన్వీనర్ సంత్‌కుమార్, బిజేవైఎం గుడిమల్కాపూర్ జనరల్ సెక్రేటరి అరుణ్ కుమార్‌లు నిలోఫర్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బిస్కెట్లు పంపిణి చేశారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ.. స్వామి వివేకానంద భారతదేశం ఆధ్యాత్మికత గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడని కీర్తించారు. యువత స్వామి వివేకానంద స్ఫూర్తితో ఆత్మవిశ్వాసంతో అనుకున్న లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు.



విజయక్రాంతి, ముషీరాబాద్: స్వామి వివేకానంద యువతకు స్ఫూర్తిదాయకమని ఆయనను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని బీజేవైఎం సిటీ ప్రెసిడెంట్ వినయ్ కుమార్ పేర్కొన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న వివేకానంద విగ్రహానికి 156వ జయంతిని పురస్కరించుకొని పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్‌రెడ్డి, శివాజీ, ఆనంద్ యాదవ్, సుదర్శన్, శక్తి రాజ్ కుమార్, అంజయ్య, అరుణ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట్‌లో: స్వామి వివేకానంద 156వ జయంతి సందర్భంగా జాతీయ యువజన దినంలో భాగంగా గోల్నాక డివిజన్ యువమోర్చా అధ్యక్షుడు ఎస్.శ్రీధర్‌గౌడ్, ఆధ్వర్యంలో కృష్ణానగర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి గోల్నాక గంగానగర్ డిమార్ట్ వద్ద ఉన్న స్వామి వివేకానంద విగ్రహం వరకు 2కిలోమీటర్లు 'దేశం కోసం పరుగు' ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం ఉపాధ్యక్షుడు మూల రవీందర్‌గౌడ్, గ్రేటర్ ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, డివిజన్ నాయకులు బి.నర్సింగ్‌రావుయాదవ్, ఈ.అజయ్‌కుమార్, కె.నర్సింగ్‌యాదవ్, బి.రంజిత్‌రెడ్డి, ఎస్.రాజేష్, ఆర్‌వీఎల్.రమేష్, కె.రవిందర్, టి.కృష్ణ, రాజు, శ్రీకాంత్, సురేష్, సాయియాదవ్, యు.శ్రీనివాస్, మహేష్, రాజురెడ్డి, సూరజ్, శేఖర్, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం.. పెద్దపల్లి కలెక్టర్ శ్రీదేవసేన: యువత జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి స్వామి వివేకానంద జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శ్రీదేవసేన పేర్కొన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకొని పెద్దపల్లి కలెక్టరేట్‌లో శనివారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వివేకనందుడు భారతీయతకు చిహ్నం అని అన్నారు. దేశ ఔనత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనుభాడిని యువత అదర్శంగా తీసుకోవాలని అన్నారు. దేశంలో ఎక్కువ సంఖ్యలో ఉన్న యువకుల పైనే దేశ భవిష్యత్ అధారపడిఉందన్నారు. భారత దేశ సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్క యువకుడు ప్రతిరోజు ఒక మంచి పని చేస్తు ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపు నిచ్చారు. వివేకనందుని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ బాధ్యులు లింగమూర్తి, కుమార స్వామి, నారాయణ, సుధాకర్, శ్రీనివాస్, కుమార్, రిటేడ్ ఉపాధ్యాయులు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుతోనే చైతన్యం

విజయక్రాంతి, ఎల్బీనగర్: ఓటరు లిస్ట్‌లో పేరు నమోదుతోనే చైతన్యం ప్రారంభించాలని తద్వారా ఓటువేసి మీకిష్టమైన, అభివృద్ధికి అనువైన నాయకున్ని ఎన్నుకోగలరని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు.

లింగోజిగూడ డివిజన్‌లోని మజిద్ గల్లీలో ఓటరు నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, అఫ్సర్, ఆడల రమేష్, మహమూద్ పాషా, అక్బర్, ఇబ్రహీం, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్టనూ మింగేశారు..!

- అడ్డ దారిలో రహదారి పనులు
- అన్ని అనుమతులున్నాయని బుకాయిస్తున్న గుత్తేదారు..
- పట్టించుకోని అధికారులు..



విజయక్రాంతి, వికారాబాద్: అభివృద్ధి పనులను అడ్డు పెట్టుకుని కొంతమంది గుత్తేదారులు ప్రకృతీ వనరులను కొల్లగొడుతున్నారు. ముఖ్యంగా రోడ్డు పనుల్లో నిబంధనలు తుంగలో తొక్కి రహదారి పనులు చేపడుతున్నారు. రోడ్డు పనుల్లో ఉపయోగించే ఎర్రమట్టి కోసం గుట్టలను ఎలాంటి అనుమతి లేకుండా కొల్లగొడుతున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన స్థానికులకు అన్ని అనుమతులు ఉన్నాయంటూ గుత్తెదారు బుకాయిస్తున్నారు. వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని అంగడి చిట్టంపల్లి నుంచి చన్‌గొముల్ వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఈ మద్యనే సంబంధిత అధికారులు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. టెండరు దక్కించుకున్న సంబంధిత గుత్తెదారు గతంలో ఉన్న గుంతల మయమైన రోడ్డును తొలగించి మట్టి రోడ్డు పనులు చేపట్టారు. మట్టి రోడ్డు పూర్తి కాగానే బీటీ రోడ్డు వేసేందుకు మట్టి రోడ్డు పనులను మొదటగా చేపట్టారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. మట్టి రోడ్డు పనుల్లో సంబంధిత కాంట్రాక్టరు నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. సంబంధిత గుత్తెదారుకు మట్టి రోడ్డు కోసం మట్టి అవసరం ఉంటే..మట్టిని కొనుగోలు చేయడమో..లేదా..రెవెన్యూ, గనుల శాఖ వద్ద అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలా కాకుండా స్థానికంగా ఉన్న కిందిస్థాయి రెవెన్యూ అధికారులను గుత్తెదారు ప్రలోభపెట్టి ప్రకృతీ సిద్ధమైన గుట్టను పూర్తిగా తవ్వి మట్టి రోడ్డు పనులు చేపడుతున్నారు. మన్నెగూడకు సమీపంలో దాదాపు మూడు ఎకరాల పరిధిలో ఎర్ర మట్టి గుట్ట ఉండేది. ప్రస్తుతం ఆ ఎర్ర మట్టి గుట్టను సంబంధిత రోడ్డు కాంట్రాక్టర్ కొల్లగొట్టడంతో పూర్తిగా అంతరించి పోయింది.

నిబంధనలు గాలికి..

ప్రస్తుత ప్రభుత్వంలో రోడ్డు పనులు జోరందుకున్నాయి. దీనిలో భాగంగా రోడ్డు కాంట్రాక్టర్ల దృష్టి అంతా రోడ్డు పక్కనే ఉన్న ఎర్రమట్టి గుట్టలపై పడుతుంది. కింది స్థాయిలో ఉన్న రెవెన్యూ అధికారులను ప్రలోభ పెట్టి ఎర్రమట్టి గుట్టలను కొల్లగొడుతున్నారు. సంబంధిత కాంట్రాక్టరు ఎర్రమట్టి కావాల్సి వస్తే..ముందుగా మండల రెవెన్యూ అధికారి వద్ద అనుమతి పొందాలి. తదనంతరం జిల్లా మైనింగ్ అధికారి వద్ద అనుమతి తీసుకుని ఎర్రమట్టిని తవ్వుకోవాలి.

గజం వరకు లోతు తవ్వుకునేందుకు మండల రెవెన్యూ అధికారి అనుమతి అవసరం ఉంటుంది. ఆపై తవ్వకాలు జరిపితే తప్పకుండా మైనింగ్ శాఖ అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. గుట్టలు గుట్టలు గుత్తెదారులు తవ్వకాలు జరుపుతున్న స్థానిక మండల రెవెన్యూ అధికారులు..మైనింగ్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి సంబంధిత గుత్తెదారుపై చర్యలు తీసుకుని ప్రకృతీ వనరులను కాపాడాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

విజయక్రాంతి, మిర్యాలగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే భాస్కర్‌రావు సతీమణి జయ, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి భార్గవ్ అన్నారు. పట్టణంలోని 24వ పరిధి కూర్చున్న గాంధీబొమ్మ దగ్గర శివాని స్కూల్ యాజమాన్యం శ్యాంసుందర్‌రెడ్డి–నాగలక్ష్మిలు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు చైతన్యవంతులై విద్య, ఉద్యోగాల్లో రాణించాలని కోరారు. మారుతున్న సమాజానికనుగుణంగా మహిళల్లో మార్పులు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్య వైశ్య మాజీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు రాయపూడి భవాని, కౌన్సిలర్ దయాకర్‌రెడ్డి, రేపాల రమేష్, చెల్కపల్లి శ్రీనివాస్, దుండిగాల అంజయ్య, ఇలియాస్, బాలు, పందిరి రవీందర్, మిర్యాల సత్యనారాయణ, సుమంత్ రెడ్డి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతోనే సముచిత కార్యనిర్వాహణ

విజయక్రాంతి, రామగుండం: సమన్వయం సముచిత కార్యనిర్వాహణకు దోహదపడుతుందని శనివారం గోదావరిఖనిలోని సింగరేణి ఇల్లందు గెస్ట్‌హౌజ్‌లో జరిగిన సింగరేణి, పోలీసు కమిషనరేట్ అధికారుల సమావేశం అభిప్రాయపడింది. సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్, పా) ఎస్.చంద్రశేఖర్‌తో రామగుండం పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణతోపాటు ఇతర అధికారులు సమావేశమయ్యారు. సింగరేణి విస్తరించి ఉన్న ప్రాంతాల్లో శాంతిభద్రతల పరిరక్షణ కోసం కమిషనరేట్ పోలీసులు అందిస్తున్న సేవలు శ్లాఘణీయమన్నారు. అలాగే పోలీసు శాఖ సింగరేణి అందిస్తున్న సహాయసహకారాలు కూడా ఇరు శాఖల సమన్వయానికి ఎంతగానో ఉపకరిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో పోలీసు, సింగరేణి అధికారులు అశోక్ కుమార్, ఎం.రవికుమార్, సంజీవ్‌కుమార్, రక్షిత కె.మూర్తి, వి.విజయపాల్‌రెడ్డి, కె.సూర్యనారాయణ, వీరారెడ్డి, త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాక్షేమమే కర్తవ్యం

ప్రజాక్షేమం పోలీసుల ప్రథమ కర్తవ్యమని రామగుండం పోలీస్ కమిషనరేట్ పోలీసు ఉన్నతాధికారులు పేర్కొన్నారు. ఎన్టీపీసీ జ్యోతినగర్‌లోని మిలీనియం హాల్‌లో పెద్దపల్లి డివిజన్ స్థాయి పోలీసు అధికారుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్షలో డీసీపీ పి.సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ కమ్యూనిటీ పోలీసింగ్‌ను విస్తృతపర్చాలన్నారు. ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపాలన్నారు. విధుల్లో సమర్ధతను చాటాలన్నారు.

వణికిస్తున్న చలి

విజయక్రాంతి, దుబ్బాక: దుబ్బాక నియోకవర్గన్ని చలి పులిగా మారింది. దుబ్బాక ప్రబలు సాయంత్రం ఐదు అయిందటే ఇంటి గడప దాటడంలేదు. దుబ్బాక నియోజకవర్గాన్ని చలి గజగజ వణికిస్తుంది. ప్రజలకు నీరుకు, మంటకు బయపడాల్సింది పోయి ఇప్పుడు చలికి భయపడే పరిస్థితి ఎదుర్కొంది. చలి పులిగా వీస్తుంది. ఉదయం 10గంటల వరకు కుడా ఇంట్లో నుంచి ప్రజలు బయటకు రావడానికి సాహసించడం లేదు. ఇక సాయంత్రం 5 అయ్యిందంటే చాలు చలిపులికి దుబ్బాక వాసులు గజగజ వణికిపోతున్నారు. జనవరిలోనే ఈ విధంగా ఉష్ణోగ్రతలు నమోదు అయితే ఇక చలి శివరాత్రి వరకు ఉంటుందని పలువురు అంటున్నారు. ఈ నేపథ్యంలో చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా వాహనాలపై వేకువజామున, రాత్రి పొద్దుపోయాక ప్రయాణించే వారు కూడా జాగ్రత్తలు పాటించాలని అంటున్నారు. చలికి ప్రజలు స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు ధరిస్తున్నారు. ఇక పలు గ్రామాల్లో సాయంత్రం అయిందంటే చాలు చలిమంటలు కాచుకుంటూ కూర్చున్న సంఘటనలు దుబ్బాకలో అనేకం కనిపిస్తున్నాయి.

జాతీయ సమైక్యతకై భారత్ గౌరవయాత్ర



విజయక్రాంతి, హైదరాబాద్: వన్ ఇండియా – వన్ పీపుల్ అంటూ స్టూడెంట్ ఎక్స్‌పీరియన్స్ ఇన్ ఇంటర్‌స్టేట్ లివింగ్ (సెయిల్) ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతకై భారత్ గౌరవ యాత్ర సివిక్ రిసెప్షన్‌ను జేఎన్‌టీయూలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎన్‌సీఈఆర్టీ మెంబర్ పీ. మురళీ మనోహర్, ఏబీవీపీ జాతీయ పూర్వ అధ్యక్షుడు ఆచార్య శంకర్, గ్రేటర్ హైదరాబాద్ నగర కార్యదర్శి పి. శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ గత 50 సంవత్సరాలుగా ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులను భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు, ఇక్కడి విద్యార్థులను ఈశాన్య రాష్ట్రాలకు పంపిస్తామన్నారు.

దీని వల్ల మన సంస్కృతి, సంప్రదాయా లు తెలుస్తాయని, మన వేష, భాషలు వేరైనా మనదంతా ఒకే సంస్కృతి, ఒకే జీవన విధానమని చాటడం ఈ గౌరవయాత్ర లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కార్యకర్తలు బాలకృష్ణ, నీరవ్, నిరంజన్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీ ఏర్పాటుకు విజ్ఞప్తి

విజయక్రాంతి, కొల్లాపూర్: కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించే విధంగా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి కృషి చేయాలని డీవైఎఫ్ఐ నాయకులు రాజేందర్ కోరారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలోని విలేకర్లతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో కలప, నీరు, అటవీ సంపద పుష్కలంగా ఉన్నందున సిమెంట్ పరిశ్రమను ఏర్పాటు చేసి యువతకు ఉపాధి కల్పించాలని ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల నియోజకవర్గం అభివృద్ధి కాలేదని, పరిశ్రమలు ఏర్పాటు చేస్తే యువతకు ఉపాధి దొరుకుతుందని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సమయపాలనపై వినతిపత్రం

విజయక్రాంతి, మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలు చలికాలం గడిచేంత వరకు సమయపాలనను మర్చాలని కోరుతూ గురువారం మందమర్రి తెలంగాణ రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం (టిఆర్ఎస్‌వి) ఆధ్వర్యంలో జిల్లా విద్యాధికారి రషీద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మందమర్రి టిఆర్‌ఎస్‌వి నాయకులు వేముగంటి శ్రీహర్ష మాట్లాడుతూ మందమర్రి మండలంలోని సుమారు 20 నుంచి 25 వరకు ప్రైవేట్ పాఠశాలలు ఉన్నాయని, ఈ చలి కాలంతో ముగిసేంత వరకు అన్ని ప్రైవేట్ పాఠశాలో సమయపాలనలను మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని డిఈవోను కోరామన్నారు.

జిల్లా సాధించేంత వరకూ ఉద్యమం

విజయక్రాంతి, మిర్యాలగూడ: మిర్యాలగూడ జిల్లా సాధించేంత వరకూ ఉద్యమిస్తామని జిల్లా సాధన కమిటీ సభ్యులు కందుకూరి శ్రీధర్‌గుప్త, చందనా శ్రీధర్‌గుప్తా, చింత పద్మ, రాఘవరాణిలు స్పష్టం చేశారు. మిర్యాలగూడ జిల్లా చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం 22వ రోజుకు చేరాయి. దీక్షలకు పలు పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వసతులున్న మిర్యాలగూడను జిల్లాగా ప్రకటించాలని, జిల్లా ప్రకటించేంత వరకూ దీక్షలు కొనసాగిస్తామన్నారు. జిల్లా ప్రకటించే విధంగా ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎన్నో ఏళ్లుగా జిల్లా సాధించాలనే ఆకాంక్ష ఇక్కడి ప్రజల్లో గట్టిగా నాటుకుపోయిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా సాధించే వరకు విశ్రమించమన్నారు. కార్యక్రమంలో నాయకులు ముజ్జా రామకృష్ణ, భానుప్రసాద్, విష్ణుమూర్తి, భరత్, నాగరాజు, శివకుమారి, డేవిడ్ పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలి

విజయక్రాంతి, నారాయణపేట: తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్‌కు అందరూ కలిసి సహకరించాలని మహబూబ్‌నగర్ ఎంపీ జితేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డిలు అన్నారు. శనివారం నారాయణపేట మండల పరిధిలోని కొల్లంపల్లి గ్రామంలో దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా జరిగిన 14వ సర్వధర్మ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. అంతకు ముందు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. తర్వాత సర్వ సభ్య సమ్మేళనంలో వారు మాట్లాడుతూ అన్ని మతాల సారం ఒక్కటేనని, అన్ని ధర్మాలు కూడా అందరూ కలిసి ఉండాలని చెపుతాయని అన్నారు. ప్రతి సంవత్సరం అందరిని కలపడానికి అన్ని మతాల సారాంశాలను చెప్పడానికి కొల్లంపల్లి బాబా చేస్తున్న సాహసాన్ని ప్రశంసించారు. మన అభివృద్ధి కోసం అందరూ ఆలోచించాలని తెలంగాణ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మణెమ్మలతో పాటు వివిధ మతాల గురువులు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన పతంగుల సందడి

విజయక్రాంతి, పటాన్‌చెరు: సంక్రాంతి వచ్చిందంటే చాలు చిన్నా పెద్ద తేడా లేకుండా ప్రతి ఒక్కరూ పతంగులు ఎగురవేయడానికి ఆసక్తి చూపిస్తారు. కొన్ని చోట్ల కైట్ ఫెస్టివల్స్ నిర్వహించడం సంప్రదాయంగా మారింది. ఇప్పటికే పతంగుల దుకాణాల వద్ద సందడి పెరిగిపోయింది. ప్రతి ఏడాదిలాగే ఈ సారి కూడా సినిమా నటులు, రాజకీయ నేతల ఫోటోలతో పతంగులను తయారు చేస్తున్నారు. సంక్రాంతి అనగానే భోగి మంటలు, గంగిరెద్దుల ఊరేగింపులు, గాలి పటాలు ఇలా ఉన్నో గుర్తుకు వస్తాయి. వీటన్నింటిలో చిన్న పిల్లలు నుండి పెద్దల వరకు గాలి పటాలు ఎగురవేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. దీనితో పటాన్‌చెరు పట్టణంలో ముఖ్య కూడలిలలో పతంగులు అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. పండుగ సమీపిస్తోంది అంటే పట్టణంలో పతంగుల సందడి ప్రారంభమైందన్న మాట. నానాటికి పెరుగుతున్న కాలనుగుణంగా గాలి పటాల్లో సైతం మార్పులు వస్తున్నాయి.

గ్రామీణ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి



విజయక్రాంతి, రాజేంద్రనగర్: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో అభివృద్ధి నిర్వహణ (పిజీడీఆర్‌డీఎం) పూర్తిచేసిన అభ్యర్థులు కీలక పాత్ర వహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జార్కండ్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ కార్యదర్శి, ఐఏఎస్ ప్రవీణ్ కుమార్‌తోపో అన్నారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని నేషనల్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ సంస్థలో పీజీడీఆర్ఎం విద్యార్థుల శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు కావాలంటే నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, యువత ప్రధాన పాత్ర వహించాల్సిన అవసరముందన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ జనరల్ డబ్ల్యు ఆర్.రెడ్డి మాట్లాడుతూ మానవ వనరులు, గ్రామీణా ప్రాంతాల అభివృద్ధిలో ఎన్ఆర్‌డీపీఆర్ ఎంతో పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు రాధిక రస్తోగీ, ఫ్రాంక్లీన్ లాల్ తింక్ కున్వా, ఎస్.జలీల్, జి.మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

పేద క్రికెటర్లకు గౌతమ్ గంభీర్ స్కాలర్‌షిప్‌లు

విజయక్రాంతి, ముషీరాబాద్: ఆర్థికంగా వెనుకబడిన పేద క్రికెటర్లను ప్రోత్సహించేందుకు ప్రముఖ క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్కాలర్‌షిప్‌లను అందించనున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే సికింద్రాబాద్ తార్నాకలోని విజే క్రికెట్ అకాడమీ యువ క్రీడాకారులకు శిక్షణ ఇస్తోంది. ఆసక్తిగల యువ క్రికెటర్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు అకాడమీ కోచ్ జావళి వెంకటరమణ తెలిపారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రోత్సహించేందుకు భారత క్రికెటర్ గౌతమ్ గంభీర్ స్కాలర్‌షిప్‌లను ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు.12 సంవత్సరాల నుంచి 24 ఏళ్ల మధ్య వయసు కలిగిన క్రీడాకారులు దరఖాస్తులను ఈ నెల 12 నుంచి 14 వరకు సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య తార్నాక విజే క్రికెట్ అకాడమీ కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. వివరాల కోసం విజె క్రికెట్ అకాడమీ సంప్రదించాలని కోరారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి: ఎమ్మెల్యే



విజయక్రాంతి, ఉప్పల్: స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రతి ఒక్కరూ ప్రాముఖ్యతనిచ్చి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాప్రా సర్కిల్ లోని ఏఎస్ రావునగర్ డివిజన్‌లో నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ పజ్జూరి పావని మణిపాల్‌రెడ్డిలు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. క్లీన్ అండ్ గ్రీన్‌లో భాగంగా లక్ష్మీపురం కాలనీలో చీపుర్లతో శుభ్రం చేసి పలు చోట్ల ముగ్గులతో అలంకరించారు. ఇంటింటికి తిరిగి మహిళలకు బొట్టు పెట్టి తడి చెత్త, పొడి చెత్త సేకరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం వల్ల అనారోగ్యానికి దూరంగా ఉంటామని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేరుచేయడం వలన రీ సైక్లింగ్ సులభతరం అవుతుందని, వాటి వలన ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణకు పాటు పడాలని కోరారు. కార్పొరేటర్ పావనీ మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షన్ పరిపూర్ణంగా నిర్వహించి గతంలో 5 అవార్డులను కైవసం చేసుకోవడం జరిగిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి డిప్యూటి కమీషనర్ దశరథ్, ఎఎమ్‌హెచ్‌ఓ.డాక్టరు మైత్రి, శానిటరీ సూపర్‌వైజర్ ధనాగౌడ్, మాజీ కార్పొరేటర్ కొత్తా రామారావు, నాయకులు మణిపాల్‌రెడ్డి, జనుపల్లి వెంకటేశ్వరెడ్డి, సురేందర్‌రావు, కరియప్ప, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు గల్లంతుపై ఆర్డీవోకు ఫిర్యాదు

విజయక్రాంతి, బోధన్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకున్న రెంజల్ మండలం నీలాపేపర్ మిల్ గ్రామానికి చెంది రవళి అనే మహిళ ఇప్పుడు జరగబోయే పంచాయితీ ఎన్నికల్లో పోటీ చేద్దామని కావలసిన ధృవీకరణ పత్రాలు సిద్ధంచేసుకుంటున్న తరుణంలో తన పేరు ఓటరు లిస్టులో లేదని గుర్తించి ఆవేదన చెందారు. ఈ విషయంలో ఆమె బోధన్ ఆర్డీవోకు ఫిర్యాదు చేసింది.

ప్రజల అవసరాలు ప్రభుత్వానికి తెలియాలి

విజయక్రాంతి, పటాన్‌చెరు: ప్రజల అవసరాలు ప్రభుత్వానికి తెలిసేలా ఉండాలని అమీన్‌పూర్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్ పేర్కొన్నారు. రాష్ట్ర పోలీసు ఉన్నతాధికారి మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు సామాజిక అవసరాలు తెలుసుకునేందుకు శనివారం మండలంలోని దయార, వడక్‌పల్లి గ్రామాలల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాలలో ఉన్న మౌళిక వసతుల గురించి గ్రామస్థులను అడిగారు. ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి పరిష్కారం అయ్యేలా చూస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ఎస్ఐలు దత్తు, ప్రశాంత్ గ్రామస్థులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో జోరుగా నామినేషన్లు

విజయక్రాంతి, డోర్నకల్: డోర్నకల్ నియోజకవర్గంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు రెండో విడత నామినేషన్ల జోరుగా కొనసాగుతోంది. గ్రామ పంచాయతీల్లో సర్పంచ్, వార్డు సభ్యులకు రెండవరోజు నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. ఈ నెల 13వ తేది వరకూ ఆయా గ్రామా పంచాయతీల్లో ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు సమర్పించనున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలుపోటములపై భారీగా అభ్యర్థుల అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నామినేషన్లు కూడా జోరందుకోవడంతో పోటీ తీవ్రంగా ఉన్నట్లు పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



భారతీయులకు శుభవార్త

ఇంత కాలం వీసా నిబంధనలు కఠినతరం చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కాస్త మెత్తబడ్డారు. హెచ్1బీ వీసాదారులు అమెరికాలో నిశ్చింతగా ఉండొచ్చని, విధాన ప్రక్రియలో సరళత్వం, స్థిర నివాసానికి సంబంధించి కచ్చితమైన హామీతో పాటు పౌరసత్వానికి వీలు కల్పించేలా హెచ్1బీ వీసా విధానంలో త్వరలో సమూల సంస్కరణలు తీసుకురాబోతున్నా మని ట్రంప్ ప్రకటించారు. సమర్థులైన అత్యంత నైపుణ్యవంతులు అమెరికాలో ఉద్యోగాలు చేయడాన్ని ప్రోత్సహించేలా కొత్త నిబంధనలు ఉంటాయని పేర్కొన్నారు. పౌరసత్వం, స్థిర నివాసం సహా అమెరికా వచ్చే వారికి ప్రయోజనం కల్పించే పలు మార్పులు త్వరలోనే రాబోతున్నాయి. ప్రతిభావంతులను మేం ప్రోత్సహించాలనుకుంటున్నాం అని ఆయన ట్వీట్ చేశారు. హెచ్1బీ వీసాపై అమెరికాలో ఉంటున్నవారిలో అధికులు భారతీయ ఐటీ నిపుణులే కావడం గమనార్హం. ట్రంప్ ప్రకటన అమెరికా గ్రీన్‌కార్డ్ కోసం దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న వేలాది భారతీయులకు శుభవార్తే. ట్రంప్ అధికారం చేపట్టాక హెచ్1బీ నిబంధనలను కఠినతరం చేయాలని పట్టుబడుతున్న విషయం తెలిసిందే. అయితే కొద్ది కాలంగా ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని తాము ప్రోత్సహిస్తామని, మిగతా వలసలను బాగా తగ్గిస్తామని ట్రంప్ చెబుతున్నారు. హెచ్1బీ వీసాకు దరఖాస్తు చేసుకున్న వాళ్లలో అత్యుత్తములనే ఎంపిక చేసేలా ప్రభుత్వం కృషి చేయాలని గత నెలలో హోం ల్యాండ్ సెక్యూరిటీ విభాగ మంత్రి కిర్‌స్టెన్ నీల్సెన్ చట్టసభ్యులకు తెలిపారు. ఉద్యోగ ఆధారిత వీసా మోసాలను గుర్తించి నిరోధించేందుకు ట్రంప్ ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేసిందనీ, అమెరికన్ ఉద్యోగుల హక్కులను కాపాడాలంటే వలసయేతర వీసాల్లో సంస్కరణలు అవసరమన్నారు. ట్రంప్ ప్రకటనపై పలువురు భారతీయ హెచ్1బీ వీసాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ట్రంప్ మాటలు నిజమైతే మంచిదేగానీ ఇప్పటి నుంచే ఆశలు పెట్టుకోవద్దని ఒబామా కాలంలో హెచ్1బీ అధికారిగా పనిచేసిన ఒకరు హెచ్చరించటం గమనార్హం.

చుక్కల భూములకు చక్కని పరిష్కారం

దశాబ్ధాలుగా సమస్యాగ్రస్తంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించే దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం అభినందనీయం. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఈ విషయంలో చొరవ తీసుకుని దశాబ్దాలుగా ఎటూ తేలకుండా ఉన్న భూముల విషయంలో, ఆ భూముల యాజమాన్యం తేల్చే విషయంలో ముందడగు వేయడం మంచి విషయం. ఈ నిర్ణయం వల్ల దాదాపు 24 లక్షల ఎకరాల భూములకు సంబంధించిన సమస్య పరిష్కారమైంది. కొత్త రాష్ట్రం ఏర్పడిన తరువాత, భూముల ప్రాధాన్యం పెరిగిన నేపథ్యంలో ఇది అత్యవసరం. ఈ విషయాన్ని గుర్తించి తగిన చర్యలను, విధానాలను చేపట్టిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశంసించాలి.

ఆంధ్రప్రదేశ్ లో భూముల సర్వే సెటిల్ మెంట్ 1906 లో బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో జరిగింది. పదేళ్ల తరువాత అంటే 1916 లో ఈ భూముల సర్వే రీ సెటిల్ మెంట్ జరిగింది. అప్పుడు బ్రిటిష్ పాలనాధికారులు రీసెటిల్ మెంట్ రిజిస్టర్ (ఆర్ ఎస్ ఆర్) పేరిట ఒక రిజిస్టర్ ను రూపొందించారు. దీనిని ఏ రిజిస్టర్ అని కూడా అంటారు. ఆంధ్ర ప్రాంత భూముల విషయంలో ఇదొక కీలకమైన డాక్యుమెంట్. ఈ డాక్యుమెంట్లో భూముల విస్తీర్ణం, దాని యజమానుల పేర్లు నమోదు చేయడం జరిగింది. యజమానుల పేర్లు కాలమ్ నం. 16 లో నమోదు చేయడం జరిగింది. కానీ దాదాపు 24 లక్షల ఎకరాల యాజమాన్యానికి సంబంధించి, కాలమ్ నం. 16 లో పేరుకు బదులు, పెన్నుతో చుక్కను పెట్టడం జరిగింది. చుక్కను ఇంగ్లీష్‌లో డాట్ అంటారు కాబట్టి ఈ భూములకు డాటెడ్ లాండ్స్ అన్న పేరు వచ్చింది. వీటినే తెలుగులో చుక్కల భూములు అన్నారు. ఈ చుక్కల భూమి ప్రభుత్తం కొందరికి అసైన్ చేసింది. మరి కొన్ని సంస్థలకు కేటాయించింది. కొన్ని ప్రభుత్వ విభాగాలకు కూడా ఇవ్వడం జరిగింది. దాదాపు ఏడెనిమిది లక్షల ఎకరాలను రైతులు లీజుకు తీసుకుని, వ్యవసాయం కూడా చేసుకుంటున్నారు. ఇప్పుడు తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెవెన్యూ శాఖ ఈ చుక్కల భూముల వివరాలన్నిటినీ ఎవరికీ రిజిస్టర్ చేయడానికి వీల్లేకుండా రూల్ నం.20లో భాగంగా రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపించింది. దీంతో ఈ భూముల కొనుగోలు, అమ్మకాలు చేయాలనుకునేవారు పలు ఇబ్బందుల పాలయ్యారు. ఇప్పటికే వేలాది మంది ఈ విషయంలో కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో 2014లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఒక కీలకమైన తీర్పును వెలువరించింది. ఈ తీర్పు మేరకు ఆర్ ఎస్ ఆర్ లో చుక్కలు ఉన్నంత మాత్రాన ఈ భూములన్నిటినీ ప్రభుత్వ భూములుగా భావించవద్దని, ప్రభుత్వం సదరు భూములు తమవేనని సాక్ష్యాధారాలతో ఋజువు చేసుకోవాలని న్యాయస్థానం చెప్పింది. అదే సమయంలో ఈ భూముల యాజమాన్యాన్ని నిర్ధారించేందుకు ఒక కమీషన్‌ను కూడా ఏర్పాటు చేయాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏడాది పాటు కసరత్తు చేసి ఈ భూముల రిజిస్ట్రేషన్ విషయంలో జూన్ 14, 2017లో ఆంధ్రప్రదేశ్ డాటెడ్ లాండ్ అప్డేషన్ అండ్ రిజిస్ట్రేషన్ యాక్ట్ పేరిట చట్టాన్ని కూడా ఆమోదించి, జులై 14, 2017 నుంచి అమలులోకి తీసుకువచ్చింది. దీని ప్రకారం పట్టాదారులుగా ఋజువు చేసుకున్న వారి పేరు పదహారో కాలమ్‌లో చుక్కలకు బదులుగా రాయాలి. అదే విధంగా అసైన్డ్ భూముల విషయంలో అసైన్ చేసిన వ్యక్తుల పేర్లను నమోదు చేయాలి.

తమ సాగులో ఉన్న భూముల తాలూకు పహానీలు, ఎన్ కంబ్రెన్స్ సర్టిఫికేట్, సేల్ డీడ్, 10 (1) వంటి పత్రాలను జోడించి, చట్టంలో పొందుపరచిన ఫారం 3లో సర్వే నంబర్ తదితర వివరాలతో సహా దరఖాస్తు చేసుకుంటే వారికి భూముల పట్టాలు ఇవ్వడం జరుగుతుంది. గత పదకొండేళ్లుగా వారు ఆ భూమిలో సాగు చేస్తున్నట్టుగా ఆధారాలు చూపవలసి ఉంటుంది. ఇదే విధంగా అసైన్డ్, ఏలినేటెడ్ భూముల విషయంలోనూ నిబందనలను రూపొందించడం జరిగింది. రాష్ట్రప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రైతులకు లాభం చేకూరుతుంది. చుక్కల భూముల సమస్యకు తగిన పరిష్కారం కూడా లభిస్తోంది. ఈ సమస్యపరిష్కారంలో అనేక విధి నిషేధాలను చంద్రబాబు నాయుడు ప్రభుత్వం రూపొందించింది. దీని వల్ల భూముల విషయంలో మోసాలకు తావుండదు. ఇరవై నాలుగు లక్షల ఎకరాల చుక్కల భూముల సమస్యకు తగిన పరిష్కారాన్ని అందించడం హర్షణీయం. ఈ చట్టంలో ఉన్న మరో నిబంధన ఏమిటంటే దరఖాస్తు చేసుకున్న ఆరు నెలల్లో అధికారులు ఈ భూముల విషయంలో నిర్ణయం తీసుకుని, దానిని అమలు చేయాల్సి ఉంటుంది. దీని వల్ల రెడ్ టేపిజం బారిన పడకుండా రైతులకు లబ్ది చేకూరుతుంది. ఉభయ గోదావరులు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, రాయలసీమ ప్రాంతాల్లోని లక్షలాది మంది చుక్కల భూముల రైతులకు దీని వలన మేలు జరుగుతుంది. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందించాలి.

చెరువు అభివృద్ధి పనుల్లో జాప్యం

ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకంతో చెరువుల పునరుద్ధరణ పనులను ప్రారంభించింది.

ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని చెరువులకు పునర్ వైభవం తీసుకురావడానికి ప్రభుత్వం రూ.కోట్లాది రూపాయలను మంజూరు చేసింది. సిద్దిపేట జిల్లాలోనే అన్ని చెరువుల కన్నా పెద్దదయిన పోతారెడ్డిపేట గ్రామంలోని పెద్ద చెరువును అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం 2015లో మిషన్ కాకతీయలో రూ. 3.79 కోట్ల నిధులు మంజూరు చేసినా పనులు నత్తనడకన సాగుతున్నాయి. కూడవెల్లి చిన్నవాగు నుంచి పోతారెడ్డిపేట పెద్దచెరువు వరకు కట్టు కాలువ నిర్మాణానికి సిద్దిపేట, మెదక్ జిల్లాల సరిహద్దు గ్రామాలైన పోతారెడ్డిపేట, కల్వకుంట గ్రామాల రైతుల నుంచి భూమి సేకరించారు. మెదక్ జిల్లాలోని కల్వకుంట గ్రామ రైతులకు పరిహారం చెల్లించగా సిద్దిపేట జిల్లాలోని పోతారెడ్డిపేట గ్రామంలో భూమి కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదు. ప్రభుత్వం నుంచి పరిహారం మంజూరైనా రైతులకు ఇవ్వడంలో రెవెన్యూ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. రైతులకు పరిహారం ఇవ్వక పోవడంతో ఆ భూముల్లో పనులు కొనసాగడం లేదు. పోతారెడ్డిపేట గ్రామ రైతులకు వెంటనే పరిహారానికి సంబంధించిన చెక్కులు ఇవ్వాలి. పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు చేసి పెద్దచెరువు నిండితే తొమ్మిది గ్రామాల రైతులకు లబ్ది చేకూరుతుంది. పనులు పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

–ప్రవీణ్‌కుమార్, దుబ్బాక

వేతనాలందక ఇబ్బందులు

మహబూబ్‌నగర్ జిల్లాలోని 26 మండలాల తహశీల్దారు కార్యాలయాల్లో పని చేసే కంప్యూటర్ ఆపరేటర్లకు 4 నెలలుగా, పార్ట్ టైం విధులు నిర్వర్తించిన ఆపరేటర్లకు 3 నెలలుగా వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. నెలసరి వేతనమే గాక శాసనసభ ఎన్నికల విధులు నిర్వర్తించిన 70 రోజులకు పారితోషికం సైతం ఇవ్వలేదు. అరకొర వేతనాలతో అల్లాడుతున్న వారికి సకాలంలో వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

శాసనసభ ఎన్నికల బడ్జెట్ దండిగా వచ్చినా నిధులు రాలేదంటూ విధులు నిర్వహించిన వారికి వేతనాలు ఇవ్వకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారు. ఓటరు జాబితా తయారీ, మార్పు లు, చేర్పులు, సవరణలు, తొలగింపునకు అందిన దరఖాస్తులను పరిష్కరించడం, సీవిజిల్ యాప్, బూత్‌లెవల్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం, పోస్టల్‌బ్యాలెట్, నామినేషన్ల స్వీకరణ, స్కానింగ్ చేయడం వంటి వాటితో పాటు వెబ్‌కాస్టింగ్‌కు సహాయ సహకారాలు అందించడంలో కంప్యూటర్ ఆపరేటర్లతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగిన నిరుద్యోగులు, కంప్యూటర్ ఆపరేటర్లు మొత్తం 200 మంది ఎన్నికలప్పుడు నిర్వర్తించారు. అధికారులు చర్యలు తీసుకుని నెలవారీ వేతనాలతో పాటు ఎన్నికల విధులకు వెంటనే పారితోషికం చెల్లించాలి.

–కృష్ణమూర్తి, మహబూబ్‌నగర్

చెడు కర్మల పాప ఫలితాన్ని తగ్గించలేము

చెడు పనుల వల్ల చెడు ఫలితాలు, మంచి పనుల వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. అయితే చెడ్డపనుల చెడ్డ ఫలితాలను మంచి పనుల మంచి ఫలితాలతో తగ్గించలేము. కాని మంచి పనులు చేయటం అలవాటయి, మనసు మారి ఇక ముందు, చెడ్డ పనులు చేయకుండా జాగ్రత్త పడతాము.

కథ: గుణవర్మ ఒక వ్యాపారి కొడుకు. అతడు చదువు అబ్బక, చెడు సహవాసాలు చేస్తూ, చెడ్డ పనులు చేస్తూ, తండ్రి ఎన్నిమార్లు దండించినా ఫలితం కనిపించలేదు. అప్పుడు కొడుకును నాయనా – నీవు చేస్తున్న ప్రతి చెడ్డ పనికి సూచనగా, తలుపునకు ఒక మేకు కొట్టమన్నాడు. కొన్నాళ్ళకు తలుపు మేకులతో నిండిపోయింది. అప్పుడు గుణవర్మకే ఆ తలుపును చూసి, తాను ఇన్ని తప్పు పనులు చేశానా అని ఆశ్చర్యం వేసింది. గుణవర్మ పశ్చాత్తాప పడి, తండ్రితో 'తాను చేసిన తప్పుల నుంచి తప్పించుకోవటం ఎలా అని అడిగాడు. నీవు మంచి పనులు చెయ్యి.ప్రతి ఒక్క మంచి పనికి నీవు కొట్టిన మేకుల్లో ఒక మేకును తీసెయ్యి అని తండ్రి చెప్పాడు. గుణవర్మ అలానే చేశాడు. కొన్ని రోజులకు మేకులన్నీ ఊడదీయబడ్డాయి. కాని తలుపు మాత్రం రంధ్రాలతో నిండిపోయి ఉన్నది. కనుక మంచి పనులు చేసినా, చెడ్డ పనుల ఫలితం మటుకు అలాగే ఉంటుంది.

సృష్టిలో అన్ని జీవరాసుల మనుగడ ముఖ్యమే

సృష్టిలో 84 లక్షల జీవరాసులలో ఏ జీవరాసి అంతరించినా, సృష్టిలోని సమతుల్యం దెబ్బతింటుంది. వాటి ప్రాముఖ్యం విశిద పరచటానికి, దేవతలు వివిధ జంతువులను తమ వాహనాలుగా ఎంచుకున్నారు.

దేవతలు: గణపతి – మూషికము , బ్రహ్మ, సరస్వతి – హంస , విష్ణువు, లక్ష్మి – గరుత్మంతుడు, లక్ష్మి– గుడ్లగూబ, శివుడు – నంది, పార్వతి – సింహం, పులి, కుమారస్వామి – నెమలి, హనుమంతుడు – ఒంటె.

అష్ట దిక్పాలకులు: ఇంద్రుడు – ఏనుగు , అగ్ని – మేక, యముడు – దున్నపోతు , నిర్‌రుతి – నరుడు, వరుణుడు – మొసలి, వాయువు – జింక, కుబేరుడు – గుఱ్ఱం , ఈశానుడు – ఎద్దు.

నవగ్రహములు: సూర్యుడు – ఏడు గుఱ్ఱాల రథం, చంద్రుడు – లేడి , కుజుడు – మేక , బుధుడు – సింహం , గురుడు – ఏనుగు, శక్రుడు – అశ్వం, శని – కాకి, రాహువు – పులి, కేతువు – సర్పం

కథ: ఒకసారి అడవిలో జంతువులన్నీ సమావేశమయి, మనుషులకు లేని శక్తులెన్నో తమకు ఉన్నాయని, కనుక మనుషులకంటే తామే గొప్ప అని తీర్మానించాయి. కాని ఆ విషయాన్ని మనిషితో ఒప్పించాలని, అడవిలో తపస్సు చేసుకుంటున్న ముని దగ్గరకు వెళ్ళి తమ తీర్మానం చెప్పి, ఇది సత్యమేగదా అని అడిగాయి. మనుషులు చేయలేనివి తాము చేయగల పనులు ఏకరువు పెట్టాయి. పక్షులు తాము గాలిలో ఎగరగలమని, చేపలు నీటిలో నివసించగలమని, కాకులు తాము ఐకమత్యంతో ఉంటామని, లేడి తాను వేగంగా పరుగెట్టగలనని, పులులు, సింహాలు మనిషి తమను ఎదుర్కొనలేక వంచనతో తమను బంధిస్తాడని, ఇలా తమ గొప్పలు ఏకరువు పెట్టాయి. ముని ఈ విధంగా ఉన్నదని, కాని కొంతమంది తన కున్న తెలివిని స్వార్థానికి వాడుకుంటున్నారని, వారు జంతువులకంటే హీనమని, ఎవరిలో మంచి గుణములు అనగా ఐకమత్యం, పరోపకారం, నిస్వార్థం, ఉంటే వారే గొప్ప అని, స్వార్థంతో జీవించే అందమైన శరీరం కంటే అంతరంగ శుద్ధితో పరోపకార బుద్ధితో ఆదర్శంగా ప్రవర్తించే జీవి, అంద విహీనమైనా గొప్ప దని బోధించాడు.

తన కోపమే తన శత్రువు, తన శాంతమె తనకు రక్ష

తన మాటే నెగ్గాలన్న అహంకారం, తన ఆశ నిరాశ అయినపుడు, వంచనకు గురయినపుడు కోపం వస్తుంది. కాని కొందరికి కోపం పుట్టుకతోనే వస్తుంది. మనం చూస్తుంటాము – కొంత మంది పిల్లలు తాము కోరినది ఇవ్వకపోతే కోపంతో తలను గోడకేసి కొట్టుకుంటుంటారు. అయితే కోపం ఎదుటివారికన్నా తనకే నష్టం కలిగిస్తుందని వాళ్ళకు బోధించాలి.

అగ్గిపుల్ల పొయ్యి వెలిగించి వంటచేయడానికి పనికి వస్తుంది. కొంప తగల పెట్టటానికి పనికి వస్తుంది. అలాగే కోపం కూడా విచక్షణతో వాడుకుంటే ఒక ఆయుధంగా పనికి వస్తుంది. కోపాన్ని ఒక సంకల్ప శక్తిగా మార్చుకొని, పోటీదారులను ఓడించటానికి ఉపయోగించవచ్చు. చిన్న పిల్లలను కోపంతో కేకలు వేసి, వారిని బుద్ధిగా చదువుకునేటట్లు చేయటం, చెడుదారుల నుంచి మళ్ళించటం మొదలగు మంచి పనులకు ఉపయోగించవచ్చు.

కోపం తరచుగా రావటం ఆరోగ్యానికి చేటు. కోపం వచ్చినపుడు రక్తప్రసరణ వేగం పెరిగి గుండె లయ తప్పుతుంది. ఒక్కొక్కసారి పక్షవాతం కూడా రావచ్చు. కోపం అజ్ఞానంతో మొదలయి, పశ్చాత్తాపంతో ముగుస్తుంది. శాంతమే తనకు రక్ష. న్యాయం కోసం, ధర్మం కోసం పోరాడటంలో తప్పు లేదు. కాని ప్రతి చిన్నదానికి కోపం తెచ్చుకోవటం సరికాదు. కోపిష్టులు తమ నైజాన్ని మార్చుకొని శాంత గుణం అలవరచుకోవాలి. నీటిమీద రాత వెంటనే చెరిగిపోయినట్టు, కొద్ది సేపట్లోనే, నష్టం జరగకముందే, కోపాన్ని తగ్గించుకోవాలి.

కథ: ఒక ఇంటామె, ముంగిసను తన ఇంట్లో పెంచుకుంది. అది కూడా ఆమె మాట వింటుండేది. ఒకరోజు ఇంట్లో ఉన్న పసిపాపకు ముంగిసను కాపలాగా ఉంచి ఇంటామె, నీళ్ళు తేవటానికి బయటకు వెళ్ళింది. తిరిగి వచ్చేటప్పటికి ఎదురుగా ముంగిస రక్తపు నోటితో కనిపించింది. ముంగిస తన పాపకు హాని చేసిందని తలిచి, కోపంతో ఆ నీటి బిందెను ముంగిసమీద పడవేసి, లోపలికి వెళ్ళి చూస్తే, పాము ఒకటి ముక్కలై పడి ఉంది. అప్పుడు ఆమెకు అర్థమయింది. ముంగిస పామును చంపి, పాపను రక్షించింది అని. వెంటనే బయటకు వచ్చి చూస్తే ముంగిస నీటిబిందె తాకిడికి చచ్చిపడి ఉంది. బిందె కూడా పాడయింది. ఆమె తాను కోపంతో చేసిన తొందరపాటు పనికి ఎంతో పశ్చాత్తాప పడ్డది. కాని ఏం లాభం, జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కనుక కోపము వలన తనకే నష్టం అని గుర్తుంచుకోవాలి.

– వ్యాకరణం వేణుధర శాస్త్రి

నియంతృత్వ ధోరణితో కలత చెందిన కాంగ్రెస్ నాయకులు

(నిన్నటి తరువాయి)

ఇంకొక వైపునుండి ప్రదేశ్ కాంగ్రెస్‌లో ఉన్న ఆంధ్ర పెత్తందారులు వారి తెలంగాణ తాబేదారులు, ప్రజాసమితిలో సంబంధం ఉన్నటువంటి, సంబంధం ఉన్నట్టు వారికి అనుమానంగా ఉన్నటువంటి తెలంగాణ కాంగ్రెస్ నాయకులను వేధించడం, అవమానించడం ప్రారంభించారు. శ్రీ యస్. వెంకట్రామరెడ్డిని ఆరు సంవత్సరాల కొరకు పార్టీ నుండి బహిష్కరించారు. సత్యాగ్రహంలో పాల్గొన్న నలుగురు శాసనసభ్యులకు సంజాయిషీ నోటీసులు ఇచ్చారు.

పార్టీలోని ఈ నియంతృత్వ ధోరణి, అరాచక పరిస్థితిని పలువురి ద్వారా విని కలత చెందిన శ్రీ కె. వెంకటరంగారెడ్డి, తెలంగాణవారు, రాష్ట్ర పునర్నిర్మాణ సమయంలో జరిగిన ఒప్పందం ప్రకారం వేరే ప్రదేశ్ కాంగ్రెస్ సంఘం కలిగి యుండాలని మే 10న ప్రకటించారు. రక్షణలు సమర్థవంతంగా అమలు జరిపేందుకు తాను అత్యంత శ్రద్ధతో ఎన్నో చర్యలు గైకొంటున్నట్టు, తమ ఇంటికి వచ్చి ముఖ్యమంత్రి వివరించినందున తొలుత శ్రీ వెంకటరంగారెడ్డి ప్రత్యేక తెలంగాణ వాదాన్ని బలపరుచలేదు. శ్రీ బ్రహ్మానందరెడ్డి మాటలు కేవలం కల్లబొల్లి కబుర్లేనని తర్వాత పరిణామాలు ధృవపరచడంతో ఉద్యమాన్ని బలపరుస్తూ ఉగాది నాడు శ్రీ కొండా వెంకటరంగారెడ్డి బహిరంగ ప్రకటన చేశారు. అలాంటి ప్రకటన వారి నుండి రాకుండా చూసేందుకు ఎందరి ద్వారానో ముఖ్యమంత్రి చాలా ప్రయత్నం చేసి విఫలులైరి. ఈ రచయిత, శ్రీ సంతపురి రఘువీరరావు ఉగాదికి ముందు రాత్రి అంతా, రంగారెడ్డిగారి నివాసంలో గడిపి ఆయన సూచనల మేర ప్రకటన రూపొందించడం జరిగింది.

తెలంగాణను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయడం అనివార్యమనీ, పరిస్థితి చాలాదూరం వెళ్ళినదని మాజీ మంత్రి శ్రీ కొండాలక్ష్మణ్ బాపూజీ, శ్రీ కె. రామ చంద్రారెడ్డి మరి పదిమంది శాసనసభ్యులు మే 14 వ తేదీన బహిరంగ ప్రకటన చేసారు. శ్రీ రామచంద్రారెడ్డి శాసనమండలిలో ఛీఫ్‌విప్ పదవికి కూడ రాజీనామా చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటు చేయాలని కోరుతూ, మే 15వ తేదీన నగరపాలక సంఘం తీర్మానం చేసింది. తెలంగాణ ప్రజలకు చేసిన అపచారాన్ని కప్పిపుచ్చుకొని అన్యాయాలను మరుగుపరిచేందుకు ప్రభుత్వం తన విధానాలను కొనసాగించడంతో ఇక నిర్లిప్తంగా ఉండటం లాభంలేదని శ్రీ చెన్నారెడ్డి, శ్రీ లక్ష్మణ్ మొదలైనవారు తెలంగాణ కాంగ్రెస్ పక్షాన మే మూడవ వారంలో జిల్లాలలో ఉధృతంగా పర్యటనలు చేశారు. జూన్ మొదటి తేదీన టి.పి.సి.సి ఏర్పాటు చేయాలని నిర్ణయం గైకొన్నారు.'సమైక్యతా సంఘం' అనే పేరుతో పాత కేడీలు, రౌడీలు, జైళ్ళ నుండి ప్రత్యేకంగా విడుదల చేసిన హంతకులతో పాలకులు రూపొందించిన ఒక ముఠా ఆధ్వర్యంలో మహబూబ్‌నగర్ జిల్లా నాగర్‌కర్నూల్ గ్రామంలో 1969 మే 25వ తేదీన, మంత్రి పదవి దొరుకుతుందని దురాశపడిన ఒక ప్రబుద్ధుడు ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించేందుకు ముఖ్యమంత్రి వెళ్ళారు.

ఆనాడు హైదరాబాదు దారిపొడవునా వందమైళ్ళ మేర (ఐదారువేల మంది విద్యార్థులు, యువకులు, ప్రజా సమితి సభ్యులను పోలీసులు ముందుగానే నిర్బంధించినా) అడుగడుగున నల్లజెండాల ప్రదర్శనను నిరోధించలేకపోయారు. దారి పొడవునా సాయుధ పోలీసులు కాపలా ఉన్నా, ముఖ్యమంత్రి కారుచుట్టూ తుపాకులు ఎక్కుపెట్టి వందల మంది పోలీసులు వెళ్ళినా నిరసన ప్రదర్శనలు ఆపడం కష్టమవడంతో వెర్రెక్కిన పోలీసులు ప్రజలపై అమానుషంగా కాల్పులు జరిపి ముగ్గురిని చంపారు. అనేకమందిని గాయపరిచారు. సభా నిర్వాహకులు చుట్టు ప్రక్క గ్రామాల నుండి కూలి చెల్లించి, రవాణా సౌకర్యం సమకూర్చి 'ప్రేక్షకులను' ఈ సభకు తీసుకురావలసి వచ్చింది. మొదట ప్రేక్షకులు దొరకవచ్చునో లేదో అనే అనుమానంతో నగరం నుండి కూడా కొన్ని లారీలలో గూండాలను తీసుకవెళ్ళారు.

ఈ సభలో తప్ప త్రాగినట్టు ముఖ్యమంత్రి చేసిన ప్రసంగం లేనిపోని ఉద్రేకాలను రెచ్చగొట్టింది. ఆయన సన్నిహితులే ఆ 'వాగుడుకు' ఆయనను అసహ్యించుకోక తప్పలేదు. ప్రత్యేక తెలంగాణా రాష్ట్రం కోరేవారందరూ 'రాబందు'లన్నది ఆయన ఉవాచ. ఎలాగైతేనేం చావు దప్పి కన్ను లొట్టపడి ఆయన మాత్రం నగరానికి చేరారు. సభలో నిరసన ప్రదర్శనలు జరిపినందుకు ఆ తర్వాత నాలుగైదు రోజుల వరకు అక్కడి ప్రజలపై ఆయన పోలీసు బలాలు పైశాచిక దాడులు నిరాఘాటంగా కొనసాగించాయి.

సమగ్రతను కోరుతూ నిర్వహించబడిన బహిరంగ కార్యక్రమాలలో ఇదే మొదటి, బహుశా చివరిది కూడా. అంతకుముందు మే 17నాడు పైన పేర్కొనిన గూండాల ఆధ్వర్యంలోనే నగరంలో ఒక ఊరేగింపు జరిగింది. 'నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలి', 'రాష్ట్రాన్ని విభజించకూడ'దని కోరుతూ జరిగిన ఈ ఊరేగింపులో బ్రహ్మంగారి భక్తులు కిరాయికి తెచ్చిన వారికి మొదట వాగ్దానం చేసినట్టు కిరాయి చెల్లించక పోవడం వల్ల, ఊరేగింపు నుండి వెళ్ళిపోగలమని బెదిరించడంతో ఊరేగింపు 'గుత్తే దార్లకు' నిర్వహించిన వారికి, సంఘర్షణలు జరిగి చివరకు పోలీసులు కూడా జోక్యం కలుగజేసుకోవలసి రావడంతో రహస్యం రచ్చకెక్కింది. తన వెనుక కూడా విద్యార్థులు ప్రజలు ఉన్నారని నిరూపించుకొనవలెనన్న తాపత్రయంతో, ఈ రెండే కాక ముఖ్యమంత్రి మరొక పొరపాటు చేశారు. అదే పరీక్షలు నిర్వహించవలెనని, విద్యాలయాలన్నీ నెలల తరబడి మూతబడి ఉన్నందున వాటిని తిరిగి ప్రారంభించాలని 'విద్యార్థులు' జరిపిన ఊరేగింపు కొందరు మున్సిపల్ కార్పొరేటర్లే కాక హోటల్ వర్కర్స్, రిక్షాల వారు ఈ ఊరేగింపులో విద్యార్థుల అవతారంలో పాల్గొన్నారు. **(సశేషం)**

– ఆదిరాజు వెంకటేశ్వర రావు

పదవులకే వన్నె తెచ్చిన ప్రజ్ఞాశాలి

బహుముఖ ప్రజ్ఞాశాలి, రాజకీయ దురంధరుడు, రాష్ట్ర ముఖ్యమంత్రిగా, మంత్రిగా, కేంద్రమంత్రిగా, మూడు రాష్ట్రాల గవర్నర్‌గా పనిచేసిన డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. హైదరాబాద్‌లో డాక్టర్‌గా జీవితాన్ని ప్రారంభించిన ఆయన రాజకీయంగా ప్రజల నాడిని కనుగొనడంలో కూడా దిట్ట. విద్యార్థి దశ నుంచే సామాజిక సేవపట్ల ఆసక్తి కలిగిన చెన్నారెడ్డి, వైద్య వృత్తిని కొనసాగిస్తూనే రాజకీయరంగంవైపు అడుగులు వేశారు. సుమారు నాలుగు దశాబ్దాల పాటు రాజకీయాల్లో అనేక పదవులను చేపట్టడమే కాక, చేపట్టిన పదవులకు వన్నెతెచ్చిన చెన్నారెడ్డి రాజకీయ జీవితం ఎత్తుపల్లాలతో కొనసాగింది. పదవులను చేపట్టడంలో ఏ విధమైన చతురత ప్రదర్శించేవారో పదవులను త్యజించడంలో కూడా ఆయనకు ఆయనే సాటి. స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ కష్టకాలంలో ఆమెకు అండగా నిలవడంలో ముందు వరుసలో ఉన్న నాయకుల్లో ఆయన ఒకరు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణారావు పనిచేసిన కాలంలోనూ, నీలం సంజీవరెడ్డి, భవనం వెంకట్రామ్ రెడ్డి వంటి ఉద్దండుల మంత్రివర్గాల్లో కూడా పనిచేసిన చెన్నారెడ్డి శాసనసభ్యుడుగా ఎన్నికై కేంద్రంలో ఇందిరాగాంధీ మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా పనిచేసిన ఘనత కూడా ఆయనకే దక్కింది. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి చేపట్టకుండా నేరుగా కేంద్ర మంత్రివర్గంలో కేబినెట్ మంత్రి పదవి పొందిన అతి కొద్దిమంది రాజకీయ నేతల్లో ఆయన ఒకరు. స్వరాష్ట్ర హక్కులను సాధించాలని తపనతో తెలంగాణ ప్రజా సమితి ద్వారా పోరాటం చేసి 13 పార్లమెంట్ స్థానాల్లో 10 పార్లమెంట్ స్థానాలు గెలిపించి అపర చాణక్యుడుగా పేరుపొందారు. జనాభా రీత్యా అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు, విస్తీర్ణంలో ఇంకో రాష్ట్రమైన రాజస్థాన్ గవర్నర్‌గా పనిచేసిన అపారమైన అనుభవశాలి. తను ఏ పదవిలో ఉన్నా తన కారులో ఒక మైనార్టీ, దళిత, బిసి మహిళతో కలిసి ప్రయాణించే అరుదైన రాజకీయ నాయకుడు చెన్నారెడ్డి.

పాలనతో ప్రత్యేకత

తన సుధీర్ఘ రాజకీయ జీవితంలో ఏ పదవి చేపట్టినా ఆ పదవిలో తన ప్రత్యేకతను తెలియచేసే విధంగా పాలన సాగేది. కేంద్ర ఉక్కు గనుల శాఖా మంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన 'విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు' ఉద్యమ నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాలకు మూడు ఉక్కు కర్మాగారాలను కేటాయించి ఆ ఉద్యమ ముగింపునకు కృషిచేసి అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ప్రశంసలు అందుకున్నారు.


డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలు

ఆయన కృషి ఫలితమే ఈనాటి విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు కాగా, కర్ణాటకలోని విజయ్ నగర్, తమిళనాడులోని సేలం ఉక్కు కర్మాగారాలు కూడా ఆయన హయాంలో ఏర్పాటైనవే. స్థానిక సంస్థల ఎన్నికల్లో 21 సంవత్సరాల ఓటుహక్కు నిబంధన నుంచి 18 సంవత్సరాలకు తగ్గించడం, ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు సర్పంచ్ పదవుల్లో రిజర్వేషన్లు కల్పించడం ఆయన హయాంలోనే జరిగాయి. 1980 సంవత్సరంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో బీసిలకు 10 సంవత్సరాలు రిజర్వేషన్ సౌకర్యం ఉండాలని ప్రతిపాదించి, తిరిగి 1990 సంవత్సరంలో తాను రెండోసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ రిజర్వేషన్లను కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవడం ఆయనకే చెల్లింది. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రిగా బూర్గుల రామకృష్ణా రావు కొనసాగుతూ 1952వ సంవత్సరంలో మహబూబ్‌నగర్‌లో శాసనసభకు పోటీచేస్తూ చెన్నారెడ్డిని పిలిపించి తనకు మద్దతుగా ప్రచారం చేయించుకున్న అరుదైన అవకాశం ఆయనకే దక్కింది. ఆ సమయంలో వికారాబాద్ నియోజకవర్గం నుంచి పోటీచేసి బూర్గుల రామకృష్ణారావు మంత్రివర్గంలో కేబినెట్ మంత్రిగా పనిచేశారు. శాసనసభలో అనేక కమిటీలకు నేతృత్వం వహించి రాష్ట్రాభివృద్ధికి ఆయన చేసిన సిఫార్సులు పాలకులు మెప్పుపొందే విధంగా ఉండేవి. ప్రస్తుతం శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి ఆయన చేసిన కృషి మరువలేనిది. పోచంపాడు ప్రాజెక్టు నిర్మిస్తే వేలాది ఎకరాలకు నీరందించవచ్చని ఆయన సేసిన సిఫార్సులకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ మెప్పు పొందారు. 1968వ సంవత్సరంలో చిన్న కారణంతో తన ఎన్నిక చెల్లదని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పుకు ఆరు సంవత్సరాలు రాజకీయాలకు దూరంగా ఉంటూ దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించేవారు. 1983వ సంవత్సరంలో అప్పటి రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ రాష్ట్ర పర్యటనలో భాగంగా నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు సమక్షంలో ప్రస్తుత రాష్ట్ర రాజకీయాల్లో చెన్నారెడ్డి లేకపోవడం నీకు కలిసి వచ్చిందంటూ చేసిన ఛలోక్తి అప్పటి సభలో ప్రత్యేకంగా నిలిచింది. 1988 సంవత్సరంలో రాజీవ్‌గాంధీ పిలుపు మేరకు తిరిగి కాంగ్రెస్‌పార్టీలో చేరిన చెన్నారెడ్డిని 1989 సంవత్సరం మే నెలలో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించారు. పదవి చేపట్టిన అతి తక్కువ సమయంలోనే తెలుగుదేశం పార్టీని ఓడించి తిరిగిఅధికారంలోకి తీసుకొచ్చిన ఘనత ఆయనకే తగ్గింది. దేశ రాజకీయాల్లో కష్టకాలంలో అండగా నిలబడిన అతి తక్కువ మంది రాజకీయ నాయకుల్లో చెన్నారెడ్డి ఒకరు. ఎమర్జెన్సీ అనంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీకి 175 స్థానాలు గెలిపిస్తానని ఇందిరాగాంధీకి మాటిచ్చి ఒక స్థానానికి అదనంగా 176 స్థానాలు గెలిపించిన ఘనత ఒకటైతే, ఆమె కుమారుడు, అప్పటి ప్రధానమంత్రి రాజీవ్‌గాం ధీకి 1989 సంవత్సరం ఎన్నికల్లో 180 స్థానాలు తెప్పిస్తామని చెప్పి 181 స్థానాలు గెలిపించిన రికార్డు కూడా చెన్నారెడ్డి సొంతం.

దేశంలో మూడు పెద్ద రాష్ట్రాలకు గవర్నర్‌గా పనిచేసే అరుదైన అవకాశం చెన్నారెడ్డికి దక్కింది. జనాభాలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌కు అప్పటి ప్రధానిమంత్రి ఇందిరాగాంధీ ఆయనను గవర్నరుగా నియమించారు. తన సొంత రాష్ట్రంలో రాజకీయంగా తనకు అనుకూలత రావాలంటే పరిపాలనాదక్షుడైన చెన్నారెడ్డిని గవర్నర్‌గా నియమించాలని, ఇందిరా గాంధీ తన సహచరుల దగ్గర వ్యాఖ్యానించేవారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని 52 జిల్లాలను ఒకసంవత్సర కాలంతో పర్యటించి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కన్నా ఎక్కువ జిల్లాలు పర్యటించిన నేతగా గుర్తింపు పొందారు. రాజస్తాన్ గవర్నర్‌గా పనిచేసే కాలంలో అప్పటి ముఖ్యమంత్రి షెకావత్ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఏమాత్రం సవరణలు లేని ఆర్డినెన్స్‌ను జారీచేస్తే ఆ ఆర్డినెన్స్‌కు సవరణలు చూపించి అమలుచేసే విధంగా కృషి చేశారు. అదేవిధంగా తమిళనాడు గవర్నర్‌గా పనిచేసి అక్కడ పాలనలో కూడా ఆయన ప్రత్యేకతలను చూపించారు. ప్రజాపాలనలో మంత్రిగా, ముఖ్యమంత్రిగా, కేంద్ర మంత్రిగా తన పాలనా అనుభవం చూపించిన చెన్నారెడ్డి రాజ్యాంగ బద్ధమైన గవర్నర్ పదవిలో కూడా తన ప్రత్యేకతను ప్రదర్శించారు. 1919వ సంవత్సరంలో జన్మించిన చెన్నారెడ్డికి ఈ సంవత్సరంతో 100 సంవత్సరాలు పూర్తవుతున్నాయి.



– మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ మంత్రివర్యులు.

విజయపథం

భారత నావికాదళంలో 'నావిక్' ఉద్యోగాలు

భారత సైన్యంలో భాగమైన నావికాదళం నావిక్ (జనరల్ డ్యూటీ) ఉద్యోగాలకు అర్హులైన భారత పౌరుల నుంచి అప్లికేషన్లు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఉద్యోగానికి అర్హత 12వ తరగతి పాసై ఉండాలి. ఏదైని రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థల గుర్తింపు పొందిన పాఠశాలలో ఉత్తీర్ణులై, 50 శాతం పైన మార్కులు సాధించిన వారు అర్హులు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక మినహాయింపు. అలాగే వయస్సు 18–22 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు వయస్సు పరిమితి ఉంది.

ఇండియన్ నావీ వెబ్‌సైట్ (www.joinindiancoastguard.gov.in)లో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకోవాలి. జనవరి 21వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయి. జనవరి 31 ఉద్యోగానికి అప్లయ్ చేసుకునేందుకు ఆఖరు తేదీ. మార్చి–ఏప్రిల్ నెలలో ఉద్యోగ పరీక్ష ఉంటుంది.



విద్య ఉపాధికి బాటలేస్తుందా..?

మెరుగైన జీవన ప్రమాణాల కోసం విద్యుకున్న ప్రాధాన్యం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. విద్యలేనివాడు వింత పశువు అని మన పూర్వీకులే తేల్చేశారు. కానీ అదే విద్య ఉపాధిని అందించలేకపోతే దాన్ని నమ్ముకొని వారసత్వ పరంగా సంక్రమించిన వృత్తిని పట్టించుకోని యువత రెంటికీ చెడ్డ రేవడిలా తయారవుతూ ఆత్మన్యూనతా భావానికి లోనవుతున్నారు. విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న యువతలో బహుముఖ సామర్థ్యాలుండటం లేదనేది ఓ వాదన. అదే సమయంలో కేవలం నిర్దిష్టమైన ఉద్యోగం కోసమే యువతను ప్రోత్సహించే విధంగా ఉండటం, శాస్త్రీయత లేకపోవటం దేశంలో నిరుద్యోగ సమస్యను అంతకంతకూ పెంచుతోంది. ఈ నేపథ్యంలో విద్యకు, ఉపాధికి నడుమ ఉన్న అనుబంధం చర్చనీయాంశంగా మారింది.



విద్యారంగంలో సాంకేతిక ప్రగతి, ఉపాధి కల్పన మధ్య ఉన్న సంబంధాన్ని తోసిపుచ్చలేం. అభివృద్ధి విధానాలన్నీ ఆర్థిక వ్యవస్థలో ఉపాధి కల్పన ప్రక్రియ నిరాటంకంగా కొనసాగేందుకు తోడ్పడేవిగా ఉండాల్సిన అవసరం చాలా ఉంది. అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలు ప్రాథమిక, మాధ్యమిక స్థాయిలో విద్యార్థిపై చేసే తలసరి వ్యయంతో పోల్చితే యూనివర్సిటీ, ఉన్నత విద్యా స్థాయిలో చేసే తలసరి వ్యయం ఎక్కువగా ఉంటుంది. వృద్ధి ప్రక్రియలో భాగంగా పాఠశాల విద్యకు ప్రపంచవ్యాప్తంగా ఏటేటా డిమాండ్ పెరుగుతోంది. వృద్ధి స్వభావం, ఉపాధి రూపకల్పన, ప్రత్యేక నైపుణ్యాలకు సంబంధించి శ్రామిక అవసరాలను నిర్ణయిస్తుంది. చలనాత్మక ఆర్థిక వ్యవస్థలో విద్య అందుబాటు పెరగటం, ప్రభుత్వ చొరవతో పరపతి, శ్రామిక మార్కెట్‌కు సంబంధించిన అసంపూర్ణతలను తగ్గించగలిగితే సమాజం అధిక ప్రయోజనం పొందేందుకు వీలు ఏర్పడుతుంది.

దీర్ఘకాల వృద్ధిని చూపాలి

ప్రభుత్వాలు విద్యపై చేసే వ్యయం సాంఘిక ప్రతిఫల రేటు, ప్రాథమిక, సెకండరీ విద్యా స్థాయి పెరుగుదల, అధిక ప్రతిఫలం, దీర్ఘకాల వృద్ధికి అనువైన వాతావరణం కల్పించటం తదితర అంశాల ఆధారంగా ఉండాలని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. కేవలం వనరుల పంపిణీ మాత్రమే 'విద్య' పరంగా లింగ సంబంధిత అసమానతలను తొలగించలేదని పలు అధ్యయనాలతో తేటతెల్లమైంది. పాఠశాల, ఉన్నత విద్యా వ్యవస్థలో వికేంద్రీకరణ, అధిక సరళత, పరీక్షల ప్రక్రియలో మార్పు, ఉపాధ్యాయులకు శిక్షణ వంటి సంస్కరణలు చేపట్టాలి. ఆయా సంస్కరణలు విజయవంతం కావాలంటే భారీస్థాయిలో ప్రభుత్వ వ్యయం అవసరం ఉంది. భారత ప్రభుత్వం పాఠశాల స్థాయిలో సంప్రదాయ విద్యకు తగిన మద్దతు అందిస్తోంది. కానీ, వృత్తి విద్యా శిక్షణ, నైపుణ్యాతాభివృద్ధిపై ప్రభుత్వ పెట్టుబడులు పెరిగినప్పుడే ఆర్థికాభివృద్ధి ప్రక్రియ వేగవంతమవుతుంది. ప్రభుత్వ విధానాలు ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో మహిళా భాగస్వామ్యాన్ని పెంచేవిగా ఉండాలి. మహిళలకు సంబంధించి విద్య, ఆరోగ్య ప్రమాణాలు, నైపుణ్యాల అభివృద్ధి పెంపుపై దృష్టి పెట్టాలి. ఆర్థిక వ్యవస్థలో సాంఘిక ఆర్థికాభివృద్ధికి విద్య, నాణ్యతలను ముఖ్య కారకాలుగా గుర్తించాలి.

విద్య–ఉపాధి

అనేక అనుభవపూర్వక ఆధారాల ప్రకారం విద్యా స్థాయి, శాశ్వత ఉపాధికి మధ్య సంబంధం జీవన ప్రమాణాల నాణ్యతపై ప్రభావం చూపుతుంది. విద్యా స్థాయిలో పెరుగుదల వల్ల మనదేశంలో శాశ్వత ఉపాధి పెరిగింది. ఫలితంగా పేదరికం స్థాయి తగ్గింది. ప్రాథమిక విద్యతో పోల్చితే ఉన్నత విద్య, ఉపాధి పెరుగుదల, పేదరికం తగ్గింపునకు ఎక్కువగా ఉపయోగపడుతోంది. విద్య, సాంకేతిక శిక్షణలను ఉపాధి పెంపునకు మూలస్తంభాలుగా చెప్పుకోవచ్చు. తక్కువ నైపుణ్యం, అల్ప ఉత్పాదకత, తక్కువ వేతన ఆర్థిక వ్యవస్థ తదితర లక్షణాల నుంచి ఆర్థిక వ్యవస్థ బయట పడాలంటే విద్యా స్థాయిని పెంచే లచర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. నైపుణ్యాల అభివృద్ధి, ఉపాధి నాణ్యతలను పెంపొందించడం, ఆర్థిక వ్యవస్థ ముందున్న సవాళ్లుగా నిపుణులు గుర్తించారు. భారత ఆర్థిక వ్యవస్థలో విద్య, శ్రామికుల నైపుణ్యం తక్కువగా ఉంది. కేవలం 5 శాతం గ్రామీణ మహిళలు, 13 శాతం గ్రామీణ పురుషులు మాత్రమే హయ్యర్ సెకండరీ, అంతకు మించిన విద్యను అభ్యసించారు. కాగా, పట్టణ శ్రామికుల్లో మహిళలకు సంబంధించి గ్రాడ్యుయేట్, ఆపై అభ్యసించిన వారి శాతం గణనీయంగా పెరిగినట్లు నేషనల్ శాంపుల్ సర్వే వెల్లడించింది.

నైపుణ్యాల అభివృద్ధి

పనిచేసే జనాభాలో నైపుణ్యాల అభివృద్ధిని పెంచేందుకు ప్రభుత్వం తక్షణ ప్రాధాన్యాంశంగా పెట్టుకుంది. భారతదేశంలో నైపుణ్యాభివృద్ధి ప్రక్రియ సమీక్ష ప్రకారం 2009–10లో 15 నుంచి 19 సంవత్సరాల వయోవర్గ శ్రామికశక్తిలో వృత్తి విద్యా శిక్షణ పొందిన వారు కేవలం 10 శాతం మాత్రమే. సేవారంగంలోని మొత్తం శ్రామికుల్లో 33 శాతానికి పైగా, తయారీ రంగంలో సుమారు 33 శాతం, వ్యవసాయ రంగంలో 27 శాతం శ్రామికులు మాత్రమే వృత్తి విద్యా శిక్షణ పొందారు. తయారీయేతర అనుబంధ రంగాల్లోని మొత్తం శ్రామికుల్లో 9 శాతం మంది మాత్రమే వృత్తి విద్యా శిక్షణ తీసుకున్నారు. అంటే నైపుణ్యాల మెరుగుదలకున్న ప్రాధాన్యం ఏ స్థాయిలో ఉందో అవగతమవుతోంది.

విద్యావంతులైన శ్రామికుల వేతనాలు

మన ఆర్థిక వ్యవస్థలో ముఖ్యంగా సంస్కరణల కాలంలో నైపుణ్యం గల శ్రామికశక్తి, నైపుణ్యత లేని శ్రామికశక్తి మధ్య వేతన వ్యత్యాసాలు బాగా పెరిగాయి. అనేక ఉపాధి విభాగాల్లో పురుషులతో పోల్చితే మహిళా శ్రామికుల వేతనాలు తక్కువ. తాత్కాలిక ఉపాధితో పోల్చితే శాశ్వత ఉపాధిలో విద్యావంతులైన శ్రామికుల వేతనాలకు సంబంధించిన లింగపరమైన అసమానతలను తగ్గిస్తుంది. నేషనల్ శాంపిల్ సర్వే అంచనాల ప్రకారం 2011–12లో శాశ్వత ఉపాధిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పురుషులు, మహిళల మధ్య వేతన వ్యత్యాసం విద్యాస్థాయి పెరిగే కొద్దీ తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో శాశ్వత ఉపాధిలో విద్యను అభ్యసించని మహిళ వేతనం, పురుషుడి వేతనంలో 53 శాతం కాగా, గ్రాడ్యుయేట్ మహిళ వేతనం గ్రామీణ ప్రాంతాల్లో అదే విద్యను అభ్యసించిన పురుషుడి వేతనంలో 70శాతంగా ఉంది. కానీ, పట్టణ ప్రాంతాల్లో మాత్రం పురుషులు, మహిళల మధ్య వేతన వ్యత్యాసం తక్కువగా కనిపిస్తోంది. నిరక్షరాస్యులైన మహిళ వేతనం, పురుషుడి వేతనంలో 62 శాతం కాగా, సెకండరీ విద్యను అభ్యసించిన మహిళ వేతనం పురుషుడి వేతనంలో 86 శాతంగా, గ్రాడ్యుయేట్ మహిళ వేతనం పురుషుడి వేతనంలో 76 శాతంగా నమోదైంది. అందువల్ల విద్యావిదానంలో నైపుణ్యాల పెంపుపై ఎక్కువ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

– బర్ల శ్రీనివాస్

పదోతరగతి విద్యార్థుల కోసం..

సీసీఈ మెథడ్‌ను అనుసరించి సబ్జెక్ట్ టీచర్‌చే తయారుచేసిన అంచనా ప్రశ్నావళిని అందిస్తున్నాం. 'ప్రసరణ-పదార్థ రవాణా వ్యవస్థ' అనే అంశం నుంచి ప్రశ్నలు..

ఒక్క మార్కు ప్రశ్నలు

1. 140/100 దేనిని తెలియజేస్తుంది? వివరించండి?
2. 'ఎడిమా' ఎవరిలో ఎక్కువగా కనిపిస్తుంది.
3. గుండెకు రక్షణ కల్పించే నిర్మాణం ఏమిటి?
4. సంవృత రక్తప్రసరణ వ్యవస్థ అనగానేమి?
5. ఏ రక్తనాళాలలో కవాటాలు ఉంటాయి? కవాటాల ఉపయోగం ఏమిటి?
6. మొక్కలలో పోషక కణజాలం పని ఏమిటి?

రెండు మార్కుల ప్రశ్నలు

1. భాష్పోత్సేకం అంటే ఏమిటి? వర్షపాతానికి, భాష్పోత్సేకానికి గల సంబంధం ఏమిటి?
2. సిస్టోల్, డయాస్టోల్ మధ్యగల బేధాలు వ్రాయండి?
3. హృదయ స్పందనకు, నాడీ స్పందనకు గల సంబంధం ఏమిటి?
4. క్రింది పట్టికను పరిశీలించి సమాధానాలు వ్రాయండి

కవాటాలు	స్థానం	రక్తప్రసరణ
అగ్రత్రయ	కుడి కర్ణికా జఠరికా విభాజక రంధ్రం	రక్తన్ని కుడికర్ణిక నుంచి కుడి జఠరికకు అనుమతిస్తుంది
అగ్రద్వయ	ఎడమ కర్ణికా జఠరిక రంధ్రం	రక్తాన్నిఎడమ కర్ణిక నుంచి ఎడమ జఠరికకు అనుమతిస్తుంది

1. కుడికర్ణికా జఠరిక రంధ్రం మధ్యగల కవాటం ఏమిటి?
2. అగ్రద్వయ కవాటానికి మరొక పేరేమిటి?
5. కార్డియాలజిస్ట్‌ని కలిసే అవకాశం దొరికినపుడు హృదయం సక్రమ పనితీరు కొరకై ఎటువంటి ప్రశ్నలు అడుగుతారు?
6. రక్త కేశనాళికలు అనగానేమి? వాటి విధులు తెలపండి?

నాలుగు మార్కుల ప్రశ్నలు

1. హృదయ స్పందన అంటే ఏమిటి? హార్థిక వలయంలోని దశలను వివరించండి?
2. రక్త పీడనం అంటే ఏమిటి? డాక్టర్లు ఎప్పుడు రక్తపీడనాన్ని నియమిత ప్రదేశంలోనే ఎందుకు కొలుస్తారు? అధిక పీడనా లక్షణాలు, నివారణ చర్యలు తెల్పండి?
3. వేరుపీడనం అంటే ఏమిటి? అది మొక్కకు ఎలా ఉపయోగపడుతుంది.
4. రక్త స్కందనం అంటే ఏమిటి? మానవునిలో రక్తస్కందన ప్రక్రియను వివరించండి?

ఆబ్జెక్టివ్ ప్రశ్నలు

1. రక్తపీడనాన్ని కొలిటే పరికరం ఏమిటి.................................
2. అతి పెద్ద ధమని ....
3. జన్యులోపం వల్ల రక్తం గడ్డకట్టకపోవడాన్ని .... అందురు
4. గుండెకు అంటి పెట్టుకున్న రక్తనాళాలని ఏమందురు...................
5. ఆమ్లజనిరహిత రక్తాన్ని ఊపిరితిత్తులకు సరఫరా చేయునది ....

ఆబ్జెక్టివ్ ప్రశ్నల సమాధానాలు

(1) స్ఫిగ్మో మానోమీటర్, (2) బృహధమని, (3) హీమోఫిలియా, (4) కరోనరి రక్తనాళాలు, (5) పుపుసధమని



– సుధాకర్
ఆవంత్స వెంకట
జీవశాస్త్ర ఉపాధ్యాయులు

ప్రాథమిక విద్య- కొన్ని సూచనలు

(నిన్నటి తరువాయి)

ప్రస్తుతం దేశంలోని మాధ్యమిక పాఠశాల విద్యా విధానం భవిష్యత్ సవాళ్లను దీటుగా ఎదుర్కొనేందుకు అవసరమైన విజ్ఞానంతో పాటు మానసిక సామర్థ్యాన్ని విద్యార్థులకు అందించలేకపోతోంది. తాజాగా ఏఎస్ఈఆర్ నిర్వహించిన చర్చా వేదికలో మెరుగైన సెకండరీ విద్యను అందించాలంటే ఏంచేయాలనే దానిపై విద్యావేత్తలు ప్రధానంగా మూడు అంశాలు ప్రస్తావించారు. వాటిలో 1. అకడమిక్ సామర్థ్యాలు 2. ఒకేషనల్ స్కిల్స్ 3. లైఫ్ స్కిల్స్ ఉన్నాయి.

అకడెమిక్ స్కిల్స్: వీటి లోపం హైస్కూల్ విద్యా వ్యవస్థ పనితీరు, ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోంది. ప్రాథమిక పాఠశాల స్థాయిలో బలహీనమైన అకడెమిక్ పునాది వల్ల సెకండరీ స్కూల్ పాఠ్యప్రణాళికలను అందుకోవడంలో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. దీంతో హైస్కూల్ విద్య విద్యార్థులకు భారంగా మారుతోంది. ఈ విషయం ఏఎస్ఈఆర్ నిర్వహించిన పరిశోధనలో వెలుగు చూసింది.

ఒకేషనల్ స్కిల్స్: హైస్కూల్ స్థాయి విద్యార్థుల్లో హోమ్ ఎకనామిక్స్, ఆటోరిపేర్, ఎలక్ట్రీషియన్, బేసిక్ కంప్యూటర్స్ తదితర ఒకేషనల్ స్కిల్స్‌ను పెంపొందించాలి. ప్రస్తుతం ఒకేషనల్ విద్య ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా అమలవుతోంది. దేశంలో హైస్కూల్ తర్వాతే ఒకేషనల్ విద్య అందుబాటులో ఉంది. దీన్ని హైస్కూల్లోనే ప్రవేశపెట్టాల్సిన అవసరముందని నిపుణుల సూచన.

లైఫ్ స్కిల్స్: విద్యార్థుల్లో స్వీయ నైపుణ్యాలు, శక్తి సామర్థ్యాలపై అవగాహన కల్పించడం, ఇంటర్ పర్సనల్ స్కిల్స్ పెంపొందించడం, నాయకత్వ లక్షణాలు అలవరచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బాలికల్లో వీటి అవసరం మరింత అధికంగా కనిపిస్తోంది.

ప్రత్యేక శిక్షణ అవసరం

విద్యార్థుల్లో ప్రాజెక్ట్ వర్క్ ప్రాధాన్యాన్ని పెంచాల్సిన అవసరముంది. ప్రస్తుతం కొందరు టీచర్లకు ప్రాజెక్టు వర్క్, మూల్యాంకన పద్ధతులపై అవగాహన ఉండటం లేదు. దీంతో బోధన మూస ధోరణిలోనే కొనసాగుతోంది. టీచర్లకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యా ప్రమాణాలను మెరుగుపరుచవచ్చు. గతంతో పోల్చితే ప్రస్తుత సిలబస్ విద్యార్థి కేంద్రీకృతంగానే ఉంది. ముఖ్యంగా 6, 7 తరగతుల సిలబస్ విద్యార్థి నేర్చుకోగలిగే స్థాయిలోనే ఉంది. దీంతో మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. విద్యకు సంబంధించి తల్లిదండ్రుల సహకారం అత్యంత కీలకం. తల్లిదండ్రులు రోజూ ఒక గంటపాటు పిల్లలను తమ వద్ద కూర్చోబెట్టి చదివించాలి. ఆ సమయంలో వారేం చదువుతున్నారు, రాస్తున్నారో చూస్తుండాలి. ఇలాచేస్తే పిల్లల్లో క్రమశిక్షణ అలవడుతుంది. ఈ ప్రయత్నాలకు తోడు రాజకీయ వ్యవస్థ సహకారం లభిస్తే ప్రభుత్వ స్కూల్ విద్యా వ్యవస్థ తప్పక బలోపేతమవుతుంది. సర్పంచ్, వార్డు మెంబర్లు వారి పరిధిలో తమ వద్దకు వచ్చే తల్లిదండ్రుల పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారు. ప్రభుత్వ స్కూల్లో చదవనట్లయితే ఎందుకు చదవట్లేదు. విద్యకు సంబంధించిన సమస్యలు ఏమైనా



ఉన్నాయా వంటి విషయాలను తెలుసుకునే ప్రయత్నం చేయాలి. ఈ విధమైన సమిష్టి కృషిని పెంపొందించడం ద్వారా మెరుగైన విద్యా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవచ్చు.

ప్రాథమికంగా పునాది పడాలి

హైస్కూల్ విద్య ఫలితాలపై ప్రాథమిక పాఠశాల ప్రభావం అధికంగా ఉంటుండటంతో ఎలిమెంటరీ విద్యపై ఎక్కువ దృష్టిపెట్టాలి. హైస్కూల్‌కు వచ్చేసరికి నిర్దిష్ట సమయంలో సిలబస్‌ను పూర్తిచేయాలనే ప్రక్రియలో ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ పెట్టడం ఉపాధ్యాయులకు కష్టతరంగా మారుతోంది. తరగతిలో కొంతమంది వేగంగా నేర్చుకుంటారు, మరికొంతమంది సమయం తీసుకుంటారు. ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసే క్రమంలో ఉపాధ్యాయులు కొంత ఒత్తిడికి గురయ్యే అవకాశముంది. అయినప్పటికీ ఉపాధ్యాయులు వెనుకబడుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రయత్నిస్తున్నారు. విద్యార్థులను ప్రాజెక్టు వర్క్‌లో మరింత భాగస్వామ్యులను చేయగలిగితే వచ్చే విద్యా సంవత్సరంలో మంచి ఫలితాలు రాబట్టుకునే వీలు కలుగుతుంది.

పిల్లలకు ఇష్టంగా

పిల్లలు స్కూలుతో పాటు టీచర్లను ఇష్టపడినప్పుడే విద్యాభ్యాసం చక్కగా సాగుతుందని బోధనా శాస్త్రం చాటుతోంది. ప్రారంభంలో ఇష్టంగా బడికెళ్లిన విద్యార్థి ఆ తర్వాత వెళ్లనంటూ మారాం చేస్తుంటే, టీచర్ లేదా స్కూల్ వాతావరణంపై పిల్లాడిలో వ్యతిరేక భావన ఏర్పడిందని గుర్తించాలి. కాబట్టి ఉపాధ్యాయులు బోధన కంటే ముందు పిల్లలను ఆకట్టుకోవడంపై దృష్టిపెట్టాలి. దీనికోసం టీచర్లకు ప్రత్యేక శిక్షణ అవసరమని బోధనా నిపుణులు బావిస్తున్నారు. దీంతోపాటు ఎలిమెంటరీ, సెకండరీ స్థాయిల్లో పిల్లలపై అధిక ఒత్తిడి మంచిది కాదు. ఇది వారిలోని సహజత్వాన్ని హరిస్తుంది. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలు అన్ని సబ్జెక్టుల్లోనూ ఒకే స్థాయిలో ప్రతిభ చూపించాలని ఆశిస్తుంటారు. ఇది కూడా సరైన విధానం కాదు. కొంతమంది గణితం ఇష్టంగా నేర్చుకుంటారు. కొందరు సోషల్ ను ఆసక్తిగా చదువుతారు. పిల్లల్లో ఆయా సహజ ఆసక్తులను గమనించి వారిని ఆ దిశగా ప్రోత్సహించాలి. ఈ విధమైన స్వేచ్ఛాయుత విద్యా విధానాన్ని అనుసరిస్తే విద్యా వైవిధ్యం సాకారమై దేశ ప్రగతికి దోహదపడుతుందనటంలో అతిశయోక్తి లేదు.

నర్సింగ్
పోటీ పరీక్షల కోసం

రక్తపీడనం గురించి పూర్తిగా..

రక్తపీడనం లేదా రక్తపోటు (blood presure) అనేది రోగం కాదు. రోగ లక్షణం కాదు. ఒక వ్యక్తి ఆరోగ్య పరిస్థితిని తెలియజేయడానికి వైద్యులు నాలుగు కీలకమైన గుర్తులు (vital signs) వాడతారు. అవి: (1) శరీర ఉష్ణోగ్రత (Body Temperature), (2) హృదయ స్పందన (Heart rate), (3) ఊపిరి (Respiration), (4) రక్తపోటు లేదా రక్తపీడనం (Blood Presure). ఈ నాలుగు కీలక గుర్తులు లేకపోతే మనిషి మరణించినట్లే.

రక్త పీడనం నిర్వచనం

మనిషి గుండె పనిచెయ్యాలి. కానీ ప్రయాసపడుతూ పనిచెయ్యకూడదు. రక్తపీడనం గుండె ఎంత కష్టపడి పనిచేస్తున్నదో సూచిస్తుంది. రక్తనాళాల్లో ప్రవహిస్తున్న రక్తం అలల మాదిరి ప్రవహిస్తుంది. ఇలా ప్రవహిస్తున్న రక్తం రక్తనాళాల గోడల మీద ఒత్తిడి (presure) పెడుతుంది. ఈ ఒత్తిడి గుండెకి దగ్గరగా ఉన్న రక్తనాళాల్లో ఎక్కువగా, దూరం వెళ్తున్న కొద్దీ క్రమేపీ తగ్గి, కేశనాళికలు (capillaries) దగ్గర నెమ్మదిగా ప్రవహించి, ఆఖరున సిరలలో (veins) ప్రవహించి నీరసించి, నెమ్మదిగా కండరాల సహాయంతో మరలా గుండెకు చేరుకుంటుంది.

వైద్యులు రక్తపీడనం (Blood Presure) అన్నప్పుడు ధమనులలో (Arteries) ఉన్న పీడనం మాత్రమే పరిగణిస్తారు.

శరీరం అంతా ఈ పీడనం ఒకేలా ఉండదు. కనుక సాధారణంగా Fore arm దగ్గర రక్తపీడనం కొలుస్తారు.

సాధారణంగా ఆరోగ్యకరమైన వ్యక్తి రక్తపీడనం 120/80 mmhg. ఈ విలువలు (values) 130/85 దాటితే ఆ వ్యక్తి అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లుగా నిర్ణయిస్తారు. సాధారణంగా ఈ విలువలు (values) రెండు మూడు సార్లు తీసి, values ఎక్కువగా ఉంటేనే రక్తపుపోటు ఎక్కువయింది అని నిర్ణయిస్తారు.

కారణాలు

ఎవరికైనా రక్తపుపోటు ఎందుకు పెరుగుతుంది..? అన్న ప్రశ్నకి సమాధానం చెప్పడం కష్టం. (family history) పూర్వీకుల నుంచి సంక్రమణ అనేది ఒక ముఖ్య కారణంగా చెప్పుకోవచ్చు. ధూమపానం, మానసిక ఒత్తిడి పెరగడం, ఆహారంలో కొవ్వు ఉత్పత్తులు అధికం, వయస్సు (age), లింగం (gender) – కొద్దో గొప్పో దోహదం చేస్తాయి.

కుటుంబ నేపథ్యం: తల్లిదండ్రుల నుంచి పిల్లలకి సంక్రమించే వ్యాధులలో ఈ అధిక రక్తపీడనం అనేది ముందు జాబితాలో ఉంటుంది.

ఆల్కహాల్: ఆల్కహాల్ అధిక మొతాదులో తీసుకోవడం కూడా కారణం కావచ్చు.

వయస్సు: వయస్సు పెరిగే కొద్దీ ఈ అధిక రక్తపీడనం సమస్య పెరుగుతూ ఉంటుంది.

ఊబకాయం: అధిక బరువు కూడా దీనికి దోహదం చేస్తుంది.

అధిక రక్తపీడనం ముఖ్యంగా రెండు రకాలుగా ఉంటుంది. అవి (1) ప్రైమరీ హైపర్‌టెన్షన్, (2) సెకండరీ హైపర్‌టెన్షన్.

ప్రైమరీ హైపర్‌టెన్షన్: అంతర్జనిత కారణాలు అనగా, తల్లిదండ్రుల నుంచి సంక్రమణ, వయస్సు పెరుగుదల లాంటి కారణాల వలన వచ్చే అధిక రక్తపీడనాన్ని ప్రైమరీ హైపర్‌టెన్షన్ అని పిలుస్తారు.

సెకండరీ హైపర్‌టెన్షన్: ఇతర కారణాలు లేదా వ్యాధుల వలన వచ్చే అధిక రక్తపీడనాన్ని సెకండరీ హైపర్‌టెన్షన్‌గా పరిగణిస్తారు.


రక్తపీడనం కొలిచే విధానం

శరీరంలో ప్రసరించే రక్తం, రక్తనాళాలపై కలిగించే ఒత్తిడిని రక్తపీడనం అంటారు. ఈ రక్తపీడనాన్ని 'స్ఫిగ్మో మానోమీటర్' అనే పరికరం ద్వారా కొలుస్తారు. ఈ రక్తపీడనం కొలిచే ముందు రోగికి విశ్రాంతి ఇవ్వాలి.

లక్షణాలు

అధిక రక్తపీడనం సాధారణంగా ఎటువంటి గుర్తులు (signs) చూపించదు. కానీ ఈ రక్తపీడనం 180/110mmhg దాటితే ఈ క్రింది లక్షణాలు కనిపిస్తాయి.

1. తలనొప్పి, 2. వికారం, 3. అతి నిద్ర, 4. ముక్కు నుంచి రక్తం కారణం, 5. క్రమ రహిత హృదయ స్పందన, 6. ఊపిరి కష్టంగా ఉండటం.



రక్తపీడనం రోగి సేవలో నర్సుల పాత్ర

సమయానికి వైద్యుల సూచన మేరకు మందు ఇవ్వాలి. మందులు ఇచ్చే ముందు రక్తపీడనాన్ని సరిగ్గా కొలవాలి. మందులు ఇచ్చిన తరువాత కూడా రోగిని పరీక్షించాలి. సాధారణంగా వైద్యులు ఈ క్రింది మందులను సూచిస్తారు.

(1) Angiotension – Converting enzyme (ACE) Inhibitors (2) Calcium Channel Blockers (3) Thiazide diuretics (4) Beta blockers

మందులు రోగికి ఇచ్చే ముందు ఈ కింది సూచనలను పరిగణనలోకి తీసుకోవాలి.

ACE Inhibitors

(Eg: Benazepril captopril, Enalapril)

ఈ మందులు ఇచ్చిన తరువాత వ్యక్తిని ఈ క్రింది లక్షణాల కొరకు పరీక్షించాలి. రోగికి ఆరోగ్య విద్యను ఇవ్వాలి. ఈ మందుల వలన కలిగే చెడు ప్రభావాలు..

(1) మైకం, (2) అలసట, (3) తలనొప్పి, (4) పొడిదగ్గు. ఒకవేళ ఈ దుష్ప్రభావాలు ఎక్కువగా ఉన్నట్లయితే వైద్యులకు చెప్పాలి.

Calcium channel blockers

ఈ కాల్షియం చానల్ బ్లాకర్స్ రక్త ధమనుల (Arteries) గోడల మీద పని చేసి, ధమనుల కండరాలను relax చేస్తాయి. ఇలా relax చెయ్యడం వలన అధిక రక్తపోటు తగ్గుతుంది. ఈ కాల్షియం చానల్ బ్లాకర్స్ గుండె, కాలేయ సంబంధ వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇవ్వకూడదు. ఈ రకం మందుల వలన కలిగే దుష్ప్రభావాలు:

flushed face, headache: తలనొప్పి, swollen ankles : కాళ్ళ నొప్పులు, dizzinus: మైకము, Tired ness: అలసట, Skin rashes: చర్మ దద్దుర్లు,

Eg: Diltazem, Cardizem SR, Nixedipine etc...

Thiazide Diuretics

థైయాజైడ్ డయూరిటిక్స్ శరీరంలో ఉన్న అధిక నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఫలితంగా అధిక రక్తపీడనం తగ్గుతుంది. గర్భిణీ స్త్రీలకు ఈ రకం మందులు ఇవ్వకూడదు. ఈ మందులు వాడటం వలన శరీరంలో ఉన్న పొటాషియం విలువలు తగ్గుతాయి. దీని వలన గుండె, కిడ్నీల పనితీరుపై ప్రభావితం అవుతుంది.

Eg: chlorothiazide, Metolazone, indapamide

Beta blockers

ఈ బీటా బ్లాకర్స్ వర్గానికి చెందిన మందులు అధిక రక్తపీడనానికి ఆఖరి ప్రత్యామ్నాయంగా వాడుతారు. అనగా ఇతర రకాల మందులు పనిచేయలేనప్పుడు ఇవి సూచిస్తారు.

Eg: Acebutolol, propranolol, Navolol Etc...

ఈ రకం మందులు వాడటం వలన కలిగే దుష్ప్రభావాలు: Tiredness: అలసట, Cold hands & feet: కాళ్లు, చేతులు చల్లగా అవ్వడం, slow heart beat: హృదయ స్పందన నెమ్మదిగా అవ్వడం, diarrhoea & Nauva: విరోచనాలు, వికారం, sleep disturbances: నిద్ర భంగం, highdreams: చెడు కలలు, Inpotence: వంధ్యత్వం

అధిక రక్తపీడనం వల్ల కలిగే నష్టాలు

kidney disease

Tiredness: అలసట, swollen ankles or feet: కాళ్లు చేతులు ఉబ్బటం, shortness of breath: ఊపిరి కష్టంగా ఉండటం, Blood or protien in urine: మూత్రంలో ప్రోటీన్, రక్తం, increase urination during night time: రాత్రులు అతిగా మూత్రానికి పోవడం, itchy skin: శరీరంపై దద్దుర్లు

Cardio varcular diseases

stroke – స్ట్రోక్, heart attack – గుండె ఆగిపోవటం, blood clot – రక్తం గడ్డకట్టడం.

రోగికి ఇవ్వాల్సిన ఆరోగ్య విద్య

- రోగికి మందుల వాడకం గురించి, వాటి దుష్ప్రభావాల గురించి వివరించాలి.
- ఆహారంలో సోడియం (ఉప్పు) వాడకాన్ని తగ్గించమని వివరించాలి.
- (Excercises) శరీర వ్యాయామాన్ని క్రమం తప్పకుండా చెయ్యమని చెప్పాలి.
- ఆహార విషయంలో జాగ్రత్తలు తీసుకోమని సూచించాలి.
- క్రమం తప్పకుండా వైద్యుల వద్దకు వెళ్ళి సూచనలు తీసుకోమని చెప్పాలి.



– ఎంఎస్. జ్యోతి శివకుమార్
నర్స్ ఎడ్యుకేటర్, ప్రతిమా హాస్పిటల్స్, హైదరాబాద్

ట్రెండ్

ఫ్యాషనబుల్ ఫ్యాబ్రిక్ జ్యూయెలరీ



బంగారం వెండి. ప్లాటినం ఇంకా? మనకు తెలిసింది ఇంతే. కానీ ఫ్యాబ్రిక్‌తో కూడా ఆభరణాలు తయారు చేయొచ్చంటున్నారు ఆధునిక ఫ్యాషన్ డిజైనర్లు. బట్టతో జ్యూయెలరీ ఏంటి అనుకుంటు న్నారు కదూ! అదే మరి క్రియేటివిటీ అంటే. ఇప్పుడు ఫ్యాబ్రిక్ జ్యూయెలరీ న్యూ ట్రెండ్.

ఫ్యాషనబుల్‌గా తయారవ్వాలన్న ఆకాంక్ష అందరి లోనూ పెరుగుతోంది. అందుకే మార్కెట్లో రోజుకో కొత్త ట్రెండ్ పుట్టుకొస్తోంది. పడతులకు రోజుకో కొత్త లుక్ తీసుకొస్తోంది. ప్రస్తుతం ఆ బాధ్యత తనదంటోంది ఫ్యాబ్రిక్ జ్యూయెలరీ. ఆభరణాలను దేనితో తయారు చేస్తారు? బంగారం, వెండి, ప్లాటినం, డైమండ్స్ ట్రెండీగా కనబడటానికి, రిచ్ లుక్ ఇవ్వడానికి ఇవేమీ అవసరం లేదని నిరూపించడానికి వచ్చిందే ఫ్యాబ్రిక్ జ్యూయెలరీ. రకరకాల మెటీరియల్స్‌తో... కళ్లు చెదరగొట్టే రంగుల్లో ఉండే ఈ ఆభరణాలని చూడటానికి రెండు కళ్లూ చాలవు.



కాసుల జాకెట్టు







బ్లౌజ్‌లని రోజు కోరకంగా రకరాకాల నగల డిజైన్లతో అలంకరించడం ట్రెండ్ అయిపోయింది. అందులే భాగంగా కుట్టెస్తున్నదే కాసుల జాకెట్టు. అచ్చం మెడలో కాసుల పేరు వేసుకున్నట్లే జాకెట్టు చేతులకీ, మెడకీ కూడా కాసుల్ని కుట్టేస్తు ధగధగలాడిస్తున్నారు. ముఖ్యంగా పట్టు చీరలపైకి వేసుకునే బ్లౌజ్ డిజైన్లు మరింత ఘనంగా కనింపించేందుకు జర్దోజి, కుందన్ల ఎంబ్రాయిడరీకి తోడుగా గోల్డ్ ప్లేటెడ్ లేదా వన్ గ్రామ్ బంగారంతో తయారు చేసిన కాసుల్ని జోడించి మరి డిజైన్ చేస్తున్న రవిక సొబగు అందిరింది కదూ.



గ్రాండ్ లెహంగా..





లంగావోణీ నేటితో రద్దైపోని... సింగారాన్నీ చీరతో సిద్ధంకానీ.. అని ఓ సినీ కవి అన్నారూ కానీ నేటి తరం యువతకూ అదే కొత్త ఫ్యాషన్ అయిపోయింది. మార్కెట్లోకి కొత్త కొత్త మోడల్ డ్రెస్సులు వస్తున్నా లంగావోణీలకు మాత్రం క్రేజ్ తగ్గడంలేదు.. పదహారణాల తెలుగుతనం లంగావోణీలోనే దాగుందనడంలో సందేహమే లేదు.. అంతమైపోతుందనే సందర్భంలో మళ్లీ తెరపైకి లంగావోణీ సాంప్రదాయం రావడంతో.. మార్కెట్లో రకరకాల రంగులలో లభ్యమవుతున్న లెహంగావోణీలలో కొన్ని మీకోసం...



రోజుకో కొత్త ఫ్యాషన్ మార్కెట్లోకి వస్తుంది. ముఖ్యంగా ఈ ఫ్యాషన్‌కు సంబందించి అమ్మాయిలు ఎంత ముందుంటారో.. అంత కన్ఫ్యూజన్‌గా కూడా ఉంటారు. ఫంక్షన్స్‌కి కాని, పార్టీలకి కానీ ఏం వేసుకోవాలో తెలియక తికమక పడుతుంటారు. అయితే ఇప్పుడు అలాంటి వారికి లెహెంగాలు మంచి ఉదాహరణ. ఒకప్పటి సోయగాల లంగావోణి కొత్తందాలు అద్దుకుని సౌమ్యంగా హొయలొలికిస్తోంది. నేటి ఆధునిక ప్రపంచంలో సంప్రదాయ ఫ్యాషన్ నేనేనంటూ గర్వంగా పోజులిస్తోంది. అమ్మాయిలు కూడా మిగతా రోజుల్లో మొబిలిటీ కోసమని, సల్వార్ కమీజ్లు, జీన్ ప్యాంట్లు వేసుకున్నా పండుగలకు మాత్రం లంగావోణీలే కావాలంటున్నారు. ఇందుకు బెస్ట్ ఎగ్జాంపుల్ మోడ్రన్ డిజైన్లతో... ఆధునికతను జతగా చేర్చుకున్న లంగావోణీలను కట్టుకుని ట్రెండీగా హాయ్ అంటున్నారు.

ప్రస్తుతం ఈ మార్కెట్లో ఈ లెహెంగాలు హవా నడుస్తుందనేది మాత్రం నిజం. అటు సంప్రదాయ బద్ధంగానూ.. ఆధునికంగానూ రెండింటి కాంబినేషన్స్‌లో ఇప్పుడు లెహెంగాలు వస్తున్నాయి.

ఎలాంటి వేడుకైనా సరే ఈ లెహంగాలు వేసుకుంటే అందరినీ ఆకట్టుకునేలా ఉంటాయి. కేవలం డిజైను, రంగును బట్టే కాకుండా సందర్భానికి తగినట్లుగా సెలెక్ట్ చేసుకోవాలి.. అప్పుడే ట్రెండీగా కనిపిస్తారూ.. నిండుదనం వస్తుంది. ఆధునికతను జోడించాలంటే మాత్రం ఈ తరహా లెహెంగాలకు ఓటెయ్యాల్సిందే. ఇవి కూడా ఒకే రకం కాకుండా వెడల్పాటి కుచ్చులు ఉన్న వాటిని ఎంచుకోవాలి. అంతే కాదు బ్లౌజుపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టడం ముఖ్యమే. ఈ సంక్రాతి పండుగకు వీటిని ధరించాలనుకుంటే బ్రైట్ కలర్స్‌ని ధరించడండి మీ అందం మరింత ఇనుమడిస్తుంది.













– విజయారెడ్డి

ఆహా!



వీటిని మరువొద్దు!

ప్రతి రోజు ఉదయం ఇడ్లీ, వడ, పూరి, దోసె.. మధ్యాహ్నం అయ్యేసరికి తెల్లన్నం, రాత్రి చపాతి ఇవే మనకు ఆహారం. ఎప్పుడో తప్పిస్తే చిరుధాన్యాల జోలికి వెళ్లం. ఒకప్పుడు మన ఆహారంలో సంప్రదాయంగా వచ్చే వీటిని ఈ మధ్య కాలంలో విస్మరించాం. చిరుధాన్యాలైన రాగులు, జొన్నలు, సాములు, కొర్రలు, సజ్జలు, అరికెలు వంటివన్నీ తినడం మరువకూడదు..

చిరుధాన్యాలతో అత్యధిక పీచు పదార్థం లభిస్తుంది. ఇప్పుడు తింటున్న తిండిలో పీచు పదార్థాలు లేకపోవడం వల్ల జీర్ణశక్తి లోపిస్తోంది. మలబద్ధక సమస్య పెరుగుతోంది. తద్వారా గ్యాస్‌తో పాటు మరిన్ని కొత్త సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

చిరుధాన్యాలను గోధుమల్లా మర ఆడించి తినడం కష్టం కనక.. వాటికి ప్రత్యేకమైన పిండిమర ఆడించే పరికరాలు, నూకలు దంచే యంత్రాలు చాలానే వచ్చాయి. వాటి సహాయంతో ధాన్యాలను శుభ్రం చేసి, మెత్తటి పిండి మాదిరి లేదా రవ్వలా తయారు చేసుకోవచ్చు. అలాచేసిన తర్వాత రుచికరమైన వంటలను వండుకోవచ్చు.

ముల్లంగి వెరైటీలు

ముల్లంగి ఆరోగ్యానికి ఎంతో మంచిది. ముల్లంగి దుంపలతో ముల్లంగి పులుసు, వేపుడు వంటి వివిధ రకాల వంటలు చేసుకోవచ్చు. అలాగే, మహిళల్ని వేధించే మూత్రాశయ ఇబ్బందులు మొదలుకొని క్యాన్సర్లని కట్టడి చేయడం వరకూ వివిధ సమస్యల్ని నియంత్రించగల శక్తి ముల్లంగి దుంపలకు ఉంది. రోజుకి కప్పు ముల్లంగిని సలాడ్ రూపంలో తీసుకోగలిగితే 'సి' విటమిన్ పుష్కలంగా అందుతుంది.



ముల్లంగి ఆకుకూర

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి ఆకులు పావుకేజి, ఉల్లిపాయలు 2, పచ్చిమిర్చి 2, కారం 1 టీ స్పూను, పసుపు చిటికెడు, కొత్తిమీర 1 కట్ట, ఆవపొడి అర టీ స్పూను, ఉప్పు రుచికి తగినంత, మినప్పప్పు 1 టీ స్పూను, శనగపప్పు 1 టీ స్పూను, జీలకర్ర అర టీ స్పూను, కరివేపాకు 4 రెబ్బలు.

తయారు చేయు విధానం

ముల్లంగి ఆకును శుభ్రంగా కడిగి, ఆరనిచ్చి సన్నగా తరగాలి. కడాయిలో నూనె వేసి జీలకర్ర, శనగపప్పు, మినప్పప్పులు వేయాలి. తర్వాత తరిగిన ఉల్లి, పచ్చిమిర్చి, కరివేపాకు, పసుపు వేసి 2 నిమిషాల తరువాత తరిగిన ఆకుని కలిపి మూతపెట్టి మగ్గనివ్వాలి. ఐదు నిమిషాల తర్వాత ఉప్పు, కారం చల్లాలి. కూర దించేముందు ఆవపిండిని, కొత్తిమీరను కలపాలి. అంతే హెల్తీ ముల్లంగి ఆకుకూర రెడీ అయినట్లే... వేడి వేడి అన్నంగానీ, రోటీలోకి గానీ బావుంటుంది.

ముల్లంగి చట్నీ



కావలసిన పదార్థాలు

ముల్లంగి పావుకిలో (సన్నగా తురుము కోవాలి), ఉల్లిపాయ ఒకటి, మినప్పప్పు 2 టీ స్పూన్లు, శనగపప్పు ఒక టీ స్పూను, ఎండుమిర్చి 4, పసుపు చిటికెడు, ఇంగువ చిటికెడు, చింతపండు నిమ్మకాయంత సైజులో, నూనె 2 టీ స్పూన్లు, ఆవాలు అర టీ స్పూను, కరివేపాకు కొద్దిగా, ఉప్పు తగినంత.

తయారీ విధానం

బాణలిలో ఒక టీ స్పూను నూనె పోసి వేడెక్కాక మినప్పప్పు, శనగపప్పు, ఇంగువ, ఎండుమిర్చి వేసి రెండు నిముషాలు వేగించాలి. తర్వాత బాణలిలోంచి తీసి పక్కన పెట్టుకోవాలి. అదే బాణలిలో ముల్లంగి తురుము, ఉప్పు, పసుపు, ఉల్లిపాయ ముక్కలు వేసి బాగా వేగించి, దించి చల్లారనివ్వాలి. తర్వాత వేగించిన ముల్లంగి తదితరాలను, చింతపండు వేసి మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. ఒక చిన్న బాణలిలో మిగిలిన నూనె పోసి ఆవాలు, కరివేపాకు వేసి పోపు పెట్టుకుని చట్నీలో కలపాలి.

ముల్లంగి పరాటా



కావలసిన పదార్థాలు

ముల్లంగి: 1(తురుము), ఉల్లిపాయలు: 1 (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి) పచ్చిమిర్చి: 2 (చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి) కొత్తిమీర తరుగు: 2టేబుల్ స్పూన్లు (సన్నగా తరిగి పెట్టుకోవాలి) చాట్ మసాలా: 1 టీస్పూన్, జీలకర్ర పొడి: 1/2టీస్పూన్, గోధుమ పిండి: 2కప్పులు, మైదా: 1/2 కప్పు, అజ్వైన్: 1/2 టీస్పూన్, నెయ్యి: 2 టేబుల్ స్పూన్లు, నూనె: 1టేబుల్ స్పూన్, ఉప్పు: రుచికి సరిపడా

తయారు చేయు విధానం

ముందుగా పాన్‌లో నూనె వేడి చేయాలి. నూనె వేడి అవ్వగానే, అందులో జీలకర్ర, పచ్చిమిర్చి ముక్కలు వేసి వేగించాలి. తర్వాత అందులోనే ఉల్లిపాయ ముక్కలు వేసి మరో 3, 4 నిముషాల వేగించాలి. తర్వాత అందులో ముల్లంగి తురుమును వేసి తక్కువ మంట మీద ఐదు నిముషాల పాటు బాగా ఫ్రై చేయాలి. తర్వాత అందులోనే ఉప్పు, కొత్తిమీర తరుగు, చాట్ మసాలా వేసి బాగా మిక్స్ చేసి మరో ఐదు నిముషాల ఫ్రై చేయాలి. తర్వాత స్టౌ ఆఫ్ చేసి చల్లారనివ్వాలి. ఇప్పుడు ఒక బౌల్లో మైద, గోధుమపిండి, ఇంగువ, ఉప్పు, ఇక చెంచా నెయ్యి వేసి, తగినన్ని గోరువెచ్చని నీళ్ళు పోసి చపాతీ పిండిలా మెత్తగా కలిపి పక్కన పెట్టుకోవాలి. తర్వాత చపాతీ పిండిని చిన్నచిన్న ఉండలు చేసుకొని మధ్యలో వత్తుకొని అందులో ఫ్రై చేసి పెట్టుకొన్న ముల్లంగి మిశ్రమాన్ని ఒక చెంచా పెట్టి కవర్ చేయాలి. ఇలా అన్ని చాపాతీ బాల్స్ నింపి పెట్టుకొన్న తర్వాత ఒక్కొక్కటే చపాతీ కర్రతో చపాతీలా వత్తుకోవాలి. దీన్ని పాన్ మీద నూనె వేసి ఈ పరాటాలను రెండు వైపులా బాగా కాలేలా మీడియం మంట మీద కాల్చుకోవాలి. అంతే ముల్లంగి పరాటా రెడీ.

హెల్త్

ప్రజారోగ్యాన్ని కాపాడడంలో నర్సుల పాత్ర కీలకం.

ప్రభుత్వాలు కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నప్పటికీ ప్రజారోగ్య రంగం బలపడవలసినంతగా బలపడడం లేదు. ప్రజారోగ్య రంగాన్ని క్షేత్రస్థాయి నుంచి ప్రక్షాళన చేసేందుకు కొంత ప్రణాళికాయుతంగా వ్యవహరించడం ద్వారా పెద్దగా ఖర్చు లేకుండానే ప్రజలను రోగాల బారిన పడకుండా కాపాడడంతోపాటు ప్రాథమిక స్థాయిలోనే సులభమైన చికిత్స అందించేందుకు వీలుంది. ఈ క్రమంలో ఆరోగ్య రంగంలో వెన్నెముకగా భావించే నర్సులతోపాటు గ్రామాల స్థాయిలో కొద్ది ఏర్పాట్లు చేసుకుంటే సరిపోతుంది. క్షేత్రస్థాయిలో ప్రాథమిక స్థాయిలో ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా సంక్లిష్టమైన కేసులు, చికిత్సల సంఖ్య తగ్గి పరోక్షంగా వెచ్చించాల్సిన బడ్జెట్ కూడా తగ్గుతుంది. గ్రామాల్లో వైద్య సేవలందించేందుకు అవసరమైన మేరకు వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రాథమిక వైద్య చికిత్స విభాగంలో నర్సుల పాత్రను పెంచడం ద్వారా ప్రజారోగ్య రంగాన్ని మెరుగు చేయవచ్చని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించిన విషయాన్ని ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకో వాలి. తదనుగుణంగా ప్రతి గ్రామానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతోపాటు నర్సులను, ఇతర క్రింది స్థాయి సిబ్బందిని అందుబాటులో ఉంచడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చు. ఈ దిశలో ప్రభుత్వాలు మొదటగా నివారణపై దృష్టి సారించాలి.

ఇందు కోసం ప్రభుత్వాలు నాలుగు దశల్లో చర్యలు తీసుకోవాలి. వీటిలో మెరుగైన ప్రజా రవాణా, కల్తీ లేని ఆహారం, నీరు, స్వచ్ఛమైన గాలి, సారవంతమైన నేలను పరిరక్షించే చర్యలు చేపట్టాలి.

మెరుగైన ప్రజా రవాణా కలిగి ఉండాలి

అందరూ అనుకోవచ్చు ప్రజా రవాణాకు ప్రజారోగ్యానికి సంబంధమేముందని.

ఉదాహరణకు : గర్భవతి అయిన ఒక ఐదు నెలల స్త్రీ ఒక బస్సులో ప్రయాణిస్తూ ఉంది అనుకొందాం. ఆ రోడ్డు మార్గమున గుంతలు ఉండడం వలన వాహనం ఎగుడు దిగుడుగా ప్రయాణిస్తుంది. అందువలన ఆ స్త్రీ గర్భానికి ప్రమాదం వచ్చే అవకాశం ఉంది. ఇది తల్లీ బిడ్డ ఇద్దరి ఆరోగ్యం పై ప్రభావం చూపుతుంది. అలాగే వెన్నుముక సంబంధించిన సమస్యలకు గురిఅవుతూ ఉంటారు. అధికంగా ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కనుక సరైన రోడ్డు మార్గం ఉండక పోవడం వలన.. ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకున్నట్లు అవుతుంది.. ఇది ఒక విధంగా ప్రభుత్వానికి భారమే. సదరు వ్యక్తి కుటుంబానికి భారమే అవుతుంది.

ఆహార పదార్థాలు

మనిషికి స్వార్థం పెరగడం వల్లన డబ్బు కోసం ఎంతటి నీచమైన పనికి ఒడికడుతున్నాడో అందరికి తెలిసిందే. పసిపిల్లలు తాగే పాలు మొదలు.. పండు ముసలివాళ్ళు తాగే అంబలి వరకు అంతా కల్తీ మయం.. కల్తీ ఆహార పదార్థాలు ఒక్కటి కూడా బజారులోనికి రావడం లేదంటే అతిశయోక్తి కాదు. తాగే నీళ్లు కూడా కల్తీ చేశారు. వాటర్ ప్లాంట్‌లు అన్ని గ్రామాల్లో, నగరాలలో పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. సదరు వాటర్ ప్లాంట్ యజమాని తనకు ఎక్కువ ఆదాయం రావాలని, నీళ్లు ఎక్కువ తాగాలి అని అందులో ఒక పదార్థం కలుపుతారు. దాని వలన అధికంగా దాహం వేస్తుంది. మరల మరల నీళ్ళు తాగాలనిపిస్తుంది. ఆ నీళ్లు తాగడం వలన ఎముకల సాంద్రత తగ్గుతుంది. జాయింట్స్‌లో అరుగుదల పెరుగుతుంది. జాయింట్స్ అరుగుదలకు కారణాల్లో ఇదొకటి. ఈ కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల అనేక రోగాలకు మానవులు నేడు గురిఅవుతున్నారు.అతి చిన్న వయస్సులోనే అనేక మంది హృదయసంబంధమైన వ్యాధులకు గురి అవుతున్నారు. ఈ కల్తీ ఆహార పదార్థాలు భుజించడం వలన అతి పిన్న వయస్సులోనే అనేక మంది స్థూలకాయంతో బాధపడుతున్నారు. నేడు ప్రతి పదిమందిలో ఏడుగురికి కళ్ళాద్దాలు వేసుకోవలసిన పరిస్థితులు మనం చూస్తూనే ఉన్నాం. మన పెద్దలు ఇంతగా ఏనాడు ఇన్నిరోగాలకు గురి అవ్వలేదు. కానీ నేడు.. అనేక రోగాలు కొత్తగా పుట్టుకొస్తున్నాయి.. కారణం మనమే. కల్తీ ఆహార పదార్థాలను ప్రభుత్వం కట్టడి చేయాలి. ప్రజలకు స్వచ్ఛమైన నీరును ప్రభుత్వాలు అందించగలగాలి.

స్వచ్ఛమైన గాలి

మనం పీలుస్తున్న గాలి చాలామటుకు కలుషితమవుతున్నదని అనేక ల్యాబ్ రిపోర్ట్స్ చెప్తున్నాయి. గాలిలో ధూళి కణాలు అధిక శాతంలో చేరుతున్నాయి.దీనివలన అనేక మంది శ్వాసకోశ వ్యాధు లకు గురి అవుతున్నారు. పట్టణాల్లో జనాభా చాలా ఎక్కువగా ఉంటోంది. 80 శాతం మంది సొంత వాహనాలు కలిగి ఉన్నారు. వీరు చిన్న చిన్న పనులకు కూడా తమ వాహనాలను వాడడం వలన శారీరక శ్రమ తగ్గి రోగాలకు గురి అవుతున్నారు. అదే విధంగా చాలా మట్టుకు 15 సంవత్స రాలపై బడిన వాహనాలను కూడా వాడడం వలన అధిక శాతం కాలుష్యం వెలువడుతున్నాది. ప్రభు త్వం కఠినంగా చట్టాలు అమలు చేసి 15 సంవత్సరాలు పైబడిన వాహనాలను రోడ్డుమీదకు రాకుండా చూడాలి. అలాగే పరిశ్రమల నుండి వెలువడే కాలుష్య వాయువులపై నియంత్రణ ఉండాలి.

సారవంతమైన నేల

మనిషికి, నేలకు విడదీయరాని బంధం ఉంది. మనం తినే ఆహార పదార్థాలు నేల నుండి వచ్చేవే. అంతటి ప్రాముఖ్యత గల నేల కలుషితమౌతుంది.

పరిశ్రమల నుండి వెలువడే కాలుష్యం నేరుగా భూమిలోనే ఇంకుతుంది. సదరు భూమి మొత్తం ఆయా రసాయనాలకు గురై సారవంతమైన నేల కాస్తా పంటల సాగుకు కూడా పనికి రాకుండా పోతున్నది. నేడు చిన్న చిన్న పనులకు కూడా ప్లాస్టిక్ వస్తువులు వాడుతున్నాము. ప్లాస్టిక్ వస్తువులు లేని మానవ జీవితాన్ని ఊహించడానికే కష్టంగా ఉంది. నేడు అంతగా ప్లాస్టిక్ వస్తువులకు మానవులు అలవాటు పడిపోయారు. మనం వాడే ప్లాస్టిక్ వస్తువులు నేరుగా భూమిలో కరగవు. అది పర్యావరణాన్నికి ఎంత ప్రమాదం. మనం పండించే పంటలకు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గి రసాయన ఎరువుల వాడకం అధికంగా పెరగడం వల్ల భూమి సారాన్ని కోల్పోతున్నది. రసాయన ఎరువులతో పండిన పంటలు పుష్కలంగా నేడు మనం తింటున్నాము. ఇది కూడా ఒక కారణమే రోగాలు రావడానికి. నగరాలలో నేడు సారవంతమైన నేలకు బదులు అంతటా కాంక్రీటు నేల కనిపిస్తున్నది. చెట్లకు బదులు కృత్రిమ మొక్కలు కనిపిస్తున్నాయి. నగరాలనుండి వెలువడే మురికి నీళ్లు ఎక్కడ ఇంకుతున్నాయి. అవే నీళ్లు కొన్ని ప్రాంతాల్లో పంటలకు వాడుతున్నారు. దీని వలన పండే పంటలు మానవ ఆరోగ్యానికి శ్రేయస్కరం కాదు.

ప్రాథమిక స్థాయిలో చికిత్స

ప్రాథమిక స్థాయిలో చికిత్సను మెరుగు పరచడం ద్వారా ప్రజలకు ప్రాథమిక స్థాయిలోనే వైద్యం అందడంతో పాటు ప్రభుత్వాలు పెద్దాసుపత్రులకు పెట్టే వ్యయం కూడా తగ్గుతుంది. తద్వారా ఆ నిధులను ఇతర ప్రజాభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చు. తక్కువ ఖర్చుతో ప్రజారోగ్యాన్ని మెరుగు పరచవచ్చు. ప్రభుత్వం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక గ్రామ అధికారిని నియమించాలి అని భావించిన్నట్టే ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ప్రాథమిక చికిత్స కేంద్రంను ఏర్పాటు చేసి ఒక స్టాఫ్ నర్సును నియమించాలి. స్టాఫ్ నర్సుతో పాటు ఒక ఏఎన్ఎంను, ఇద్దరు ఆశా కార్యకర్తలను నియమించాలి. వైద్యులు వెళ్లలేని మారు మూల గ్రామాలకు, తండాలకు నర్సులు వెళ్లి వైద్యం చేసి ప్రజలకు ఆరోగ్యాన్ని అందించగలుగుతారు. ప్రతి గ్రామ పంచాయతీ లో స్టాఫ్ నర్సు ఉండడం వలన ప్రాథమిక చికిత్స అందించగలరు.

అంతే కాకుండా ప్రభుత్వాలకు ఉపయోగపడే విధంగా సదరు గ్రామ పంచాయతిలోని ప్రతి పౌరుని హెల్త్ ప్రొఫైల్ (ఆరోగ్య నివేదికను) వారు తయారు చేయగలరు. గ్రామంలోని ప్రతి పౌరుని ఆరోగ్య పరిస్థితిని వారు అంచనా వేయగలరు. పౌరుని ఆరోగ్య స్థితిని బట్టి వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేయడమా లేదా బోధనా వైద్యశాలకు పంపించడమో జరుగుతుంది. అంతే గాకుండా ప్రతి ఇంటికి వెళ్లి పౌరుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని చిన్న చిన్న రోగాలకు అక్కడే మందులు ఇవ్వడం జరుగుతుంది. దీనితో ప్రజలకు ఇంటి వద్దకే ప్రాథమిక వైద్యం చేరుతుంది. గర్భిణులు ఉంటే వారికి ఆరోగ్య నియమాలను సకాలంలో చేపట్టడం జరుగుతుంది. అలాగే సహజ కాన్పులు జరిగేలా వారిని ప్రోత్సహిస్తారు. దీనితో నాణ్యమైన వైద్యాన్ని ప్రభుత్వం ప్రజలకు అందించగలదు. ప్రజలు కూడా తాము ఉన్నచోటనే వైద్యాన్ని అందిపుచ్చుకోగలుగుతారు. ఈ చర్యల కారణంగా ప్రజలు అనవసరమైన నాటు వైద్యాలకు గాని, నకిలీ వైద్యుల చేతుల్లో మోసపోవడాన్ని కూడా నివారిస్తుంది. సదరు గ్రామ పంచాయతీ ప్రజలకు ఎలాంటి ఆహారనియమాలు పాటించాలి. పౌష్టికాహారం ఏవిధంగా పిల్లలకు అందించాలి. గర్భిణీ స్త్రీలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి బోధించడం జరుగుతుంది. చిన్న పిల్లలకు ఎప్పుడు ఏఏ టీకాలు ఇవ్వాలి అన్నీ విడమరిచి బోధిస్తారు. కుటుంబ నియంత్రణ గురించి పౌరులకు అర్థం అయ్యే విధంగా బోధిస్తారు. అక్కడ ఉన్న నర్సు రోగి ఆరోగ్య పరిస్థితిని బట్టి సరైన నిర్ణయం తీసుకొని రోగికి న్యాయం చేయగలుగుతారు. ఈపాటికే అభివృద్ధి చెందిన దేశాలలో నర్సుల సేవలను నర్సింగ్ ప్రాక్టీషనర్‌గా వాడుకుంటుండడంతో ఆ దేశాలు ఆరోగ్యంలో ముందంజలో ఉంటున్నాయి.

ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనలివే

ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా అందరికి అందుబాటులో వైద్యం ఉండాలని, అందాలి అని సూచిస్తున్నది. అయితే పాత పద్ధతిలో వైద్యులతోనే ప్రాథమిక ఆరోగ్య రంగం మెరుగుపరచాలని చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. వారి పరిశోధనల్లో తేలిందేమిటంటే ఆరోగ్యం అందరికి అందాలి అంటే నర్సెస్‌కు మరి కొంత శిక్షణ ఇచ్చి వారి సేవలను ప్రాథమిక రంగంలో విస్తృతంగా వాడుకోవాలని. ఈ మేరకు 2018వ సంవత్సరంలో ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్స్‌తో కలసి ఒక కార్యక్రమాన్ని మొదలు పెట్టారు. అదే నర్సింగ్ నౌ అనే కార్యక్రమం. ఇది మూడు సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలలో ఈ కార్యక్రమం గురించి ప్రచారం చేయడం జరుగుతుంది. (2018 –2020). ప్రపంచవ్యాప్తంగా నర్సింగ్ సాధికారత, ప్రొఫైల్ మరియు వారి స్థితిని పెంచడం ద్వారా ప్రజాఆరోగ్యం మెరుగుపరచవచ్చు అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ మరియు ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఆఫ్ నర్సుల సహకారంతో ప్రజారోగ్యాన్ని కాపాడగలము. నర్సుల భాగస్వామ్యంతో 21వ శతాబ్దపు ఆరోగ్య సవాళ్లను ఎదుర్కోవటానికి ప్రజాహృదయంలో వారి స్థానాలను పెంచి యూనివర్సల్ హెల్త్ కవరేజ్ సాధించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించుకునేందుకు నర్సులను ఆరోగ్య విధానం అమలు పరచడంలో ముఖ్యమైన పాత్ర కలిగి ఉండేలా ప్రోత్సహించడం, నర్సులను మరింత మెరుగ్గా వినియోగించుకోవడమెలా అనే విషయాలపై పరిశోధనలను ప్రోత్సహించడం, ఉత్తమ నర్సింగ్ పద్ధతుల భాగస్వామ్యం చేయడం వంటివి ఈ కార్యక్రమంలో భాగంగా ఉన్నాయి.







లక్ష్మణ్ రుఢావత్
వ్యవస్థాపకులు,
నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్



మోక్షజ్ఞతో మొదటి సినిమానా?

శ్రీ నందమూరి నట సింహం బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ సినిమా రంగ ప్రవేశం గురించి గత కొన్ని రోజులుగా వార్తలు వస్తూనే ఉన్నాయి కానీ... క్లారిటీ మాత్రం రావడం లేదు. 2017లోనే బాలయ్య మోక్షజ్ఞ సినిమా వచ్చే సంవత్సరం ఉంటుందన్నారు కానీ.. ఇప్పటివరకు ఆయన ఎనౌన్స్ చేయలేదు. ఇదిలా ఉంటే... మోక్షజ్ఞ తొలి చిత్రానికి బోయపాటి దర్శకుడు అంటూ జోరుగా ప్రచారం జరుగుతోంది.

ఈ వార్తల పై బోయపాటి స్పందించారు.

ఇంతకీ బోయపాటి స్పందన ఏంటంటే..

మోక్షజ్ఞ తొలి సినిమాకునేను దర్శకత్వం వహిస్తానని వార్తలు వస్తున్నాయి. కానీ.. వాటిలో ఏమాత్రం నిజం లేదు. మా ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా అంటే అభిమానుల్లో అంచనాలు పెరిగిపోతాయి. అందుకే మోక్షజ్ఞతో తొలి సినిమా నేను చేయాలనుకోవడం లేదు. అతని మూడు లేదా నాలుగో సినిమా నేను చేస్తానని భావిస్తున్నాను అని బోయపాటి స్పష్టత ఇచ్చారు. మరి.. మోక్షజ్ఞ తొలి చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి వస్తుందో చూడాలి.



మహేష్ ఫ్యాన్స్‌కు టెన్షన్ స్టార్ట్

సంక్రాంతి బరిలో విడుదలైన సినిమాలు ఎన్నైనా ఉండొచ్చుగానీ బోయపాటి శ్రీను రామ్ చరణ్ 'వినయ విధేయ రామ' మాత్రం ఇప్పుడు హాట్ టాపిక్. అసలు చరణ్ తో బోయపాటి చేయించిన చిత్ర విచిత్ర విన్యాసాలను ప్రేక్షకులు డైజెస్ట్ చేసుకొనేందుకు సమయం పట్టేలా ఉంది.

ఇంతలో ఫిలిం నగర్‌లో కొత్తగా వినిపిస్తున్న వార్తలు మహేష్ బాబు ఫ్యాన్స్‌కు టెన్షన్ తెప్పించేలా ఉన్నాయి. కారణం ఏంటంటే బోయపాటి మహేష్ కాంబినేషన్ లో సినిమా సెట్ అయ్యేలా ఉందట. మహేష్ బాబు ప్రస్తుతం 'మహర్షి' షూటింగ్ లో పాల్గొంటున్నాడు. ఈ సినిమా పూర్తి కాగానే సుకుమార్ దర్శకత్వంలో మరో సినిమా చేస్తాడు. మరోవైపు బోయపాటి శ్రీను బాలయ్య సినిమాకు సిద్ధం అవుతున్నాడు. అటు మహేష్‌సుకుమార్ సినిమా.. ఇటు బోయపాటి బాలయ్య సినిమా పూర్తయిన తర్వాత బోయపాటి మహేష్ సినిమా ఉంటుందని ఈ వార్తల సారాంశం.

ఇప్పుడు 'వినయ విధేయ రామ' సినిమాకు వస్తున్న రెస్పాన్స్‌ను చూసిన తర్వాత కూడా బోయపాటికి మహేష్ గ్రీన్ సిగ్నల్ ఇస్తాడా లేదా అనేది వేచి చూడాలి. ఒకవేళ బోయపాటి దర్శకత్వానికి ఒకే చెప్తే ఘు..ట్ట..మ..నే..ని డైలాగ్ కు రెడీ అయిపోవాల్సిందే. మరి బోయపాటి దర్శకత్వం ప్రిన్స్ మహేష్ కాంబినేషన్ ఏ విధంగా ఉంటుందో చూడాలి.



వైజాగ్‌లో టీఎస్ఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్

టి.ఎస్.ఆర్. టీవీ 9 నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్‌కు విశాఖపట్నం మరోసారి వేదిక కాబోతోంది. 2010 నుండీ రెండేళ్ళకు ఒకసారి కళాబంధు, సాంస్కృతిక సార్వభౌమ టి. సుబ్బరామిరెడ్డి ఈ అవార్డులను జాతీయ స్థాయిలో అందిస్తున్నారు. ఫిబ్రవరి 17వ తేదీ విశాఖపట్నం, పోర్ట్ గ్రౌండ్‌లో వేలాదిమంది సమక్షం లో ఘనంగా 2017, 2018 ఫిల్మ్ అవార్డుల ప్రదానోత్సవాన్ని జరుపుబోతున్నట్టు శనివారం టి. సుబ్బరామిరెడ్డి తెలిపారు. ఈ మీడియా సమావేశంలో జ్యూరీ ఛైర్మన్ సుబ్బరామిరెడ్డితోపాటు సభ్యులు డా. శోభనా కామినేని, పింకీరెడ్డి, నగ్మా, మీనా, పరుచూరి గోపాలకృష్ణ, నరేశ్, కె.ఎస్. రామారావు పాల్గొన్నారు. వీరితో పాటుగా జీవిత, కె. రఘురామ కృష్ణంరాజు సైతం జ్యూరీ సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

టి. సుబ్బరామిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం మాట్లాడుతూ, '2010లో మొదలు పెట్టిన ఈ అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్విఘ్నంగా కొనసాగించడం ఆనందంగా ఉందని, ఈశ్వర శక్తి, ప్రజల ప్రేమతో ఇది సాధ్యమౌతోంద'ని అన్నారు. శ్రీదేవి మెమోరియల్ అవార్డును విద్యాబాలన్‌కు అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి రజనీకాంత్, సూర్య, విక్రమ్‌తోపాటు చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్ తదితర తారలు హాజరవుతారని అన్నారు. నెల్లూరులో పుట్టిన సుబ్బరామిరెడ్డికి హైదరాబాద్, విశాఖపట్నంతో విడదీయరాని అనుబంధం ఉందని, ఆయన ఆరాధించే శివుడి ఆజ్ఞతోనే ఈ కళాసేవ అపూర్వంగా సాగుతోందని పరుచూరి గోపాలకృష్ణ చెప్పారు. తమ జ్యూరీ గౌరవప్రదంగా, అందరికీ ఆమోదయోగ్యమైన నటీనటులను అవార్డులకు ఎంపిక చేస్తుందని నరేశ్ తెలిపారు.

తెలుగు చిత్రసీమకు చెందిన అనేక మందికి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడానికి టి. సుబ్బరామిరెడ్డి కారకులని కె.యస్. రామారావు చెప్పారు. భారతీయ కళలు, సంస్కృతికి సేవ చేస్తున్న గొప్ప వ్యక్తి సుబ్బరామిరెడ్డి అని నగ్మా అన్నారు. గతంలో అవార్డుల కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యానని, ఆ తర్వాత 'దృశ్యం' చిత్రానికి గానూ ఉత్తమ నటిగా అవార్డును అందుకున్నానని, ఇప్పుడు జ్యూరీలో ఉండటం ఆనందంగా ఉందని మీనా తెలిపారు. రాజకీయ, పారిశ్రామిక, కళా రంగాలలో తనదైన ముద్ర వేసిన టి. సుబ్బరామిరెడ్డి జీవితాన్ని బయోపిక్ గా రూపొందించాల్సిన అవశ్యకత ఉందని శోభనా కామినేని అభిప్రాయపడ్డారు. తన తండ్రికి వేరెవ్వరూ సాటిరారని, అతి త్వరలోనే ఆయన ఆటోబయోగ్రఫీని విడుదల చేయబోతున్నామని పింకీ రెడ్డి చెప్పారు.



నాని నిర్మాణంలో సమంత హీరోయిన్

టాలీవుడ్ అందాల రాశి సమంత నటన ప్రాధాన్యత ఉన్న పాత్రల్లో కనిపించేందుకు సిద్ధమవుతోంది. పెళ్లి తర్వాత కూడా సినిమాల్లో నటిస్తూ ఓ వెలుగు వెలిగిపోతున్న సమంత.. తాజాగా లేడి ఓరియెంటెడ్ సినిమాలో నటించేందుకు సిద్ధమైంది. 'అ' చిత్రంతో నిర్మాతగా మారిన హీరో నాని త్వరలో మరో సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రానికి ప్రముఖ రచయిత విజయేంద్ర ప్రసాద్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ కథానాయిక ప్రధాన చిత్రంలో సమంత ప్రధాన పాత్ర పోషించే అవకాశం వుందని తెలుస్తోంది.

కాగా సమంత, నాని గతంలో ఎటో వెళ్లిపోయింది మనసు, ఈగ సినిమాల్లో నటించారు. ఆ సాన్నిహిత్యంతోనే నాని నిర్మాణంలో నటించడానికి సమంత ఒప్పుకుందని తెలుస్తోంది. ఈ చిత్రం షూటింగ్ వేసవిలో విడుదల కానుంది. ప్రస్తుతం భర్త చైతూతో సమ్మూ ఫారిన్ ట్రిప్పేసింది. ఇంకా భర్తతో కలిసి సమంత మజిలీ సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే.



విశాల్‌ది లవ్ మ్యారేజేనా?

కోలీవుడ్ స్టార్ హీరో... తమిళ్ ఫిలిం ప్రొడ్యూసర్ కౌన్సిల్ ప్రెసిడెంట్, నడిగర్ సంఘం సెక్రటరీ.. విశాల్ త్వరలో పెళ్లాడబోతున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయాన్ని స్వయంగా అతని తండ్రి జీకే రెడ్డి తెలిపారు. అలాగే తాజాగా విశాల్ కూడా తాను వచ్చే సంవత్సరం పెళ్లి చేసుకోబోతున్నట్టు చెప్పి క్లారిటీ ఇచ్చాడు. అది పెద్దలు కుదిర్చిన వివాహం కాదని.. ప్రేమ వివాహమని విశాల్ వెల్లడించారు. త్వరలోనే ఎంగేజ్‌మెంట్ కూడా జరగనుందని విశాల్ స్పష్టం చేశాడు.

ఇదిలా ఉంటే... ఇరు కుటుంబాలకు చెందిన పెళ్లి పెద్దలు త్వరలో కలుసుకొని నిశ్చితార్థానికి సంబంధించిన విషయాలు.. ఆ డేట్స్ వగైరా విషయాలు మాట్లాడుకోనున్నట్లు సమాచారం అందుతుంది. అదేవిధంగా... విశాల్ చేసుకోబోయే అమ్మాయి పేరు కూడా బైటకు వచ్చింది. ఆమె పేరు అనీషా. హైదరాబాద్‌కి చెందిన విజయ్ రెడ్డి, పద్మజ దంపతుల కుమార్తె. విజయ్ రెడ్డి బిజినెస్ చేస్తున్నారు. విశాల్ నడిగర్ సంఘం కొత్త భవనం పూర్తయ్యాకే పెళ్లి చేసుకుంటానని ఇప్పటికే ప్రకటించారు. దాంతో అనీషా, విశాల్ ఎంగేజ్‌మెంట్ మాత్రమే జరుపుకొని.. అదే రోజు కానీ... ఆ తర్వాత కానీ... పెళ్లి డేట్ ఫిక్స్ చేసుకోవచ్చనే టాక్ నడుస్తోంది.

కండీషన్స్ అప్లై - శృతిహాసన్

గ్లామర్ డాల్ శృతిహాసన్‌కు కమల్ కుమార్తెగానే కాకుండా తనకంటూ ఒక మంచి పేరుంది. తెలుగు, తమిళ, హిందీ బాషల్లో నటిస్తూ తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. తాజాగా దర్శకులతో శృతి కొన్ని కామెంట్లు చేశారు. షూటింగ్ సమయంలో స్వేచ్ఛ ఇవ్వని దర్శకులతో నేను పనిచేయనని తేల్చేసింది శృతి హాసన్.

నాకు నటన తెలుసు. ఎన్నో సినిమాలు చేశాను. దర్శకుడు నాకు నటన కాదు నేర్పించాల్సింది. నాకు చేయాల్సిన షాట్ చెబితే చాలు నేను చేసేస్తా. అలా కాకుండా దగ్గరికి రామ్మా. కూర్చోమ్మా. ఇలా చేయాలి అని సలహాలిస్తే మాత్రం చేయను. ఎందుకంటే నా నటన అందరికీ తెలుసు. నాకు లక్షలమంది ప్రేక్షకులున్నారంటోంది శృతి హాసన్. దర్శకులకు షరతులు పెడితే శృతి హాసన్ కు అవకాశాలు తగ్గిపోవడం ఖాయమంటున్నారు సినీవిశ్లేషకులు.





దుమ్ము దులిపేసిన అనసూయ

టాలీవుడ్‌లో తక్కువ కాలంలో ఎక్కువ పాపులారిటీ తెచ్చుకున్న యాంకర్ అనసూయ. రంగస్థలం సినిమాలో రంగమ్మత్తగా కనిపించి అందరినీ అలరించింది. అంతేకాదు నాగార్జున, సాయి ధరమ్ తేజ్ అలాంటి వారితో నటించింది. సాయి ధరమ్ తేజ్‌తో అయితే ఏకంగా సూయ... సూయ అనసూయ అంటూ ఒక పాటందుకుంది. ఐటెం సాంగ్‌లో అనసూయ డ్యాన్స్ చూసిన యువ ప్రేక్షకులు ఎగిరి గంతేశారు.

అయితే మళ్ళీ అలాంటి ఛాన్స్ వచ్చింది మన అనసూయకి అదే ఎఫ్2 సినిమాలో మరోసారి అనసూయ ఐటెం సాంగ్ చేసి కుర్రకారు గుండెల్లో స్థిరపడిపోయే స్థానం కొట్టేసింది. దేవిశ్రీ అంటేనే ఐటెం సాంగ్ గురించి పెద్దగా చెప్పనవసరం లేదు. ఆయన మ్యూజిక్ అందించే ప్రతి ఐటెం సాంగ్ హిట్టే. ఎఫ్2 సినిమాలో అనసూయ అందాలను బాగా చూపించారు.ఈ ఐటెం సాంగ్‌లో వెంకటేష్‌తో కలిసి దుమ్ము రేపే డ్యాన్స్ చేసింది అనసూయ. మరి ఈ సాంగ్ చూడాలంటే సినిమా చూడాల్సిందే అంటుంది అనసూయ.

అసలేం జరిగింది?

ఎక్సోడస్ మీడియా నిర్మిస్తున్న అసలేం జరిగింది? చిత్రం పోస్టర్‌ను ఎంపీ సంతోష్ కుమార్ శనివారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. శ్రీమతి నీలిమా ప్రొడ్యూసర్‌గా శ్రీరాం హీరోగా రూపొందుతున్న ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. తెలంగాణ రాష్ట్రంలో ఇంతవరకూ ఎవరూ తీయని కొత్త ప్రాంతాల్లో షూటింగ్ జరపాలనుకోవడం అభినందనీయమన్నారు. ఇందుకోసం చిత్ర యూనిట్ ఆరు నెలల పాటు తెలంగాణలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం గొప్ప విషయమన్నారు. ఈ చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయం అవుతున్న కెమెరామన్ ఎన్వీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీరాం హీరోగా రూపొందుతున్న ఈ చిత్రానికి మ్యూజిక్కు మహావీర్ అందిస్తున్నారు. రామగోపాల్ వర్మ నిర్మించిన బైరవగీత విలన్ విజయ్ రామ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కథ నెర్రపల్లి వాసు అందించారు. ఫిబ్రవరి 11 నుంచి ఈ సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందని... రెండు షెడ్యూళ్లలో చిత్రీకరణ పూర్తి చేస్తామని నిర్మాత కె. నీలిమా తెలిపారు.

పాటల రచయిత: చిర్రావూరి విజయ్ కుమార్, భాగ్యలక్ష్మి, వెంకటేష్. విజయ్ ఏసుదాస్, విజయ్ ప్రకాష్, యాజిన్ నిజార్, రాంకీ, భార్గవి పిళ్లై తదితరులు చిత్ర గీతాలను ఆలపించారు.



స్పెషల్ హోమ్

మొటిమ కూడ ముత్యమే!



కావలసినవి :

ఒక అరటిపండు గుజ్జు, ఒక టీ స్పూన్ తేనె, ఒక టీ స్పూను నిమ్మరసం

తయారీ విధానం :

అరటిని చిన్న ముక్కలుగా కట్ చేసి, గ్రైండర్‌లో వేసి పేస్టులా తయారు చేయాలి. ఈ మిశ్రమానికి ఒక టేబుల్ స్పూను తేనెను, నిమ్మరసాన్ని బాగా కలపాలి. ఈ పేస్టును ముఖానికి అప్లై చేసి, 30 నిమిషాల పాటు బాగా ఆరేలా ఉంచి, తర్వాత చల్లని నీటితో మీ ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. మంచి ఫలితం ఉంటుంది. ఈ ఫేస్ ప్యాక్‌ను వారానికి రెండుసార్లు వేసుకోవచ్చు.

శిరోజాల సింగారం



పండుగ రోజు సూర్యోదయానికి ముందే నిద్ర లేచి తల స్నానం చేసిగాని పనులు మొదలు పెట్టరు చాలావరకు. తల స్నానానికి సాంప్రదాయ పద్ధతే మేలైనది,ఆరోగ్యకరం అని అంటారు ఆయుర్వేద నిపుణులు. సహజ సిద్ధమైన కుంకుడు కాయ ,శీకాకాయ రసం తో జుట్టు శుభ్రం చేసుకొని ,సాంబ్రాణి ధూపం తో ఆరబెడితే కురులు ఆరోగ్యాంగా ,అందంగా ,సువాసనభరితంగా వుంటాయని అంటున్నారు. కానీ ఈ స్పీడు యుగంలో కుంకుడు , శీకాకాయలకు ప్రత్యామ్నాయంగా షాంపూలు ప్రధమ పాత్ర పోషిస్తున్నాయి. షాంపూ ఎంపిక నుంచి వాడకం వరకు సరియైన జాగ్రత్తలు తీసుకుంటే అందమైన ఆరోగ్యకరమైన జుట్టు మీ సొంతం అవుతుంది.పండుగ రోజు ప్రత్యేకంగా సింగారించుకోవడానికి కూడా జుట్టు చెప్పిన మాట వింటుంది. తలా స్నానానికి ముందు రోజు గోరువెచ్చటి కొబ్బరి నూనెతో జుట్టు కుదుళ్లకు మునివేళ్లతో మసాజ్ చేయాలి. మరునాడు తలస్నానానికి ముందు చల్లటి నీళ్లతో జుట్టును ముందుగా కడిగినట్టు చేసి బాగా తడిసిన తరువాత షాంపూ రుద్దుకోవాలి. తడి జుట్టును సుతి మెత్తగా పలుచటి టవల్ తో తుడుచుకొని జుట్టు వరకే కండీషనర్ అప్లై చేయాలి. తడి జుట్టును తొందరపడి దువ్వొద్దు.తడి ఆరడానికి డ్రైయర్ వాడొద్దు. కండీషనర్ జుట్టును మృదువుగా ఉంచుతుంది. ఆఖరున నచ్చిన హెయిర్ స్టైల్ తో పండుగ రోజు అందంగా ముస్తాబు కావచ్చు.

మార్కెట్లో రక రకాల షాంపూలు, కండీషనర్లు అందుబాటులో ఉన్నాయి.

ఆరోగ్యమైన, ఒత్తైన కేశాలను పొందడానికి మంచి పోషకాలతో కూడిన ఆహారం మాత్రమే చక్కటి పరిష్కారం. నిజానికి రసాయనాలతో కూడిన షాంపూలు జుట్టులో ఉండే పోషకాలను హరించివేసి, జుట్టును నిర్వీర్యం చేస్తాయి.

షాంపూ... కొన్ని వాస్తవాలు!

కేశాల రక్షణకు సౌందర్యానికి గృహవైద్య విధానాలు ప్రతిసారి ఫలించకపోవచ్చు. కొన్ని చిట్కాలు, ఒక తరం నుండి ఇంకో తరానికి వారసత్వంగా వస్తున్నాయి. కానీ ఇవి జుట్టు నాణ్యత, ఆరోగ్యాన్ని దెబ్బతీసే అవకాశం లేకపోలేదు. కొందరికి కుంకుడు కాయ వల్ల జుట్టు డ్రై అయిపోయి పెళుసుబారుతుంది. నిమ్మకాయ రసం కురుపులు వస్తాయి కొందరికి. అందుకని షాంపూల వైపు మొగ్గుచూపుతున్నారు.

కొంచెం షాంపూ వాడితే చాలూ..

ఎక్కువ షాంపూతో రుద్దితే జుట్టు బాగా శుభ్రపడుతుంది అనే అపోహ కొందరికి. కానీ అది నిజం కాదు. ఎక్కువ షాంపూ వాడినపుడు, నురుగు ఎక్కువగా ఏర్పడి, అది మీ కుదుళ్లను పూడ్చేసి, మురికి, జిడ్డును పట్టి ఉంచుతుంది. షాంపూచేసుకున్న అనంతరం ప్రతిసారి కండీషనర్ వాడటం వలన జుట్టు పొడిబారకుండా, కురులు తేమతో నిండి ఉంటాయి. జట్టు రకాలను బట్టి షాంపూనూ, కండీషనర్‌లను ఎంపిక చేసుకోవాలి. సీజన్‌ని బట్టి కూడా షాంపూలు మారుతాయి. డ్రై హెయిర్, ఆయిలీ హెయిర్ ఇలా..

జుట్టు ఖచ్చితమైన షాంపోకి అలవాటు పడి ఉండదు

మీ జుట్టు ఏ షాంపూకి అలవాటుపడదు. ఎప్పుడూ సల్ఫేట్ లేని అంటే మైల్డ్ షాంపూ కొనాలి. షాంపూ మాడును శుభ్రపరచడం మాత్రమే చేస్తుంది. దాని కన్నా మీరు వాడే కండీషనర్, మీ జుట్టు ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుంది.

జుట్టును బట్టి షాంపూ, కండీషనర్‌ను ఎంపిక చేసుకోవాలి

షాంపూ ను తలపై వేసుకొని జుట్టును బరబరా రుద్దకూడదు. మునివేళ్లతో గుండ్రంగా షాంపూను రాయాలి. స్నానానికి ముందు జుట్టును నానబెట్టకపోతే, మీరు ఊహించిన దానికన్నా మీ జుట్టుకు ఎక్కువ నష్టం చేసుకున్న వారవుతారు. జుట్టును నానబెట్టడం వలన షాంపూ పలుచబడి, జుట్టంతా వ్యాపిస్తుంది. ఇలా చేయక పోతే, మీ మాడు షాంపూ పూసుకోవడం వలన,అక్కడ ఉండే జుట్టు పలుచబడిపోతుంది. కండీషనర్ రాసుకునే ముందు, జుట్టును శుభ్రంగా షాంపూ మొత్తం తొలగిపోయేలా కడుక్కోండి.

ఎప్పుడూ చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి

మీ జుట్టును వేడి నీటితో శుభ్రం చేసుకోవడం వలన, జట్టులో సహజంగా ఉండే అత్యవసర తైలాలు తొలగింపబడటమే కాక కుదుళ్ళు బలహీనంగా మారతాయి. మీ జుట్టును చల్లని నీటితో శుభ్రం చేసుకున్నప్పుడు, కుదుళ్ళు గట్టిపడి, మూసుకుని వెంట్రుకను దృఢంగా పట్టి ఉంచుతాయి. మీరు చల్లని నీటిని భరించలేనట్లైతే, గోరువెచ్చని నీటిని ఉపయోగించండి. కానీ వారానికి మూడుసార్లు కంటే ఎక్కువగా తలస్నానం చేయొద్దు. చల్లని నీరు వెంట్రుకల పై కండీషనర్ ను అట్టేపట్టి ఉంచుతుంది, కనుక జుట్టు అధిక సమయం పాటు తేమగా ఉంటుంది.



రసాయనిక షాంపూలు...

షాంపూలో ఉండే వివిధ పదార్థాలు, జుట్టు సంరక్షించే వివిధ ప్రత్యేక విధులు నిర్వర్తిస్తాయి. షాంపూలలో ప్రకృతి సహజమైన పదార్థాలు అయిన పువ్వులు, కూరగాయల ఆకులకు బదులుగా, రసాయన పదార్థాలు ఉంటాయి.

షాంపూ రాసుకున్నాక మాడును రుద్దకండి


మర్ధన చేసుకోవడానికి, రుద్దడానికి చాలా తేడా ఉంది. వేళ్ళ కొనలతో సున్నితంగా షాంపూను మాడుపై మర్ధన చేసుకోవాలి. గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, నురుగు ఏర్పడటం అనేది ముఖ్యం కాదు. ఒకవేళ మీకు జిడ్డు వదలనట్టు అనిపిస్తే, రెండవసారి షాంపూ రాసుకోండి. మాడును పట్టి పట్టి రుద్దితే, జుట్టు బలహీనపడుతుంది. దీని మూలంగా జుట్టు రాలడం మొదలవుతుంది. మీరు వాడే షాంపూ ఎంత ఖరీదైనది అయినా ఫలితం ఉండదు.

షాంపూ మరీ నష్టకారి కాదు:

సాధారణంగా, షాంపూ జుట్టుకు నష్టం కలిగిస్తుందని అపోహ పడతారు కానీ అది నిజం కాదు. షాంపూ వాడటంవలన జుట్టు ఉపరితలంపై పేరుకున్న జిడ్డు తొలగి, కేశాలు తాజాగా కనిపిస్తాయి. అయినప్పటికీ, వారానికి రెండుసార్లు మించి వరుసగా వాడరాదు.

జుట్టు సంరక్షణ...

- చల్లటి గాలులు జుట్టును నిర్వీర్యం చేసే అవకాశం ఉంటుంది. సరియైన సంరక్షణ జుట్టుకు అవసరం.
- వారంలో రెండుసార్లు మాత్రమే తల స్నానం చేయాలి.
- హెయిర్ ప్యాక్‌లు నెలలో రెండుసార్లు మాత్రమే అప్లై చేయాలి. వాటిలో కొన్ని...
- అరటిపండు గుజ్జు, ఎగ్‌వైట్, ఆలివ్ ఆయిల్,
- కలబంద గుజ్జు, చెంచాడు నిమ్మరసం,
- పెరుగు, ఎగ్‌వైట్, మెంతి పొడి
- ఉసిరిపొడి, త్రిఫలచూర్ణం, హెన్న
- హెన్నాపొడర్ మూడు వంతులు, ఒక వంతు ఉసిరి, ఒక వంతు త్రిఫల చూర్ణం.
- ఆయిల్‌తో మసాజ్
- గోరువెచ్చటి కొబ్బరి నూనెతో మాడుకు మసాజ్ చేయాలి. ఆముదంతో కూడా చేయొచ్చు. వారానికి ఒకసారి ఇలా చేయడం వల్ల మాడుపై చుండ్రు, పొట్టురాలడం, డ్రైనెస్ కావడం తగ్గి మాయిశ్చర్ లెవెల్స్ పెరుగుతాయి.
- తలస్నానానికి వేడినీళ్లకు బదులు గోరువెచ్చటి నీళ్లు వాడాలి.



– మూల కవితారెడ్డి,
బ్యూటీషియన్

స్టైల్‌కి తగ్గట్టుగా...

ప్రత్యేక సందర్భాలలో అనేకరకాల హెయిర్ స్టైల్స్‌ని ప్రయత్నిస్తాం. అందుకని అనేక హీట్ స్టయిలింగ్ ప్రోడకట్స్‌ని వాడటం జరుగుతుంది. కొన్ని సార్లు వీటిని ప్రయోగించడం వల్ల కొన్ని దుష్ఫరిణామాలు ముందుగా టెస్ట్ చేసి కానీ ఉపయోగించొద్దు.



టెంపరేచర్ చూడాలి..

మార్కెట్ లో లభ్యమయ్యే హీట్ స్టైలింగ్ టూల్స్ కి 400 డిగ్రీల వరకు వెళ్లే కెపాసిటీ ఉంటుంది. శిరోజాలకు అంత హీట్ అవసరం లేదు. శిరోజాలు ఎంత దట్టంగా ఉన్నప్పటికీ మీడియం టెంపరేచర్ సరిపోతుంది. అన్ని రకాల స్టైల్స్‌కి చక్కగా సరిపోతుంది. ఎక్కువగా హీట్‌ను వాడటం వలన వెంట్రుకలు దెబ్బతింటాయి.

నాణ్యమైన సెరమ్‌ని వినియోగించాలి

హెయిర్ స్ట్రైటనర్ లేదా కర్లర్ తో హెయిర్‌ను స్టైల్ చేయాలని అనుకుంటే మంచి హీట్ ప్రొటెక్టెంట్ సెరమ్‌ను కొనుగోలు చేయాలి. ఈ సెరమ్‌ని హెయిర్‌పై అప్లై చేసి ఆ తరువాత హీట్ స్టైలింగ్ ఇన్‌స్ట్రుమెంట్ వినియోగించాలి. ఈ సెరమ్ అనేది హెయిర్‌కి అలాగే హీట్ కి మధ్య ప్రొటెక్టివ్ లేయర్‌గా పనిచేస్తుంది. హెయిర్‌కు అత్యంత కాంతిని అందిస్తుంది.

హీట్ స్టయిలింగ్

పరికరాలు జుట్టు స్టైల్‌ని బట్టి ఉంటాయి. ఫైన్‌హెయిర్, స్ట్రెయిటినింగ్ హెయిర్, డ్రై హెయిర్, రిలాక్స్‌డ్ హెయిర్, కర్ల్ హెయిర్... ఇలా స్టైల్‌ను బట్టి పరికరాన్ని ఎంపిక చేసుకోవాలి.

ఫెస్టివ్ ట్విస్ట్‌కు..

పండగ ఓల్డ్ హెయిర్ స్టైల్‌ను కాసేపు పక్కన పెట్టి కొత్త వాటికి ప్రయత్నించాలి. హెయిర్‌తో అనేక స్టైల్స్ ను ప్రయత్నించవచ్చు. షార్ట్‌గా కట్ చేయాలి. కొన్ని క్రేజీ బ్యాంగ్స్‌ను ప్రయత్నించి, హెయిర్‌ను కర్ల్ చేయాలి. స్ట్రెయిట్ అయినా చేసుకోవాలి. నచ్చిన స్టైల్‌తో కొత్తగా కనిపించాలి.

ఏదైనా డేమేజ్‌తలెత్తితే డీప్ కండిషనింగ్‌తో మేనేజ్ చేయొచ్చు. హీట్ స్టైలింగ్ ప్రోడకట్స్‌ని ఎక్కువగా వాడటం వలన హెయిర్ అనేది డేమేజ్ అవుతుంది అలాగే బలహీనపడుతుంది. అప్పుడు డీప్ కండిషనింగ్ హెయిర్ మాస్క్‌ను ప్రయత్నించవచ్చు. మీరు చేయవలసిందల్లా కోకోనట్ ఆయిల్, ఆలివ్ ఆయిల్ లేదా కొన్ని రకాల ఎసెన్షియల్ ఆయిల్స్ మిశ్రమాన్ని కలిపి తయారుచేయబడిన మిశ్రమంతో హాట్ ఆయిల్ మసాజ్ చేయాలి. ఫలితం ఉంటుంది.



ముంగిట్లో ముగ్గు







నాన్నకు తన కూతురే బంగారం...

షేర్ చేసుకుందాం..!

అలాంటి నాన్న తన కూతురు ను గుండెల్లో పెట్టుకుంటాడు
భుజాలపై ఎక్కించుకుంటాడు
తన హృదయం పైన నడిపించుకుంటూ తన పాదాలకు చెప్పులౌతాడు
తన బంగారు భవిష్యత్తు గురించి ఎవరూ కనని కలలు కంటాడు
కంటికి రెప్పలా కాపాడుకుంటాడు
అలాంటి తండ్రి
ఒకటి అడిగితే రెండు కొనిస్తాడు
రెండు అడిగితే నాలుగు కొనిస్తాడు
యుక్త వయసుకు రాగానే
తన ఉన్నత చదివుల కొరకు రాత్రింబవళ్ళు కష్టపడుతాడు
తన బాధ కష్టం కనబడకుండా గుండె లోనే దాచుకుంటాడు..
ఒక మంచి జీవిత భాగస్వామికొరకు వెతుకుతునే ఉంటాడు
కూతురు సుఖం సంతోషం కొరకు దేనికైనా సిద్ధపడుతాడు...
తను కోరుకున్నది జరిగితే ఈ ప్రపంచాన్నే జయించినంతగా సంబరపడుతాడు
కాని ఆవేశం ఎక్కువ ఆలోచన తక్కువ ఉన్న యువత స్వేచ్ఛ స్వతంత్ర్యం పేరుతో సొంత నిర్ణయాలతో తల్లిదండ్రులను ఎదిరిస్తున్నారు...
తమ తల్లిదండ్రులకు ఏమీ తెలియదని కించ పరుస్తున్నారు..
పెళ్ళి వయస్సు కు రాగానే ఎవరో ముక్కు మొఖం తెలియని వారికి కట్టబెడుతున్నారని అంటున్నారు...
నిజంగా ఏ తల్లిదండ్రులు అంత నీచంగా ఆలోచించరు ..పెళ్ళంటే నూరేళ్ళ పంటగా భావిస్తారు.. అటు ఏడు తరాలు ఇటు ఏడు తరాలను తల్లిదండ్రులు పరిశీలిస్తారు..
అప్పుడైనా నచ్చితేనే ఆ అమ్మాయికి కూడా నచ్చితే ఒప్పుకుంటారు...
ఏ తండ్రి కూడా తన కూతురు ఏమైనా ఫర్వాలేదని అనుకోడు
తన కూతురు ఏలాంటి కష్టాలు పడకూడదని కోరుకుంటాడు..
కాని నేటి అమ్మాయి లు అలా ఆలోచించడం లేదు
పెళ్ళి వయస్సు వచ్చే వరకు తన తల్లిదండ్రులను విలన్లు గా చూస్తున్నారు
ప్రేమ అనే మత్తులో పడి మోసమేదో.. మోదమేదో తెలియని వయస్సులో
మేము ఒకరినొకరం అర్థం చేసుకున్నాం మాది నిజమైన ప్రేమ అనే మైకంలో తల్లిదండ్రులను ఎదురిస్తున్నారు... తల్లిదండ్రులను బలి చేస్తున్నారు..
నిజంగా మీకు అర్థం చేసుకోనే శక్తి ఉంటే నీకు జన్మనిచ్చిన నాటి నుండి నీ కోసం తన తపన అర్థమయ్యేది .. నీ గురించి కన్న కలలు అర్థం అయ్యేది.. నీ కోసం పడ్డ కష్టం అర్థం అయ్యేది..
నీ చిన్ని కాళ్ళ సరిపడే సైజు కోసం పది షాపులు తిరిగింది....
నీ పుట్టిన రోజుకి నీ సరిపడే డ్రస్ కోసం ఇరవై షాపులు తిరిగింది...
నా కూతురు అందరికంటే ముందుండాలనే ఉబలాటం..
నీవు బయటకు వెళ్ళినప్పుడు మళ్ళీ వచ్చేవరకు ఆరాటం... మీకోసం తపించే హృదయం.. అర్థం అయ్యేది
నీ బంగారు భవిష్యత్తు కొరకు ఇరవై ఏళ్ళుగా తపించే నీ తండ్రి నే అర్థం చేసుకోలేని నీవు
గతమేంటో భవిష్యత్తు ఏమిటో తెలియని ఒక వ్యక్తి గురించి ఎలా అర్థం చేసుకుంటావు...??
నాలుగు రోజులు ఉండే నీ పాదరక్షల కొరకే పది షాపులు తిరిగిన నాన్న
నిండు నూరేళ్ళు జీవించే నీకు తగిన జీవిత భాగస్వామిని ఇవ్వడని ఎలా అనుకొంటారు..
తన కొడుకులను ఒక డాక్టర్... ఇంజినీరింగ్..IAS, IPS చేస్తాడో లేదో కాని...
తన కూతురికి మాత్రం అలాంటి భాగస్వామిని తేగలడు...
కూతురు ఉన్న ఏ తండ్రి యైనా ఎక్కువ గా ఆలోచించేది తన కూతురు గురించే
అంగ రంగ వైభవంగా కూతురు వివాహం చేయాలని.. ఎన్నో కలలు కంటాడు...
ఆ కలలను సాకారం చేసుకోని గర్వంగా చెప్పుకోవాలనుకుంటాడు..
అలాంటి తండ్రి యొక్క కలలను భగ్నం చేయకండి
ప్రేమను గెలవండి.. నాన్నను గెలిపించండి
ప్రేమంటే..
ఇద్దరు మనుషులు కలవడమే కాదు
రెండు మనస్సులు కలవడమే కాదు
రెండు కుటుంబాలు కూడా కలవాలి..
అదే నిజమైన ప్రేమ
ఇది ప్రతి అమ్మాయి అర్థం చేసుకోవాలి
ఇది ఒక తండ్రి భయం
ఇది ఒక తల్లి వేదన
దయచేసి అర్థం చసుకోండి

సేకరణ: మీ స్నేహితుడు
వాట్సాప్ అభిమాని

'చిటికె'లో సాధ్యం..!



- చికెన్ ముక్కలు వేయించేటపుడు చక్కని రంగు రావాలంటే, పాలపొడిలో అద్ది వేయించాలి.
- గారెలు చేసేటపుడు నూనెలో కొద్దిగా ఉప్ప కలిపితే, ఎక్కువ నూనెని పీల్చుకోవు.
- జాడీ మూత బిగుసుకుపోతే, కొద్దిగా ఉప్ప, నూనె రాసి కొద్దిసేపయ్యాక తీస్తే సరి.

కోడిగుడ్లు రిటైల్ ధర (100కు)



హైదరాబాద్	443	విజయవాడ	453
ముంబయి	495	ఢిల్లీ	470
చెన్నై	460	బెంగళూరు	455

బ్రాయిలర్ చికెన్ ఫామ్‌గేట్ ధర (కిలో) రూ.



హైదరాబాద్	120	ఢిల్లీ	130
కరీంనగర్	115	ముంబయి	125
వరంగల్	120	చెన్నై	135

సెన్సెక్స్ –96.66

36,009



నిఫ్టీ –26.65

10,794

రూపాయి

₹70.50

(ఒక అమెరికా డాలర్‌కు)



పసిడి

32.823.53

(హైదరాబాద్‌లో) 24 క్యా..10 గ్రాములకు/(రూ.)లలో

మూడో రోజూ పెరిగిన పెట్రోల్ ధరలు



ముంబై: పెట్రో ధరలు మళ్లీ పెరుగుతున్నాయి. గత రెండు రోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్న పెట్రోలు, డీజిలు ధరలు మూడు రోజు (శనివారం) కూడా పైకే చూస్తున్నాయి. లీటరు పెట్రోల్‌పై 19 పైసలు, లీటర్ డీజిల్ ధర 29పైసలు చొప్పున పెరిగింది. అంతర్జాతీయంగా చమురు ధరలు 2శాతం తగ్గుముఖం పట్టినా, దేశీయంగా ధరలు పెరుగుతూండటం గమనార్హం. తాజా పెంపుతో ఢిల్లీలో పెట్రోలు లీటరు ధర రూ.69.26కు చేరగా, డీజిల్ ధర రూ. 63.10వద్ద ఉంది.

ముంబై : లీటర్ పెట్రోల్ ధర రూ. 75 డీజిల్ రూ.66

కోల్‌కతా : పెట్రోల్ ధర లీటరు ధర రూ. 71.39, డీజిల్ రూ .64.87

చెన్నై: లీటరు పెట్రోలు ధర రూ. 71.87 , ఉండగా డీజిల్ ధర రూ. 66.62గా ఉంది.

హైదరాబాద్: లీటర్ పెట్రోల్ ధర రూ. 73.41గా పలుకుతుండగా... డీజిల్ ధర రూ. 68.57గా ఉంది.

విజయవాడ: లీటరు పెట్రోలు ధర రూ. 72.95 , ఉండగా డీజిల్ ధర రూ. 67.76గా ఉంది.

సిటీ బ్యాంక్‌కు రూ.3 కోట్ల జరిమానా

ఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సిటీ బ్యాంకు భారీ షాక్ ఇచ్చింది. అమెరికా ప్రధాన కేంద్రంగా సేవలు అందించే సిటీ బ్యాంకుకు భారతీయ రిజర్వు బ్యాంకు రూ.3 కోట్లు జరిమానా విధించింది. 'ఫిట్‌అండ్ సబ్జెక్ట్ క్రైటీరియా'కు సంబంధించి సూచనలను పాటించలేదంటూ ఆర్‌బీఐ పెనాల్టీ విధించింది. ఆదేశాల మేరకు డైరెక్టర్ల నియామకంలో నిబంధనలు పాటించకపోవడమే ఇందుకు కారమని రిజర్వు బ్యాంకు ఓ ప్రకటనలో తెలిపింది.

సమర్థులైన డైరెక్టర్లను నియమించాలని, సరైన అర్హతలుండాలని ఆర్‌బీఐ గతంతో బ్యాంకును ఆదేశించింది. ఈ ఆదేశాలను పాటించక పోవడంతో ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకుంది. 2019, జనవరి 3న ఆర్‌బీఐ రూ.3 కోట్లు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. అయితే వినియోగదారుల లావాదేవీలతో ఈ జరిమానాకు ఎలాంటి సంబంధం లేదని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. కాగా అమెరికా ఆధారిత సిటీ బ్యాంక్ 115 సంవత్సరాలుగా భారతదేశంలో పనిచేస్తోంది. భారత్‌లో సిటీ బ్యాంకుకు 35 బ్రాంచీలు, 541 ఎటిఎంల నెట్ వర్క్స్ ఉన్నాయి. మరోవైపు జూలై 2018 లో, కేవైసీ నిబంధనలు, అక్రమ నగదు లావాదేవీలకు సంబంధించిన సూచనల ఉల్లంఘనకు సిటీబ్యాంకు 'హెచ్చరిక లేఖ' జారీ చేసింది.

భారత్‌కు 4.5 బిలియన్ డాలర్ల సాయం

- ఆసియా అభివృద్ధి బ్యాంక్ ప్రకటన



ఢిల్లీ: ఇండియాకు ఇచ్చే నిధుల సాయాన్ని 2019లో 4.5 బిలియన్ డాలర్ల(రూ.31,500 కోట్లు)కు పెంచనున్నట్టు ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ) ప్రకటించింది. భారత ఆర్థిక వ్యవస్థ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని, వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 7.6 శాతానికి పెరుగుతుందని అంచనా వేసింది. పెట్టుబడుల వృద్ధికి తోడు, జీఎస్టీ స్థిరపడటంతో ఆదాయాలు పెరుగుతాయన్న అంచనాల మేరకు ఈ గణాంకాలను ప్రకటించింది.

'భారత్‌కు 2019లో నిధుల సాయాన్ని 4.5 బిలియన్ డాలర్లకు పెంచనున్నాం. ఇందులో 3.5 బిలియన్ డాలర్లు భారత ప్రభుత్వానికి, మరో బిలియన్ డాలర్లు ప్రైవేటు రంగానికి ఇవ్వనున్నాం" అని ఏడీబీ ఇండియా డైరెక్టర్ కెనిచి యోకోయమ మీడియాకు తెలిపారు. 2018లో భారత్‌కు 3.03 బిలియన్ డాలర్ల సార్వభౌమ రుణాలు ఇచ్చేందుకు కట్టుబడినట్టు చెప్పా రు. ఓ ఏడాదిలో ఇదే గరిష్టమన్నారు. దీనికి అదనం గా ప్రైవేటు రంగానికి 557 మిలియన్ డాలర్ల రుణాలిచ్చినట్టు తెలిపారు. ప్రాజెక్టుల సంసిద్ధతపై నిధుల సాయం ఆధారపడి ఉంటుందని స్పష్టం చేశారు.

కేంద్ర ప్రభుత్వ గణాంకాల విభాగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతం జీడీపీ వృద్ధి రేటు నమోదవుతుందని అంచనా వేయగా, ఏడీబీ అంచనాలు 7.3 శాతంగా ఉన్నాయి. 201920లో వృద్ధి పుంజుకుంటుందని ఏడీబీ సీనియర్ ఎకనమిక్స్ అధికారి అభిజిత్‌సేన్ గుప్తా పేర్కొన్నారు. జీఎస్టీ అమలు, డీమోనిటైజేషన్ కారణంగా ఏర్పడిన సమస్యలు తొలగిపోయాయని, చమురు ధరల తగ్గుదల గృహ వినియోగాన్ని పెంచుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ద్రవ్య పరిమితులు, వాణిజ్య యుద్ధ ఆందోళనలు వృద్ధికి సవాళ్లుగా పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి కరెంటు ఖాతా లోటు 2.5 శాతంగా ఉంటుందని ఏడీబీ అంచనా వేసింది.

61 శాతం పెరిగిన కర్ణాటక బ్యాంక్ లాభం



ఢిల్లీ: ప్రైవేట్ రంగంలోని కర్ణాటక బ్యాంక్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక కాలంలో రూ.140 కోట్ల నికర లాభం సాధించింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.87 కోట్ల నికర లాభం వచ్చిందని, 61 శాతం వృద్ధి సాధించామని కర్ణాటక బ్యాంక్ తెలిపింది. నిర్వహణ, ఇతర ఆదాయాలు బాగా పెరగడంతో ఈ స్థాయిలో నికర లాభం పెరిగిందని తెలియజేసింది. నికర వడ్డీ ఆదాయం రూ.451 కోట్ల నుంచి 8 శాతం వృద్ధితో రూ.488 కోట్లకు పెరిగిందని పేర్కొంది. ఇతర ఆదాయం 55 శాతం ఎగసి రూ.301 కోట్లకు, నిర్వహణ లాభం 24 శాతం ఎగసి రూ.400 కోట్లకు పెరిగాయని వివరించింది. పెరిగిన కేటాయింపులు.. రుణ నాణ్యత నిలకడగా ఉన్నా, కేటాయింపులు మాత్రం పెరిగాయి. గత క్యూ3లో 3.96 శాతంగా ఉన్న స్థూల మొండి బకాయిలు ఈ క్యూ3లో 4.45 శాతానికి పెరిగాయని కర్ణాటక బ్యాంక్ పేర్కొంది. నికర మొండి బకాయిలు 2.85 శాతం నుంచి 3 శాతానికి చేరాయని వివరించింది. కేటాయింపులు 6 శాతం పెరిగి రూ.209 కోట్లకు చేరగా, ప్రొవిజన్ కవరేజ్ రేషియో 57.5 శాతం నుంచి 57.2 శాతానికి తగ్గింది. ఆర్థిక ఫలితాలు బాగా ఉండటంతో బీఎస్ఈలో కర్నాటక బ్యాంక్ షేర్ 0.6 శాతం లాభపడి రూ.116 వద్ద ముగిసింది.

చివరి త్రైమాసికంలో ఆదాయం పెంచుకున్న ఎయిరిండియా



ఢిల్లీ: గడిచిన త్రైమాసికంలో ప్రయాణికుల నుంచి వచ్చే ఆదాయం పెరిగిందని ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిరిండియా వెల్లడించింది. ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం 20శాతం పెరగగా.. ప్రయాణికుల సంఖ్య మాత్రం గతంతో పోలిస్తే నాలుగు శాతమే పెరిగిందని సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. ఉన్న విమానాలను చక్కగా, ప్రయోజనకరంగా ఉపయోగించుకోవడం వల్ల ఈ ఆదాయం పెరిగిందని తెలిపారు. 2017–18 డిసెంబరు త్రైమాసికంలో ప్రయాణికుల నుంచి రూ.4,615 కోట్ల ఆదాయం రాగా.. 2018–19 మూడో త్రైమాసికంలో రూ.5,538 కోట్లు వచ్చిందని చెప్పారు.అలాగే 2018–19లో ప్రయాణికుల సంఖ్య 55.27లక్షలుగా నమోదైందని, అంతకు ముందు ఏడాది ఈ సంఖ్య 53.28లక్షలుగా నమోదైందని ఎయిరిండియా అధికారి వెల్లడించారు. అంటే ప్రయాణికుల సంఖ్య 4శాతం పెరిగినట్లని తెలిపారు. గత త్రైమాసికంలో సంస్థ 15కొత్త విమాన సర్వీసులను ప్రారంభించినట్లు పేర్కొన్నారు. సంస్థ ఆదాయంలో 65శాతం అంతర్జాతీయ మార్గాల ద్వారా నుంచి లభిస్తోంది. మిగతాది దేశీయ విమానయానంలో వస్తుంది. ఎయిరిండియా దాదాపు రూ.48వేల కోట్ల అప్పుల్లో కూరుకుపోయిన సంగతి తెలిసిందే. గత ఏడాది మే నెలలో ప్రభుత్వం ఎయిరిండియా నుంచి పెట్టుబడుల ఉపసంహరణకు ప్రయత్నించి విఫలమైంది.

పసిడి పరుగులకు బ్రేక్



ముంబై: గత కొన్ని రోజులుగా పరుగులు పెట్టిన పసిడి ధరలకు శనివారం బ్రేక్ పడింది. శనివారం నాటి ట్రేడింగ్‌లో రూ.155 తగ్గి రూ. 33 వేల దిగువకు పడింది. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు, స్థానిక నగల తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గడంతో గత కొన్ని రోజులుగా పరుగులు పెడుతున్న పసిడి ధరకు శనివారం ఫుల్‌స్టాప్ పడింది. దేశ రాజధాని ఢిల్లీలో 99.9 స్వచ్ఛత కలిగిన బంగారం ధర పది గ్రాములకు రూ.155 తగ్గి రూ.32,875కు చేరుకోగా, 99.5 స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.32, 725గా ఉంది. కొనుగోళ్లు మందగించడమే పసిడి ధర పతనానికి కారణమని బులియన్ వర్గాలు తెలిపాయి.

మరోవైపు, వెండి కూడా కిలోకు రూ.600 తగ్గి రూ. 40 వేల కిందికు దిగి వచ్చింది. నాణేల తయారీదారులు, పారిశ్రామిక వర్గాల నుంచి డిమాండ్ తగ్గడమే ఇందుకు కారణమని ట్రేడర్లు చెబుతున్నారు. శనివారం కిలోకు రూ.600 తగ్గిన వెండి రూ.38,850కి దిగివచ్చింది.

వినియోగదారులకు గుడ్ న్యూస్ చెప్పిన ఎయిర్‌టెల్



ఢిల్లీ : భారతీయ రెండవ అతిపెద్ద టెలికాం ఆపరేటర్ భారతీ ఎయిర్‌టెల్ తన కస్టమర్లకు గుడ్ న్యూస్ చెప్పింది. ఇకపై ఇంటర్నేషనల్ రోమింగ్ యాక్టివేషన్ రుసుమును నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఇది ప్రీ పెయిడ్, పోస్ట్ పెయిడ్ చందాదారులు ఇద్దరికీ వర్తిస్తుందని తెలిపింది. ఈమేరకు ఎయిర్‌టెల్ వినియోగదారులకు సీఈఓ గోపాల్ విట్టల్ ఈ–మెయిల్ సమాచారాన్ని అందించారు. ఇకపై తమ స్మార్ట్ ప్యాక్‌లతో అంతర్జాతీయ బిల్లుల భారం గురించి విచారించకండి అని తెలిపింది. తద్వారా ఇంటర్నేషనల్ రోమింగ్ ప్యాక్‌లను పెంచుకోవాలని చూస్తోంది..

స్పోర్ట్స్

స్కూల్ ఇండియన్ ఛాంపియన్‌గా గోల్కొండ హై స్కూల్



విజయక్రాంతి, హైదరాబాద్: గోల్కొండ గవర్నమెంట్ బాయ్స్ హైస్కూల్ స్కూల్ ఇండియా కప్ 2018–19 ట్రోఫీని గెలుచుకుంది. ఖుర్షిద్ జా హుస్సేన్ ఆలం ప్లేగ్రౌండ్‌లో జరిగిన ఫైనల్ మ్యాచ్ లో హకీంపేట్ కేంద్రీయ విద్యాలయ స్కూల్‌పై గోల్కొండ గవర్నమెంటు బాయ్స్ హైస్కూల్ 3–0 తేడాతో గెలుపొందింది. మొదటి అర్ధభాగం ముగిసే సరికి 1–0 తేడాతో ఆధిక్యంలోకి దూసుకెళ్లిన గోల్కొండ స్కూల్ , రెండో అర్ధ భాగంలోనూ అదే జోరును కొనసాగించింది. సెకండ్ హాఫ్‌లో కేంద్రీయ విద్యాలయం పలు సార్లు గోల్స్ చేయడానికి ప్రయత్నించి విఫలమైంది .గోల్కొండ స్కూల్ చెందిన స్ట్రైకర్ సయ్యద్ ఇంతియాజ్ అహ్మద్ 37వ నిమిషంలో గోల్ చేసి జట్టును మరింత లీడ్‌లో తీసుకెళ్లాడు. 48వ నిమిషంలో 30 యార్డ్స్ దూరం నుండి మరో మెరుపు గోల్‌చేసి జట్టును గెలిపించాడు. . ఈ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ హాజరయ్యారు. హైదరాబాద్ గ్లోబ్ క్లబ్ వాహబ్ అన్సారీ, సయ్యద్ ఖలీదుద్దీన్, వైస్ ప్రెసిడెంట్, తదితరులు పాల్గొన్నారు.

అపర్ణ రాయ్ విజయం



పుణే: పుణేలో జరుగుతున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2019లో బలేవాడి స్టేడియంలో జరిగిన 100 మీటర్ల హర్డల్ రేసులో కేరళకు చెందిన అథ్లెట్ అపర్ణ రాయ్ విజయం సాధించింది.

హిట్ మ్యాన్ షో.. వృథా



- తొలి వన్డేలో భారత్ ఓటమి
- 34 పరుగుల తేడాతో ఆసీస్ విజయం
- టీం ఇండియాను వణికించిన ఆస్ట్రేలియా యువ బౌలర్లు
- రోహిత్ శర్మ సెంచరీ (133)
- అర్ధ శతకంతో రాణించిన ధోనీ
- ఆసీస్ 288/5
- ఇండియా 254/9

సిడ్నీ: ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా ఇక్కడ జరిగిన తొలి వన్డేలో టీమిండియా 34 పరుగుల తేడాతో పరాజయం చెందింది. ఆసీస్ నిర్దేశించిన 289 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో తొమ్మిది వికెట్ల నష్టానికి 254 పరుగులకే పరిమితమైన టీమిండియా ఓటమి చెందింది. ఈ మ్యాచ్‌లో రోహిత్ శర్మ(133;129 బంతుల్లో 10 ఫోర్లు, 6 సిక్సర్లు) సెంచరీ సాధించినప్పటికీ జట్టుకు విజయాన్ని అందించలేకపోయాడు. జట్టు స్కోరును పెంచే క్రమంలో రోహిత్ ఏడో వికెట్‌గా ఔటయ్యాడు. రోహిత్‌కు జతగా ఎంఎస్ ధోని(51; 96 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్సర్) మినహా ఎవరూ రాణించలేదు. అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్ చేసిన ఆసీస్ ఐదు వికెట్ల నష్టానికి 289 పరుగులు చేసింది. ఖవాజా(59; 81 బంతుల్లో 6 ఫోర్లు), షాన్ మార్ష్(54; 70 బంతుల్లో 4 ఫోర్లు), హ్యాండ్ స్కాంబ్(73; 61 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లు)లు హాఫ్ సెంచరీలతో రాణించడంతో పాటు మార్కస్ స్టోనిస్(47 నాటౌట్; 43 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు) ఆకట్టుకోవడంతో ఆసీస్ గౌరవప్రదమైన స్కోరు సాధించింది.అటు తర్వాత బ్యాటింగ్‌కు దిగిన భారత్ వరుస వికెట్లు కోల్పోయి ఆదిలోనే కష్టాల్లో పడింది.

నాలుగు పరుగులకే మూడు ప్రధాన వికెట్లు కోల్పోవడంతో భారత్‌పై ఒత్తిడి పెరిగింది. ఓపెనర్ శిఖర్ ధావన్ డకౌట్‌గా పెవిలియన్ చేరాడు. ధావన్ ఎదుర్కొన్న తొలి బంతికే ఔటయ్యాడు. దాంతో గోల్డెన్ డకౌట్‌గా ఔటైన అపప్రథను మూటగట్టుకున్నాడు. ఆసీస్ పేసర్ బెహ్రెన్‌డార్ఫ్ వేసిన తొలి ఓవర్ ఆఖరి బంతిని ఆడటంలో తడబడిన ధావన్ వికెట్లు ముందు దొరికిపోయాడు. అటు తర్వాత విరాట్ కోహ్లి(3) సైతం నిరాశపరచడంతో టీమిండియా నాలుగు పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆపై వెంటనే అంబటి రాయుడు డక్ ఔట్ కావడంతో భారత్ కష్టాల్లో పడింది. ఆ తరుణంలో రోహిత్–ధోనిల జోడి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దింది. వీరిద్దరూ 137 పరుగుల భాగస్వామ్యాన్ని జత చేసిన తర్వాత ధోని నాలుగో వికెట్‌గా ఔటయ్యాడు. ఆపై రోహిత్‌కు ఏ ఒక్క ఆటగాడి దగ్గర్నుంచీ సహకారం లభించలేదు. దినేశ్ కార్తీక్(12), రవీంద్ర జడేజా(8)లు నిరాశపరచడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు. చివర్లో భువనేశ్వర్ కుమార్(29 నాటౌట్; 23 బంతుల్లో 4 ఫోర్లు) ధాటిగా బ్యాటింగ్ చేసినప్పటికీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆసీస్ బౌలర్లలో యువ పేసర్ రిచర్డ్‌సన్ నాలుగు వికెట్లు సాధించగా, బెహ్రెన్‌డార్ఫ్, మార్కస్ స్టోనిస్ తలో రెండు వికెట్లు తీశారు. పీటర్ సిడెల్‌కు వికెట్ దక్కింది. ఇరు జట్ల మధ్య రెండో వన్డే మంగళవారం జరుగనుంది.







రెండో క్రికెటర్‌గా రోహిత్..

ఓపెనర్ రోహిత్ శర్మ అరుదైన ఘనత సాధించాడు. ఆస్ట్రేలియాపై అత్యధిక వన్డే సెంచరీలు సాధించిన రెండో క్రికెటర్‌గా రోహిత్ నిలిచాడు. ఇది ఆసీస్‌పై వన్డేల్లో రోహిత్‌కు 7వ సెంచరీ కాగా, ఓవరాల్‌గా 22వ వన్డే శతకం. రోహిత్ కంటే ముందు ఆసీస్‌పై అత్యధిక వన్డే సెంచరీలు సాధించిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ టెండూల్కర్ తొలి స్థానంలో ఉన్నాడు. ఆసీస్‌పై సచిన్ 9వన్డే సెంచరీలు సాధించాడు. ఈ మ్యాచ్‌లో 110 బంతుల్లో రోహిత్ సెంచరీ నమోదు చేశాడు.

1000 విజయాలతో ఆసీస్ నయా చరిత్ర

ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు అరుదైన మైలురాయిని అందుకుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో 1000వ విజయాన్ని నమోదు చేసిన ఆసీస్ సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. తొలి వన్డేలో ఆసీస్, భారత్‌పై గెలువడం ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో 1000వ విజయాన్ని ఖాతాలో వేసుకుంది. ఫలితంగా క్రికెట్ చరిత్రలో ఈ మార్కును చేరిన తొలి జట్టుగా ఆసీస్ నిలిచింది. టెస్టుల్లో 384 విజయాలు సాధించిన ఆసీస్.. వన్డేల్లో 558, టీ20ల్లో 58 విజయాలు అందుకుంది.

పదివేల క్లబ్‌లో ధోనీ

సిడ్నీ: టీమిండియా మాజీ సారథి మహేంద్రసింగ్ ధోనీ మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. అంతర్జాతీయ వన్డేల్లో పదివేల పరుగుల మైలురాయిని చేరుకున్న ఐదో భారత క్రికెటర్‌గా రికార్డులకెక్కాడు. సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన తొలి వన్డేలో ఆసీస్ పేసర్ రిచర్డ్సన్ బౌలింగ్‌లో సింగిల్ తీసిన ధోనీ తన ఖాతాలో 10 వేల పరుగులు వేసుకున్నాడు. ఇప్పటి వరకు సచిన్ టెండూల్కర్, సౌరవ్ గంగూలీ, రాహుల్ ద్రవిడ్, విరాట్ కోహ్లీ మాత్రమే పదివేల పరుగుల క్లబ్‌లో ఉండగా ఇప్పుడు ధోనీ వారి సరసన చేరాడు. నిజానికి గతేడాది నవంబరులోనే ధోనీ పదివేల పరుగుల మార్క్‌ను చేరుకోవాల్సి ఉండగా, భారత్‌తో విండీస్‌తో జరిగిన ఐదో వన్డేలో ధోనీకి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. దీంతో 9,999 పరుగుల వద్ద ఆగిపోయిన ధోనీ తాజా వన్డేలో ఆ పరుగు సాధించి రికార్డు పుస్తకంలో చోటు సంపాదించాడు. కాగా, ఆసీస్‌తో జరిగిన తాజా వన్డేలో ధోనీ అర్ధ సెంచరీ (51)తో సత్తా చాటాడు.

ఆరంభంలో వికెట్లు కోల్పోవడంతోనే ఓటమి: కోహ్లీ

ఆరంభంలో వరుసగా వికెట్లు కోల్పోవడం.. చివరిలో రోహిత్‌కు అండ దొరకకపోవడంతోనే ఓటమి చవిచూశామని టీమిం డియా కెప్టెన్ విరాట్ కోహ్లి అభిప్రాయపడ్డాడు. మ్యాచ్ అనంతరం కోహ్లి మాట్లాడుతూ.. 'ఈ రకమైన ఆటను మేం సమర్థించుకోం. ఈ మ్యాచ్‌లో బంతితో బాగానే రాణించామని అనుకుంటున్నా. ఎందుకంటే 300పైగా పరుగులు వచ్చే ఈ పిచ్‌లో ప్రత్యర్థిని 288కే పరిమితం చేశాం. కానీ ఆరంభంలోనే వరుసగా మూడు వికెట్లు కోల్పోవడం ఎప్పటికీ మంచిది కాదు. రోహిత్ అద్భుత ఆటకు ధోని మద్దతివ్వడంతో మాకు విజయావకాశాలపై ఆశలు చిగురించాయి. కానీ ధోని ఔట్ అవ్వడంతో రోహిత్‌పై తీవ్ర ఒత్తిడి నెలకొంది. రోహిత్‌కు అండగా మరో మంచి భాగస్వామ్యం నమోదైతే విజయం దక్కేది. కానీ ఆరంభంలోనే వరుసగా వికెట్లు కోల్పోవడం మా కొంప ముంచింది. ఆసీస్ మా కంటే బాగా ఆడి విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ ఫలితంతో మేం ఎలాంటి ఒత్తిడికి లోనవ్వడం లేదు. ఇలాంటి ఫలితాలు జట్టుగా ఇంకా మెరుగవ్వాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తాయి' అని చెప్పుకొచ్చాడు.

Printed and Published By Chilappagari Laxmi Rajam, on behalf of Intercontinental Publications Private Limited, Printed at Intercontinental Publications Private Limited, Survey No .713/P, Dundigal Grama Panchayat, Qutubullapur Mandal, Medchal – Malkajgiri District 500043, Published at Plot No. 1267/A, Road No. 63/A, Jubilee Hills, HYDERABAD–500033, Telangana State. Editor: Chilappagari Laxmi Rajam, RNI NO: TELTEL /2018/75203, Ph: +91 40 2355 6603, Fax No. +91 4023556604, Toll Free: 1800 599 3399.